# ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము ఫిబ్రవరి ౧౯౩౮ { సంచిక ౨

## సిద్ధవటముకోట పతనము

మల్లంపల్లి సోమశేఖర శర్మగారు

ఎప్పుడో పాతకాలపు నాటి గాథ యిది. అప్పటి కింకను కుంఫిణీవారికి మన దేశము స్వాధీనము కాలేదు. మొగలాయి ప్రభువులదే రాజ్యము. వారి తరఫున నైజాముల్ముల్కు అను పేరు గల నవాబు హైదరాబాదు రాజధానిగ దక్కను దేశమును పరిపాలించుచుండెను. ఈ హైదరాబాదు నిజాము నాడే మన యుత్తరసర్కారులందలి జమీందారీలు ఏర్పడినవి. కడప, కర్నూలు మొదలగు దక్షిణాంధ్రమండలములు నిజామునకు వశవర్తులై సామంతులుగ నుండిన నవాబుల పరిపాలనక్రింద నుండినవి. ఇట్టి నవాబులలో ఒకరికి ఆర్కాటును, మఱియొకరికి కడపయును ముఖ్యపట్టణములు. ఆర్కాటు నవాబుల రాజ్యానను, కడప నవాబుల రాజ్యానను సరిగా హద్దులు నిర్ణయించి చెప్పుట కష్టము. పదునెనిమిదవ శతాబ్ది మొదటి పాదములో ఆర్కాటు సుబాను సాదతుల్లాఖానుడును, కడప సుబాను అబ్దుల్ నబీఖానుడును పాలించుచుండిరి. కడపకు చేరువగ నుండినప్పటికి సిద్ధవటము, పోరుమామిళ్ల, బద్వేలు పరగణాలు ఆర్కాటు నవాబుక్రిందనే యుండెను. ఈమూడు పరగణాలలోను ఉండే గొప్ప కోట లన్నిటిలోకి సిద్ధవటము కోట పేరెన్నికగన్నది.

కృష్ణదేవరాయల కాలము నుండి సిద్ధవటమునకు సీమ నముపించుచు వచ్చినవారు మట్లివంశజు లయిన సూర్యవంశ క్షత్రియులు. వీరు ఈసీమలో ప్రజోపయోగకరము లయిన కార్యములు కొన్ని చేసి ప్రజల యాదరము గడించినారు. విజయనగరప్రభువులతో సంబంధబాంధవ్యములు కలిపి వీరు కొంత పేరు ప్రతిష్ఠలు సంపాదించి ప్రముఖు లయినారు. పదునేడవ శతాబ్ది ప్రారంభములో మట్లి అనంతరాజు రాజ్యమేలిన నాటికి ఇప్పటి బద్వేలు, పుల్లంపేట సిద్ధవటము తాలూకాలు మట్లివారి క్రిందనే యుండెడివి. మట్లి అనంతరామరాజు అను అనంతరాజు తాను రచియించిన 'కకుత్స్థవిజయము' అను ప్రబంధము ద్వారా తెలుగువారికి శ్రుతపూర్వుడే. ఇతడును, ఇతని తండ్రి యెల్లమరాజును ఈవంశమునకు ప్రసిద్ధులు. అనంతరాజు సిద్ధవటమున దేవాలయమండపాదులు కట్టించి సిద్ధవటమునకు కోట కట్టుదిట్టపరిచెను. తరువాత కొంతకాలమువఱకు సిద్ధవటమే మట్లివారికి రాజధానిగ నుండెను.

ఇట్లుండగా హిందూరాజ్య సౌధానికి చివర పిడుగు లాగు తళ్ళికోట యుద్ధము దాపురించినది. ఆయుద్ధభూమిలో హిందువుల శౌర్యము పరాక్రమము, సర్వము—అన్ని మఱిగిపోయినవి. తరువాత

దక్కను తురకనవాబులదే మీది చేయి యైనది. వారు విజయనగరహిందూరాజ్యమును పంచుకొనుటలో కడప, గండికోట ప్రాంతము గోలకొండ నవాబుల వశమయినది. ౧౬౮౭ లో డిల్లీ మొగలాయి పాదుషా యయిన ఔరంగజేబు గోలకొండ రాజ్యమును జయించుటతో మరల ఈప్రాంత మంతయు మొగలాయి ప్రభువులకు చేపడినది. అప్పటినుండియే దీనిని హైదరాబాదు నిజామునకు సామంతు లయిన ఆర్కాటు, కడప నవాబులు పాలించుచువచ్చిరి. ఈక్రొత్త నవాబుగిరీల యేర్పాటులో మట్టి సంస్థానికుల పరగణాలు ఆర్కాటు సుబాలో చేరిపోయినవి. ఈనవాబులు సిద్ధవటము కోటను మఱింత కట్టుదిట్టము చేయించి ఫత్తేసింగు అను నొక మహారాష్ట్రవీరుని ఖిల్లేదారుగా నియమించినారు.

దగ్గఱలో నున్న సిద్ధవటంకోట మహారాష్ట్రి ఖిల్లేదారుని క్రింద నుండుట కిట్టనది కాదు కడప నవాబు అబ్దుల్ నబీఖానునికి.

కడపకుపా అబ్దుల్ నబీఖానుని వంశమువారికి తప్పుట అనే క్రొత్త. నబీఖానుని పూర్వు లదివఱకు మొగలాయి సంస్థానములందు, దక్కను నవాబుల యొద్ద భయభక్తులతో పని చేసి, తుద కెట్లయితే నేమి యీసుబాకు నవాబుగిరి సంపాదించినారు. ఈవంశమువారు మియానా వంశజులు; పఠానులు. అందువలన ప్రజ లీనవాబులను 'మియా' లని వ్యవహరింతురు. ఈమియానాలలో కడప నేలిన మొదటి నవాబు ఈ అబ్దుల్ నబీఖానే. ఇతనికి అబ్దుల్ మహమ్మదుఖాను, అబ్దుల్ మోసింఖాను, అబ్దుల్ హామీముఖాను అబ్దుల్ కాదర్ఖాను, అబ్దుల్ ఫత్తాఖాను అని కొడుకు లేవురుండిరి. అబ్దుల్ నబీఖానునికి అబ్దుల్ మియా అని, అబ్దుల్ మోసింఖానునికి మోచామియా అని, అబ్దుల్ హామీముఖానునికి హామ్మామియా అని, బడేమియా అని నామాంతరములు కలవు. పెద్ద కొడుకు కండ్లచూపు కొన వాని గ్రుడ్డివా డనుటవల్ల ప్రజ లతనిని గ్రుడ్డి నవాబని వ్యవహరించేవారు. మియాలయిన యీకడప నవాబులయొద్ద కర్నాటకము వ్యాపారి పంతుళ్లు (మాధ్వులు) వ్యవహర్తలుగ నుండిరి. మనదేశమున పగటివేషగాండ్రు వినోదమునకు ప్రదర్శించు 'పంతులు, ఫరాణీ' వేషము ఫరాణీ లయిన యీకడప నవాబుల నాటి నవాబుల, పంతుళ్ల దర్జాలను గేలి సేయుట కేర్పడినదే యైయుండవచ్చును.

కొంచె మించుమించుగ ఆకాలమున బలమున్నవానిదే రాజ్యము; ఉపాయము గలవానిదే కోట; తంత్రములు నేర్చిన వానిదే రోజా. దొంగ యెవడో దొర యెవడో, మిత్రు డెవడో, శత్రు డెవడో తెలియని దినము లవి. మనుష్యునియందలి శౌర్యసాహసపరాక్రమములు రాచకీవితో వీరవిహారము సలిపిన దినము లవి; మనుష్యులు తమ ప్రాణముల నరచేత బెట్టుకొని సంచరించిన దినము లవి. ఆరోజులే మంచివి; ఆరోజులే చెడ్డవి. అట్టి రోజులలోనే సిద్ధవటం కోటమీద కన్ను వేసినాడు అబ్దుల్ నబీఖాను. సిద్ధవటముకోట సాధించవలెనన్న అంత సుకరము కాదు. కోట కధిపతిగ నుండిన వాడు మహారాష్ట్రుడు. అప్పటికే ఛత్రపతి శివాజీ మహారాజు నాయకత్వమున విజృంభించిన మహారాష్ట్రుల శౌర్యమును చవిచూచినారు తురకలందఱు మఱి తగిలినది వారికి దాని వేడి. అందువలన మంటీబిడ్డతో డీకొనుట యన్న ఎంతటి పఠాణీకైనను సింహముతో చెలగాటమే. మహారాష్ట్రుల అంతటి శౌర్యాగ్నిలోను హిందూహృదయ సహజము లయిన మార్దవము, ఔదార్యము, అనుకంప మొద లయిన చల్లని యుత్తమగుణములు నిగూఢముగ నున్న వని కనిపెట్టినాడు తురకబిడ్డ. ఒక చేతితో ఆనిప్పు నొగ్గించి వేఱొక చేతితో ఈ గుణములను బట్టుకొని మరాటీ కిల్లేదారు కోటమీది కెక్కదలచినాడు అబ్దుల్ నబీఖాను. కలికాలమహిమ. తంత్రముల కేమి కొదువ! తెల్లవారి లేచి చూచేసరికి పునహాపేష్వాల కట్టునుంచి మరాఠీవంతు చౌథాయి రూకల కోసమో, ఊళ్లు కొల్లగొట్టుట

కోసమో గజ్జపు స్వారులమీద కొనవచ్చె రోజులవి. ఇక నేమి! ఉపాయము తట్టినది అబ్దుల్‌నబీఖానునకు.

తనకు మహారాష్ట్రులకు రాజకార్యము తటస్థించినదని వేసినాడొక యెత్తు అబ్దుల్‌నబీఖాను. 'నా జనానాకు ఉపద్రవము శంకించుచున్నాను. దగ్గఱనున్న వారి మఱట మతమున మొండివారలను సాయము చేసికొనుట యుక్తము. నాకు మహారాష్ట్రులతోడి రాజకార్యము అనుకూలపడునంతవఱకు నా జనానా క్షేమముగా నుండుటకు సిద్ధవటము కోటలో తావిచ్చిన చాలును. ఇదే నాకు మీరు చేయగల గొప్ప యుపకారము. రాజకార్యము కుదిరిన పిదప నా జనానాను మరల కడపకు గొనిపోయెదను' అని అబ్దుల్‌నబీఖాను తన మనుష్యుల ద్వారా కిల్లేదారు రాజా ఫత్తేసింగునకు కబురు పంపెను.

రాజా ఫత్తేసింగు అబ్దుల్‌నబీఖాను పంపిన సమాచారము నాదరముతో వినెను; దగ్గఱనున్న కారణమున బంధువుల కుపకృతి చేయవలసినదే యని యాలోచించెను, నిష్కపటహృదయముతో అబ్దుల్‌నబీఖాను కోరిక నంగీకరించెను.

వెంటనే కడపనుండి నూటయేబది డోలీలు బయలుదేరినవి. ఒక్కొక్క డోలియందు నలుగురేసి పఠాణీలు సాయుధపాణులయి ప్రవేశించిరి. పైని బురకాలు కప్పిరి. భారావాహకులతో డోలీలన్నియు సిద్ధవటమునకు వెళ్లినవి.

అబ్దుల్‌నబీఖాను వెంటనే కొంత సైన్యమును జేర్చి రహస్యమార్గములగుండ సిద్ధవటమునకు పంపి కోటకు చేరువగ నుండ నియమించెను. కోటలోపల చేరిన పఠాణీలు లోపలి వారిపయి తిరుగబాటు చేసి విజృంభించిన వెంటనే కోట యవతలి వారు వారిని గలసికొని కోటను ముట్టడించి దానిని స్వాధీనము చేసికొనుట కేర్పాటులు జరగెను. అంతయు అనుకొన్న ప్రకారము జరిగిపోయెను.

ఫత్తేసింగు ఇట్టి మిత్రద్రోహమునకు సిద్ధపడియుండలేదు. కడప నవాబు ఇట్లు చేయునని యైన తలంచి యెఱుగడు. అందువలన అతని సైన్యము లేవియు యుద్ధమునకు సిద్ధమయి యుండలేదు. అబ్దుల్‌నబీఖాను కుట్ర ఫలించినది. సిద్ధవటము కోటలో చేరిన పఠాణీలు రాణివాసగదిలో దిగిన వెంటనే బురకాలు తీసి ఆయుధపాణులయి ఫత్తేసింగు, సేవకులను భటులను మట్టుమాడి సైన్యముల పయి కురికి వారిని వధించి మహాభీభత్సము కావించిరి; పిదప కోట బురుజుల నాక్రమించుకొని అందుపయి పొంచియుండిన తమ సైన్యములకు తమ విజృంభణము సూచించుటకు గుండ్లు పేల్చిరి. వెంటనే వెలపల దాగియున్న కడప సైన్యములు సిద్ధవటము కోట నలుదెసలనుండి ముట్టడించినవి. తుద కల్పకాలములో కోటలోపలివారును వెలుపలివారును గలసి ఫత్తేసింగు సైనికులను చాలమందిని వధించి కోట స్వాధీనము చేసికొనుటయే కాక కిల్లేదారు ఫత్తేసింగును కూడ ఖైదీగ జేసికొని పోయిరి. అబ్దుల్‌నబీఖాను కృతకృత్యుడయ్యెను; నాటనుండి సిద్ధవటముకోట మీద, కడప నవాబుల నగారా వాద్యములు మ్రోగెనవి. అప్పటినుండి కడపనవాబుల కుటుంబమునందు సిద్ధవటము యువరాజస్థానమయి నది. ఈప్రాంతమును హైదరలీ టిప్పుసుల్తానులు జయించువఱకు సిద్ధవటము కడపవారి తాబేము క్రిందనే యుండిపోయెను.

# కూతుళ్ల తల్లి

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"చిన్నమ్మమ్మ వస్తోందే అమ్మోయి!"

"సరిగ్గా పిలిచినట్టు వచ్చావు. రావే పిన్నీ!"

"వుత్తరమా యేమిటే అదీ!"

"మరే నమ్మా!"

"ఎవరు రాశారూ?"

"రాజం అక్కయ్య రాసిం దమ్మమ్మా"

"నెల పట్టేక యిది నాలుగో వుత్తరం. రకరకాలుగా—కవిత్వం కడతారుట యెవళ్లోనూ! అలాగ—అదే రాస్తుందో మరి, అతనే రాయిస్తాడో గాని, యేం మాటలే పిన్నీ అవీ? నాకూ తుర్ని నేను మెచ్చుకోడం కాదు; గాని మొగాళ్లు కూడా రాయలే రలాగ"

"ఏం రాసిం దేమిటి?"

"ఇప్పటికి మూడుమాట్లు చదివింది రుక్కమ్మ. ఇంకా దాని సరదా తీరలేదు—"

"అమ్మమ్మోయ్! మా చిన్నక్కా, మా చిన్న బావా, మా చిన్నత్తా బజారుకి వెళ్లారట! యెంచక్కా! మా అక్క యెంతో మంచి జామారు చూసిందట. కదుటే పెద్దక్కా?

"చెల్లీ, నువ్విలా రా. చిన్నపిల్లలు వింటూ కూచోవాలి, మాట్లాడగూడదు"

"మరి నాకు కొత్త గౌను కుట్టించమంటావా పండుక్కి అమ్మని?"

"నేను కుట్టిస్తా నిలా రా జాన!"

"వోయ్, వోయ్! నాకు చిన్నమ్మమ్మ కొత్త గౌను కుట్టి—స్తుం—దిట. ఇక మాట్లాణ్ను ఏం అమ్మమ్మా?"

"అలా కూచోవాలి మాట్లాడకుండానూ. ఏం?"

"ఊఁ. ఇక నువ్వు చెప్పవే అమ్మా"

"సంకురాత్రికి తన మొగుణ్ణి పిలవడం మానేస్తామేమో—ఇక దాని అమర్దా యేమని చెప్పను? అయినా యేం చేస్తుందో చూద్దా మని జవాబు రాయనిచ్చారు కాను నేను. ఇది చివరి వుత్తరం. ఏమిటేమిటో—నేను చెప్పలేనే పిన్నీ!"

"నన్నూ పూరించుస్తున్నావు నువ్వు"

"దాని మాట లెరుగుదువు కదా చిన్నప్పణ్ణుంచీని? ఆపైన వయస్సులో కూడా నెరజాణతనం—"

"పైగా మొగుడు క్లీడరు కూడా ఆయె"

"ఇవు నవుగా. అదొకటి కూడానూ. ఏదీ పిన్నీ వింటుంది చెల్లీ చదువు రుక్కూ!"

"నాకూ కూడా వొకమాటు వినిపించవే మనమరాలా! నువ్వు మాట్లాడకుండా వినే! ఏం జాన!"

"ఇవాళే కుట్టించాలి పరికిణీ. ఏం మరి!"

"అలాగే"

"విన నమ్మా, అమ్మమ్మా! "అమ్మకి దణ్ణాలు. నాన్నగారికి నా నమస్కారాలు చెప్పవలసి ది. అక్కయ్యకి కూడా చెప్పవలసింది. తమ్ముడూ, చెల్లాయీ కలాసాగా వున్నా రని తలుస్తాను"

"నా మాట కూడా రాసింది చిన్నక్కయ్య. అవునా అమ్మమ్మా?"

"మరే నమ్మా!"

"ఇక్కడికి లాంఛనా లయినాయి. ఇక గొడవ మొదలు. బాగా విను. చదవ్వే అమ్మాయీ!"

"నాలుగు వుత్తరాలు రాశాను. వొక దానికీ జవాబు లేదు. నేను మీకు కోపం తెప్పించి వుంటాను. లేకపోతే యిలా జరగదు—"

"విన్నావా? దీని పేచీ కేమిటమ్మా? దీనితో యెలా గమ్మా వేగడం?"

"నిజమే"

"పెద్ద పండుగు ఇక ఆరు రోజులే వుంది. అంటే ఆవేళా, ఇవాళా, కాక మధ్యని నాలుగు దినాలే వున్నాయి—"

"అయితే యేమిటో?"

"మాకు రాయడం యెందుకే పిన్నీ అమ్మాటా? మాకు మాత్రం లెక్ఖ తెలవదుటే!"

"నాన్నగారింకా రాలేదేం అని అడగడం అది"

"జవాబేనా రాయకపోతే యేం చేస్తుం దమ్మమ్మా అది మరి!"

"మరి మీ ఆయన యెప్పుడు వస్తాడే!"

"మా అమ్మ నడుగు"

"నాకేం తెలుస్తుందే పిన్నీ!"

"వుత్తరం రాయించావా!"

"అలా అడుగు నిలవతీసి"

"అడిగితే మాత్రం నాకేం భయమా? నువ్వు న్యాయం చెప్పవే పిన్నీ! రాజా ఇక్కడ లేను కనక దాన్ని, దాంతో పాటు దాని మొగణ్ణీ మేం పిలవాలి. తానిక్కడ వున్నప్పుడు తన మొగణ్ణి మేమెందుకు పిలవాలీ! రమ్మని తాను వుత్తరం రాస్తే, అతగాడు వస్తే మేము పప్పూ వణ్ణమూ పెట్టి, మాతాహతుని బట్టి యిద్దరికీ పచ్చం చుల బట్టలు పెడతాం, అంతేనా పిన్నీ!"

"నీ పుట్టింటికి రమ్మని పిలవడానికి నీకేం అధికారం వుందంటే నే నేం చెప్పగలనమ్మా అమ్మమ్మా!"

"అదీ నిజమేనే పాపం"

"నువ్వు దాని మాట ఆడుతున్నావు. నే చెప్పేవా అ చెప్పేవా నీకు!"

"నువ్వే యెప్పేవ. కాని—"

"ఇక కాని యెందుకూ!"

"చెప్పనియ్యి, మధ్యని అడ్డు వస్తావే!"

"నీకూ నాకూ కూడా యిష్టమయిందే కనక అదీ యెప్పేవే"

"ఏం, ఏం! అమ్మమ్మ, నిజం చెప్పింది. ఇక నాన్నగారితో చెప్పి వుత్తరం రాయిస్తావా మరి!"

"నువ్వే చెప్పరాదూ మీనాన్నతోటీ!"

"మాశావుటే అమ్మమ్మా మరీ!"

"కగ్గితండి నేను రాయిస్తాను గాని, ఆ వుత్తరం యేమిటో చదు వమ్మా నువ్వు"

"ఈయేటి పండుక్కి మమ్మల్ని తీసుకువెళ్లడానికి యిష్టం లేకపోతే మానెయ్యవచ్చు; కాని—"

"ఇక కాని యేమిటో మరి?"

"అదే లౌక్యం. ఇంకా విను. చదవ్వే"

"నిన్న నేనూ, మీ అల్లుడుగారూ, మా అత్తగారూ బజారుకి వెళ్ళాం. మా మంది అత్తగారికీ, మామగారికీ, మరదలికీ బట్టలు కొనడం కోసం వెళ్ళాం. నన్ను మా అత్తగారు బలవంత పెట్టి తీసుకువెళ్లారు"

"పిలవగానే యెందుకు వెళ్లకూడదో!"

"కాకపోయినా లక్ష పనులు చేసుకుంటూరు వాళ్లు. అవన్నీ మాకు రాయడం యెందుకే!"

"అవు నవును. అదీ నిజమే"

"వర్తకుడు నాలుగు చాపలూ, అయిదు చీరలూ, మూడు తానులూ ముందు పడేశాడు. అందులో వొక జామారు మద్దులు మూటు కడుతోంది"

"అయితే!"

"మీ అల్లుడుగారు దాన్ని విడిచిపెట్ట లేకపోయారు"

"బోధపడుతోందా!"

"హు, హు, హు"

"మమ్మల్ని కొనమను"

"మరే, మరే"

"అది చూసి మా అత్తగారు "నువ్విప్పుడు కొనుక్కో నక్కర్ర లేదోయ్! మీ అత్తారు పండుక్కి యీ మాత్రం జామారూ పెట్టరా యేమిటి!" అన్నారు"

"పెడతాం, మాంతాం; అవిడ కెందుకే అదీ!"

"మీనాన్నగారితోటీ, మీఅమ్మతోటీ చెప్పవే నువ్వు" అన్నారు మా అత్తగారు"

"ఇక్కడ మా యిష్టం వచ్చింది కొంటాం, ఈపురమాయిం పేమిటే మాకూ!"

"పండుక్కి మీ రిలాగా పెడతారు. సందేహం లేదు అయినా అలాంటి జామారు ఈవూళ్లో దొరకవద్దూ?"

"దొరుకుతుందే అనుకో. అయినా అత్తగారి కూడా తాను కోరిందే పెట్టాలన్న పట్టుబందేమిటమ్మా మాకు?"

"అదీ నిజమే"

"నువ్వుకూడా అలా అంటా వేమిటమ్మమ్మా? అల్లుళ్లకి పెట్టే బట్టలు కూతుళ్లకళ్లకి నచ్చొద్దూటమ్మా?"

"అవునేవ్! కూతుళ్లకి మంచిమంచి చీరలిచ్చి అల్లుళ్లకి యే మడిబట్టలో యిస్తే కూతుళ్లు చిన్నపుచ్చుకోరుటే?"

"నువ్వూ వాళ్లలోనే కూడుతున్నావు"

"న్యాయం చెప్పవలసివస్తే కూడదాయేమిటమ్మా మరి?"

"నువ్వు మరీని! చెల్లాయి మొగుడికి మంచి చాపు పెడితే నీమొగుడికి కూడా అలాంటిది పెట్టక తప్పదు గదా అని దాని మాటలు బలపరుస్తున్నావు నువ్వు. ఇలా అయితే మేం అల్లుళ్లని పిలవనే పిలవం యీ యేడు"

"పోం, మానుకో. మాకోసం పిలుస్తావా యేమిటమ్మా?"

"నువ్వు మంచి చాపులు పెట్టకపోతే మానె గాని పండుగల్లో వాళ్లని విడదీస్తావా యేమిటే అమ్మాయీ!"

"మహా బాగా అడిగావు. మరి అమ్మమ్మ కేం చెబుతావో చెప్పూ"

"......................"

"మాట్లాడవేం? నవ్వుకుని వూరుకుంటావేం?"

"తరవాత చెబుతుందిలే అమ్మా! ఏదీ; వుత్తరం చదువు"

"దేని కేనా నిబ్బట్టం. ఆమోద సూచ్నగా రున్నారు. మీ రీయేడు మమ్మల్ని తీసుకువెళ్లాలని తలుచుకోకపోతే యిబ్బంది లేదు—"

"అలా అయితే ఆమాట యిన్నిమాట్లు రాయడం యెందుకూ మరి?"

"నేననేదీ అదేనే. ఇది "తీసుకు వెడితేగాని వొప్పుకో" నంటూ ధరణా కూచోడం అంటావా, కాదంటావా?"

"సందేహ మేం యింకానూ?"

"ఈయేడు మమ్మల్ని తీసుకు వెళ్లడానికి వీలు లేకపోతే ఆమాటేనా రాసే—"

"రాయరు మీరు. తనేం చెస్తుం దేమిటి?"

"వినవమ్మా తల్లీ!"

"నా డబ్బు పెట్టి నేనేనా కొని మీరు ఇప్పించి నట్లిస్తా నిక్కడ"

"ఆ! ఎంత వొడుపూ!"

"మే మత్తగార్ని తీసుకురాకపోయినా జామారు ఖరీదు మాత్రం మాకు తప్పదుట, చూశావా?"

"వోళావ్! ఇది గోకేస్తుంది సుమా మిమ్మల్ని. సంవత్సరానికి రెండు వందలేనా మూటకట్టి వొకచోట దాచాలి దీనికోసం"

"ఆ! రమ్మన్నారు తిమ్మన్న బంతికి. తరివాత్రి వాళ్లో మరి దానికే అంత పెడితేనూ! ఇలాగ వున్నదంతా ఆడపిల్లలికి పెట్టేసి మొగపిల్లల్ని పాడు చేసుకోమూ?"

"మాకు పెడితే తమ్ముణ్ణి పాడుచెయ్యడం టమ్మా అమ్మమ్మా?"

"కాకపోయినా, మాయింటికి మేం తీసుకువస్తే పెడతాం గాని యిదేం ముద్దులాటే పిన్నీ?"

"నిజమే, ఇది కొత్తపద్ధతి"

"ఇందులో వున్న రహస్యం కనిపెట్టలేకపోయావు నువ్వు. కూతుళ్లని మాత్రం పండుక్కి తీసుకువచ్చి యేదో తోచినకాడికి పెట్టడం వుంది లోకంలోను. కూతుళ్లకి పెడితే అల్లుళ్లకి కూడా పెట్టాలని నిర్బంధం లేదు యే శాస్త్రంలోనూను. కాని అల్లుళ్లకి పెట్టే కూతుళ్లకి మానుకో రెవరూను"

"మరే నేవ్! ఎంత యెత్తు వేసిందే రాజు!"

"పెద్దది యెలా నవ్వుకుంటోందో చూశావా! అంతా గూడు పుఠాణీ—"

"అలాగే మరీ. వాళ్లు పట్టుకు వెళ్లేటప్పుడు కాదూ!"

"అయితే: అంత తొందర యేముంది తెలుసా?...చదవ్వే తమ్ముడూ!"

"ఆలస్యం చేసే ఆ చాపు మరెవరైనా పట్టుకుపోవచ్చు. అందుకోసం యింత త్వరగా రాస్తున్నాను"

"ఆ—బా—నూ"

"అలా అయితే అతగాడు కొనుక్కోవాలి. తన కెందుకే అప్పు పురా!"

"పోనీ, అమాటే రాయించరాదూ నువ్వు చెల్లాయికి?"

"మాకేం? నేను రాయిస్తే గాని వాళ్లు ఏమీ కొనుక్కోరా యేమిటి? ఏమే పిన్నీ?"

"అవును; గాని—అయినా యిదలాంటిది కాదు; గాని—"

"ఇంతకీ ఖరీ దెంతో విన్నావా?"

"అది కూడా రాసింది!"

"ఏం చెప్పకోనే? చదువు తమ్ముడూ!"

"వర్తకుడు దాని ఖరీదు యిరవై రూపాయలు చెప్పాడు. పదహారు రూపాయల కిస్తే మనకి లాభం. పద్దెనిమిది కిచ్చినా బాగానే వుంటుంది. అది సరికొత్త రకం కనక వర్తకుడు అడిగినంతా యిచ్చినా నష్టం వుండదు."

"డబ్బు పెట్టుకుని వాళ్లు పైగా వుంటే యెంతకి కొన్నా నష్టం వుండదు"

"మా బాగా చెప్పావు. ఏదో సామెత చెప్పినట్టు—"

"కానైతే ఖరీదు ఎక్కువే; గాని అజామారు ఎంతో మెరిసిపోతోంది."

"అంత మెరిసిపోయే జామారు కొనడానికి మాకు శక్తి లేదు సుమా."

"ఆ! తప్పతూ దనుకుంటున్నావు కాబోలు పాపం"

"కాకపోతే: యే గోరంచుల చాపులో కొండా మునుకుంటున్నావా యేమి టమ్మా? వల్లకాదు"

"దీని వరస చూశావుటే పిన్నీ?"

"పుట్టినప్పటి అది అలా వుంటుంది. ఇప్పటికీ కూడా తెచ్చుకుంటున్నావు కాదా యేమిటి నువ్వు తమ్ములతో పోరి?"

"మా బాగా అడిగావమ్మా?"

"......................."

"మీ అల్లుడుగారు చీర కట్నాలు పోసి కట్టుకుంటారు: కనక మరీ బాగుంటుం దద"

"అతగాడు అది కట్టుకుని యెదట నుంచున్నట్టు తోపిస్తోంది చూశావా!"

"కానమ్మా కొను. పిల్లల వుబలాటం తీర్చకపోతే యిక పండుగు చేసుకున్న అందం వుండదమ్మా"

"మాంతానూ? మానగలనా పిల్ల వరస చెబుతున్నాను గాని"

"ఎక్కువ నేర్చుకుందే యిక అంతానూ?"

"స్వయంగా పుట్టుకు రావాలి; గాని నేర్చుకుంటే వచ్చేవి టమ్మా యివి? ఇంతకీ అలాంటిది వొక్క చాపే వుంటే యెలాగా మరీ? ఇద్దరికీ వొక్క రకం పెట్టక పోతే—"

"పోని, రెండోది నీలంచాపు కొనూ"

"చూశావా పిన్నీ? అది యిరవై రూపాయలతో సరిపెడుతోంది గాని యిది యాభై దాకా దేకించింది"

"కనక తొరగా కొనిపించెయ్యి అలాంటివి రెండు చాపులూను"

"ప్రొద్దుటి బండికి వెడతారు మీ అల్లుడు"

"మంచిదే. ఇంటో కూచోలేక యిక్కడ వచ్చి నాలుగు మంచి మాటలే చెవిని పడ్డాయి. మరి పోతా. ఇంకా పిండికూడా విసురుకోవాలి"

"కాస్సేపు కూచోవే మాతల్లీ!"

"కూచోనమ్మా! మా వాడి భావమరిది వచ్చాడు పండుక్కి పిలవడానికి. కాస్త కాఫీ యేనా చేసి యివ్వకపోతే బాగుంటుందా? అదిగో, చూడు

కొడుతోంది. బాబోయ్ నా కొడు కేం కంగారు పడుతున్నాడో యేమిటో!''

"ఇదిగో......రేపు వస్తావు కామా సావకాశం గానూ!''

"............ ..............''

"ఏమిటీ అంటోంది అమ్మమ్మా!......నీ కేనా వినపడిందా!''

"ఏదో "భోజనం చేశాక'' అంటోంది. రాత్రో రేపు రుధ్యావన్నా మో మరి''

"చిన్నమ్మమ్మ నాకు పరికిణీ కొనిపెట్టింది కామ చూశావుటే అమ్మా!''

"బుల్లిమామయ్యతో చెప్పు వెళ్లి''

# ఆంధ్రులు-ఆంధ్రము

## భావరాజు వేంకటకృష్ణారావుగారు బి. ఏ., బి. ఎల్

ఆంధ్రుడు ఊరకే, ఆంధ్రుడ నని గర్వించడము, మురిసిపోవడము తప్ప. తానెందులకు గర్వించవలెనో తెలుసుకొనడు. ఆంధ్రునకు తన దేశము యొక్క రూపము ఎట్లున్నదో, స్థితి యెక్కడో, శీతోష్ణస్థితులు ఎట్టివో ఏమీ తెలియవు. పాఠశాలలలో చెప్పరు పాఠశాల విడిచిపెట్టిన తరువాత ఆంధ్రుడు తెలుసుకొనడు. తెలుసుకొనడానికి ప్రయత్నమైన చేయడు. పాశ్చాత్యుల నెవరినైనా కనబడినప్పుడు అడిగితే వారి దేశము గురించి అన్ని సంగతులు చక్కగా ఉత్సాహంతో, గర్వంతో చెబుతాడు. అంత దూరం పోనక్కరలేదు. మన భరతఖండంలో మహారాష్ట్రుణ్ణి గాని గుజరాతీని గాని బీహారీని గాని, బంగాళీని గాని, అడిగితే అతడు అన్ని సంగతులు చెప్పగలడు. వాళ్ల దేశాభిమానము, దేశారాధన ఒక్కటే! దేశారాధనకై మాతృదేశ రూపాన్ని వారు గ్రహించి చిత్రించుకుంటారు. అచిత్రించుకోవడం కాగితంమీదే కాదు. హృదయఫలకంమీద కూడా చిత్రించుకుని ఆరాధిస్తారు. ఆంధ్రులకు ఆంధ్రదేశ స్వరూపమే తెలియదు. మిగిలిన వాటి ప్రసక్తి యేమిటి?

ఆంధ్రులు దేశారాధన చేయరు దేశమంటే వారికి మనుష్యులని గాని మట్టి అనిగాని భావం మనసులో యేర్పడ లేదు. దేశానికి స్వరూపము ఏర్పరచి—దేశపటమును చిత్రించి అందు మాతృస్వరూపమును కల్పనచేసి ఆరాధించడం ఆంధ్రులకు తోచలేదు. ఆంధ్రులు కేవలము నిర్గుణోపాసకులు గారు, రూపకల్పనయందు వారి కిష్టము లేదనుటకు. ఆంధ్రులు నిస్సంశయముగా సగుణోపాసకులు. సౌందర్యతృష్ణ కలవారు. భరతఖండ పటమును చూచి అందు ఆంధ్రదేశమును ధ్యానించి చూస్తే శిల్పియైన ఆంధ్రునకు—కళోపాసకుడైన ఆంధ్రునకు ఆంధ్రదేశము శుక్లపక్షమునాటి చంద్రాకృతిగా మనోహరముగా కనుపట్టి ఆకర్షించును. జీవవాహినులు మహానదులు గోదావరి, కృష్ణ, తుంగభద్రానదులు ముత్యాలకంఠమాల ముప్పేటవలె ప్రకాశిస్తూ ఒయ్యారముగా పడమటి దిక్కునుండి తూర్పునకు ప్రవహించుచుండును. దేశమును రెండు పాయలుగా చేసి ఒక భాగమున విశాలమైన పీఠభూమిని మరియొక భాగమున సస్యశ్యామలయై ఏటనాలుగనున్న కేదారక్షేత్రమును ప్రదర్శించు పర్వతశ్రేణి ఒక్కొక్క ప్రాంతమున ఒక్కొక్క పేరున పిలువబడుచు ఉత్తరమునుండి దక్షిణముగా పోవును. మనోజ్ఞమైన ఈ దివ్యరూపమును సుందరాకృతిగా చూడగల భాగ్యశాలికి ఆంధ్రు

నకు గర్వము గాక మరేమి? ఆంధ్రదేశము భరత ఖండములో గల అన్ని రాష్ట్రములకంటె ఎక్కువ అదృష్టశాలి. ఇక్కడ శీతోష్ణస్థితి సర్వదా సర్వ ఋతువులలోను సుఖకరమై రమణీయమైయుండును. ప్రకృతి అప్రయత్నముగానే ఆంధ్రునకు అన్నియు సుభిక్షముగా నిచ్చును. భాగ్యవంతురాలైన ఆంధ్ర గర్భమున బుట్టిన ఆంధ్రుడు శ్రీమంతులగు బాలికా బాలురకు ఉండు లక్షణములనే గలిగి ప్రకాశించు చున్నాడు. ఇన్ని మాట లేల? ఆంధ్రదేశమున, పంటకాపు యేటి కేడాదియు భూమిని వ్యవసాయము చేయడు. సుమారు ఆరు నెలలు కంటె నెక్కువ పాటుపడడు. మిగిలిన కాల మాతడు సోమరియై వ్యర్థము చేయును. అతడు కష్టపడ నక్కరలేదు. తల్లి ఆంధ్రభూమి ఇచ్చినది పదిలపఱచుకొన్న జాలును. అదియును చేయడు.

ఆంధ్రుడు తన పూర్వులు గొప్పవా రని అప్పుడప్పుడు వారిని స్మరించి వివశు డగుచుండును. వివశుడైన నేమి ఫలము? పూర్వు లిచ్చిన భాగధేయమును యథావిధిగా జాగ్రత్తపెట్టుకొని తన సంతతికి ఇచ్చుటకై ప్రయత్నించుట లేదు. మాగన్ను పెట్టి నిద్ర పోవుచున్నాడు. తన సొత్తు నితరు లపహరించుకొని పోవుచున్నా రని తెలుసుకొనియు నిద్ర లోనే యిది కల యని భావించుకుంటున్నాడు. ప్రసిద్ధమైన అమరావతిస్తూపము—లోకములో అతి సుందరమైన అమరావతిస్తూపము ఆంధ్రునిదే. అయితే ఏమి ప్రయోజనము? పోయినది పోగా మిగిలిన దానిని శిల్పముతో ప్రకాశించు శిలలను అప్రాంతమునకు ఈప్రాంతమునకు పట్టుకొనిపోతూ వుంటే—చివరకు ఏమయినా సరే వలదని అయినా పెదవి కదల్పడు. అమరావతి అయింది, జగయ్యపేట మొందలయినవి యెన్నో అయినవి, చివరకు జగత్ప్రఖ్యాతి గాంచిన శ్రీపర్వతస్వామియొక్క ప్రాసాదములోనివి నాగార్జునకొండ శిల్పములు పైకి పట్టుకొని పోతూ ఉంటే మాటలాడక ఊరుకుంటాడు. శిథిలమై ప్రాణావశిష్టమైన అమరావతి శ్రీపర్వతప్రాసాదములు బ్రతికి చెడిన ఆంధ్రమహా సామ్రాజ్యమును తలపునకు తెస్తూ ఉన్నవి. ఆంధ్రుడు వాటిని స్మరించనైనా స్మరించడు. పంచారామములు, విజయవాడ, రాజమహేంద్రవరము, పావనములైన వేంగీ పిఠాపురక్షేత్రములు చాళుక్య సామ్రాజ్య ఛాయలను మనసునకు ఒక విధముగా తోపింపచేస్తూ ఉన్నవి. ఒక వంక పాడైన పెనుగోటగోడల దీర్ఘనిద్రల్లు పోవుచున్నది కాకతి ప్రాభవము. ఒకవైపు తుంగభద్రకెరటాల రొదలో కలిసిపోవుచున్నది విజయనగరసామ్రాజ్యవైభవము గోడు. వీటిని ఆంధ్రుడు వినుట లేదు, కనుట లేదు, తలచుట లేదు. పూర్వులవలన తనకు సంక్రమించిన భాగధేయమును ఆంధ్రుడు పాడుచేసుకున్నాడు—"తెలివి ఒకింతయు లేక తృప్తుడై కరిభంగి గర్వితమతియై" వ్యవహరిస్తూ ఉన్నాడు.

ఆంధ్రుడు పూర్వం జరిగిన దానిని తెలుసుకోవడం లేదు. ముందు చేయవలసిన కర్తవ్యాన్ని ఆలోచించుకోవడం లేదు. తాను ముందడుగు ఎందులో వేస్తున్నాడో గమనించడం లేదు. ముందు వెనుకలు అరయకుండానే పరుగు లెత్తుతున్నాడు. చివరకు త్రోవతెన్నులు గానక ఎచ్చటనో కూలి అలసట చెంది పరవశుడైపోవును. అపారవశ్యములో పూర్వవృత్తాంతమును పూర్తిగా మరచిపోవును. జ్ఞప్తికి సైతము తెచ్చుకొనడు. అట్టి పని అతనికి సిగ్గుచేటు. తన దేశస్థితిని అతడు ఒక్కసారి అయినా తలచుకొనడం లేదు. ఒకవేళ తలచుకున్ననాడు సానుకూలం అయే తరుణంలో స్వలాభపరుడై ఉన్నతాశయములను సంపూర్ణముగా జారవిడిచి వేయుచున్నాడు. అట్టి అవినీతికి జంకడు. సిగ్గైన చెందడు. అతనికి దేశాభిమానము కలదా అని తోచును. ఆ ఉన్న దేశాభిమానమే శ్రీమంతుడై పుట్టడంచేత త్రాగుబోతు పేలాపనవలె మైకము తగ్గిన తరువాత మటుమాయమై నిశ్శబ్దములో కలిసిపోవును. భరతఖండములో ప్రతీదానికీ

మేముకూడా వున్నామని ముందుకు వచ్చి ప్రగల్భాలు కొట్టి ఆడంబర జీవితంతో సంతోషం చెందే వారిలో ఆంధ్రుడే అగ్రగణ్యుడు. అంతే కాదు. అట్టివాడు అత డొక్కడే. అతని కార్యశూరత్వముమాటలయందే. చేతలయందు శూన్యము. తన సంగతి పర్యాలోచన చేసుకొనడు, తప్పు చేసినా నని గ్రహింపడు. గ్రహించినా దురభిమాన పూరితుడై వప్పుకోడు.

ఆంధ్రులు పూర్వము కౌరవుల వంటివారు. తిక్కనసోమయాజి తన జాతిని మనసులో బెట్టుకొనే కాబోలు కౌరవుల నుద్దేశిస్తూ "వారొక్క రొకళ్ల మాటలం బోరెుదు వారు గారు. కావున వారి నంత యనం బని లేదు" అని ముద్దుగా మందలించి విడిచినాడు. మనకు దేశమునందు సయితము ఐక్యభావము లేదు. భాషయందు ఐక్యము మొదలే లేదు. వేషభాషలయందు ఎకభావము కుదురనప్పుడు జాతీయత యందు ఎట్లు అలవడును? తన పూర్వస్థితి, యిప్పటి స్థితి తెలిసిన నాడు కదా ఐకమత్యం కోసము ఉద్రూత లూగడం?

దేశం ఏలాగున ఉన్నదో మన భాష కూడా అలాగే ఉన్న దని వేరే చెప్ప నక్కర లేదు. దేశానికి పట్టిన దౌర్భాగ్యమే తెలుగునకు కూడా పట్టి యేడిపించుతూ ఉన్నది: ఆసంగతి గ్రహించకుండా ఆంధ్రుడు నిలుగుతున్నాడు. ఆంధ్రులలో తెలుగు వ్రాయను చదువనూ నేర్చినవారు ఎంతమందిలేరు? కాని రెండు కోట్ల మూప్ఫయి లక్షల ఆంధ్రులకు ఒక్క దినపత్రిక భరించడం వెక్కసంగా ఉన్నది. భారతి, గృహలక్ష్మి, ప్రబుద్ధాంధ్ర వంటి ఉత్తమ పత్రికలకు పట్టుమని చదివేవాళ్లు పదిరెట్లు ఎక్కువ మంది వున్నా పోషించే చందాదార్లు రెండువేలకు మించి లేరు. ఆదరణతో కూడి వున్నది అభివృద్ధి!

తెలుగుభాష నానాటికి చిక్కి శల్యమైపోతూ ఉన్నది. ఆంధ్రులలో కథ, నవల, పద్యము, పదం రాయడానికి తప్ప మిగిలిన వాటికి తగిన భాష లేదు. ఇంతవఱకు ఇతరాభరణాలతో ఆంధ్రసారస్వతలక్ష్మి యీవలకు రాలేదు. చివరకు ఒక్క ప్రహసనం కావాలంటే యింగ్లీషు మాటలతో మిళితం చేస్తేనే గాని ఆంధ్రునికి చమత్కారం తోచుట లేదు. హాస్యం పుట్టి నవ్వు రావడం లేదు. ఇంక ఆంధ్రుడు రాజనీతి, ఆర్థిక విషయము, భూగోళశాస్త్రము, పదార్థవిజ్ఞానశాస్త్రము, రసాయనశాస్త్రము, ధర్మశాస్త్రము, అలంకారశాస్త్రము, యింకా యిలాంటి సకలశాస్త్రాలు తెలుసుకోవాలంటే యింగ్లీషు చదివి తెలుసుకోవలసినదే కదా! పైన చెప్పిన శాస్త్రాల వంటివి ఆంధ్రంలో వ్రాయాలని పూనుకుంటే యింతవరకు మన ఔదాసీన్యం వల్ల తగిన భాషయే ఏర్పడ లేదు! పట్టు మని పది వాక్యాలలో ఒకడు తన భావాన్ని స్పష్టముగా, సంగ్రహముగా, సూటిగా చెప్పుటకు తగిన పదములు ఆంధ్రభాషలో కనబడడం లేదు. లేవంటే లేవని కాదు: మనకున్న గనులలో దిగి రత్నాలు ఏరి తెచ్చుకొని ఆభరణాలు చేయించుకోవచ్చును. కాని ఆపరిశ్రమకు శ్రద్ధ యేది? పూర్వగ్రంథాలు చదవకుండా జీవచ్ఛవమై మనకోసం ఎదురుచూస్తూ ఉన్న—మనకు ఎలా అలవడుతుంది? ఒక భావము వ్యక్తీకరించడానికి తెలుగులోనే పదము లున్నపుడు వాటి వంక చూడకుండానే, అక్కడ సిగ్గులేకుండా యింగ్లీషు పదమో లేకపోతే బంగాళీ పదమో లేకపోతే హిందీపదమో తెచ్చి వాడుతాడు. ఆంతటితో తెచ్చుకున్న దాన్ని అయినా నిలబెట్టుకోడు. మరునాడే విడిచి పెడుతాడు. ఆంధ్రుడికి శిక్షణ అవసరము లేదు; దీక్ష కిట్టదు. అభ్యాసము అనసరము లేదు. అందుచేత నేటికి మన ఆంధ్రమునకు సన్యాసి పెండ్లికి జుట్టుదగ్గరనుంచి అంతా ఎరువే అన్న స్థితి తటస్థ మయింది.

ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణమును సాగించు కోవాలని తెలివితక్కువ ఆంధ్రుడు, చేతగాని ఆంధ్రుడు, మాత్సర్యపూరితు డైన ఆంధ్రుడు; తన భాష నెట్లా ఉద్ధరించగలడు? ఆంధ్రునకు తెలివి యున్నంత పరిశ్రమ లేదు. ఉత్సాహ మున్నంత

దీక్ష లేదు. కోరిక ఉన్నంత కార్యవాదము లేదు. అంతయు సగము సగమే!

ఇట్టి విపరీతపరిస్థితుల్లో అమాయకుడై ముందు వెనుకలు చూడకుండా తన మాతృభాషను ఉద్ధరించడానికి రెక్కలు చాలని ఆంధ్రుడు హింది భాషను వ్యాపింపజేయుటకు అగ్రులు చాస్తున్నాడు. నిజంగా ఆంధ్రుడు పరమమూర్ఖుడై వ్యవహరిస్తున్నాడు. హిందీభాషాప్రచారమునకై చేసే ప్రయత్నంలో, పడే శ్రమలో చూపే ఆందోళనలో ఒక వీసం ఆంధ్రోద్యమునకై ఆంధ్రరాష్ట్రనిర్మాణానికై ఆంధ్రభాషోద్ధరణకై శ్రమపడితే ఆంధ్రుడి యిల్లు, వాకిలి, దేశము, భాష అవిచ్ఛిన్నంగా బాగుపడు తవి. ఆంధ్రునికి యిపుడు యింగ్లీషుభాషాదాస్యము హెచ్చుగా నున్నది. దీనిలోనుంచి తేలకుండానే హిందీభాషకు కూడా బానిసగా కట్టుబడుతున్నాడు. ఈరెండుభాషలకు చేసే దాస్యము కంఠాన్ని చుట్టి ఊపిరాడకుండా చేయకముందే మాతృభాషాసేవ చేయుట కర్తవ్యము. హిందీభాష యెన్నటికైనా రాష్ట్రభాష రాజకీయభాష కావచ్చును. కాని ఆంధ్రుడు ఆంధ్రాన్ని సంపూర్ణంగా త్యజించి హిందీనే మాతృభాష చేసుకుంటా డని తోచదు. ఎప్పటికైనా యెన్నిబాధలు పడ్డా ఆంధ్రుడు తన నిత్యవ్యవహారములు ఆంధ్రములోనే జరిగించుకోవాలి. ఇంటిలో ఆలుబిడ్డలతో అక్కచెల్లెండ్రతో బంధువులతో వీధిలో నలుగురితో, రచ్చలో అందరితో తెలుగులోనే మాట్లాడుకోవాలి. అది మాత్రం తప్పదు. దైవం రక్షించి రేపో యెల్లుండో మనకు భాషాప్రయుక్తరాష్ట్రం వస్తే, ఆ ఆంధ్రరాష్ట్రంలో అన్ని రాజకీయవ్యవహారాలు ఆంధ్రంలోనే జరుగవలసి వుంటుంది; గాని హిందీలో కాదు. అరవవారు తమ అరవం కన్నడిగలు తమ కన్నడం మహారాష్ట్రులు తమ మహారాష్ట్రం, గుజరాతీలు తమ గుజరాతీ మంట గలిపికొని అంతా హిందీభాషలో మునిగిపోరు. అలా మునిగిపోయిన నాడు ఆయా జాతులకే కాదు సకల భారత భూమికీ కూడా దుర్గతియే పట్టును. అపుడు మన నాగరికత స్వాతంత్ర్యము, జాతీయత నశించి క్రొత్త సంకెళ్లు క్రొత్త దాస్యము మనకును జుట్టుకొనును. ఇతరజాతులకు అట్టి దుర్గతి పట్టని నాడు మన ఆంధ్రమున కేల అట్టి దుర్భరస్థితి సంభవింపజేయవలయును?

ఆంధ్రుడు ఇకనైనా తన భ్రమత్వము విడనాడుకోవలయును. అవివేకముగా ప్రవర్తించినందులకు పశ్చాత్తప్తుడు కావలయును. కర్తవ్యమును చక్కగా నాలోచించుకొని దీక్షతో కార్యరంగమున ప్రవేశించవలయును. ఏమహావేశమును ఆర్జించి తన పూర్వులు అప్రతిమానమైన యశస్సును గడించిరో, అఖండ సామ్రాజ్యములను నిర్మించిరో ఏనాగరికతను తమ సంతతికి సంక్రమింపజేసిరో ఆమహావేశమును మరల అర్జించి ఆంధ్రులు ఉచ్చదశ నందుటకై ఎడతెగనికృషి సలుపుదురు గాక. ఆంధ్రులకు మేధాశక్తి యున్నది; బాహుబల మున్నది. ఐశ్వర్య మున్నది. ఉత్సాహ మున్నది. మంత్రశక్తి యున్నది. ప్రభుశక్తి మాత్రము లోటు. ఆంధ్రులు దక్షుడైన నాయకుని ఎరిగి అనుసరింపవలయును. ఆంధ్రులు ముందుగా తమ యింటిని చక్కబెట్టుకొని తరువాత పొరుగిండ్లు దిద్దుటకై పోదగును. తమ తెలుగుపలుకు తీయదనము తనివిదీర గ్రోలి పిమ్మట అన్యభాషామృతము చవిచూడ బోవలయును. ఇంట గెలిచి కదా రచ్చ గెలువవలయును? ఇంటిని, భాషను వల్లకాడుగ చేసి ఎదురుగా నున్న జలాశయములను విడిచిపెట్టి, మృగతృష్ణలందు దాహము తీర్చుకొనుటకై ఆంధ్రులు పరుగెత్తుచున్నారు. ఆంధ్రులు ఒకసారి వెనుకకు దిరిగి సింహావలోకనము చేసికొని ముందు అడుగు వేయదగును. లేకున్న మహాపద మనలను ఆక్రమించుకొనును. చరిత్ర చదివిన వారికి ఇది క్రొత్త విషయము గాదు.

# బిందెడు నీళ్లు

జనమంచి కామేశ్వరరావు గారు

"అమ్మాయి! ఉషా! మంచినీళ్లయిపోయాయి, నాతల్లివికదూ! చెరువుకెళ్లి బిందెడు నీళ్లుతే అమ్మా" అందామెతల్లి.

తల్లి కూతుర్ని చూచి నిస్పృహతో,

"అయ్యో! నాబంగారుతల్లి రేపీపాటికప్పుడే ఎక్కడుంటుందో గదా!" అని నిట్టూర్చింది.

సహజంగా హిందూస్త్రీకి ఉండవలసిన సాధుత్వంతో ఉషలేచి తీనెమీది యిత్తడిబిందె ఎత్తుకుంది. అదివట్టిదైనా బరువుగానేవుంది. బిందెమూతి చేతులోకి జార్చుకుంది. నడుముమీదికి దాని బరువంతా ఆన్చుకుంది. భావిజీవితంలో చంకనేసుకుని పిల్లన్ని ఎల్లా ఎత్తుకుంటుందో జ్ఞాపకం చేస్తోంది, ఉష ఆబిందెను మోయడం చూస్తూంటే. తలకు పావడలేదు. పాదాలకు రక్షలులేవు. అల్లాగే ఒంటిగా కాలిబాట నంటి నడుస్తూ చెరువువైపు వెళ్తోంది. ఆ చెరువు నీళ్లు వాన నీళ్లయినా నిర్మలినంగా, కలుపు రొడ్డ లేమీ పెరక్కుండా, వున్నాయి. సన్నగా చీమ గంగాయాత్ర చేస్తున్నట్టే ఉష, వెన్నువేసి పసిమిరంగు హొయలుతో తులుకుతూన్న వరిచేలను దాటుతూ, వెండిజువ్వల్లా మెరుస్తూన్న జనుము చేలను దాటి, మధ్యమధ్యను వాలిన కొంగల మల్లే కదలాడు రెల్లుదుబ్బులుదాటి, కాస్త భయంకరంగా చిట్టడవిలా ఉన్న ప్రదేశమంతా గమించి చెరువు చేరుకుంది. యౌవనోన్మిషిత రాగంతో, మట్టియల చప్పుడు మెల్లగా అనాలోచితంగా రాగాంకితంచేస్తూ మీటుకుంటూ కదలుచున్న ఉష దివ్యమంగళ రూపాన్ని చూసి, ఊగులాడే ఆకుపచ్చని చేలు తలవాల్చినట్టుగా వొంగిపోయినాయి. ఆమె ఆచేలనైనా చూడలేదు. అవి తన తండ్రిగారి పొలాల్లోని సౌందర్య ప్రభలనైనా జ్ఞప్తిలేదు.

అది ప్రశాంత సాయంసమయం. అక్రింద విశాల ప్రదేశంలో కోతకువచ్చిన పంటకారు. పైన నీలిమాకాశం క్రుంకు సూర్యుని వింతరంగులను మేన పూసుకుంది.

ఉష నిశ్చలంగా నిల్చింది. దోరధాన్యపు పొట్టలను కొట్టుకొనిపోవాలనే పక్షులలో వుండే చలనమేనా ఆమెలో లేదు. కాని ఆమె ఎగయు చూపులలోనూ, కలలను పొదివిన ఫాలంలోనూ ఎదో ప్రపంచాలు కనలిపోయే విషాదజ్వాల తిరుగుళ్లు పడుతోంది. పాపం! శిరోవేదనతో బాధపడుతోంది. హృదయం ఎదో బాధతో దద్దరిల్లిపోతోంది.

ఉష కన్నెరికం వదిలి పెద్దమనిషయి మూడేళ్లయింది. రేపటినుండి ఆమె "అమ్మాయితనం" అంత మాతుంది. ఇంకామె నిజాలకు భార్యకాబోతోంది. రేపే అత్తారింటికి ప్రయాణం.

ఆమె కిప్పుడు ఒకటే ఆలోచన,—ఎదో భార్యనవాలి కాబోలు. అడకువతో మెలుగుతూండాలి కాబోలు—అనేమీ కాదు.

భర్తను గురించి ముసిముసి తలపోతలా? అవీ ఏమీ కావు. అల్లా ఆలోచిస్తూ నిమీలితనేత్రయై నిల్చుండగా గుంపులు గుంపులుగా ఎవరో ఎర్గని బంధుజనం ఆమెకు కనబడ్డారు. వాళ్లందరిలోనూ ఎల్లా మసలగలను అనే ఆమె జిజ్ఞాస. ఆమె మనస్సునూరికే కలత పెడుతోన్నది మరేదీ కాదు, యిదే. ఎల్లాగ యివన్నీ—ఈ తెలిసిన వాటి నన్నిటినీ వదలుకుని—ఒంటరిగా తమోనిలయమైన ఆశిశిరగృహాంతః ప్రదేశాల్లో జీవితం గడపగలను అనే—

నిర్మలంగా వున్న ఆనీళ్లలో కనబడుతూన్న తన నీడను "అబ్బా! ఎల్లా నేను అమ్మనీ, నాన్ననీ, మామ్మనీ, అన్నయ్యను, బుల్లిచెల్లినీ వదలిపోగలను బాబూ!" అంటూ పలకరించింది.

"ఇంక నాపావురాలను ఎవరు చూసేవారు? ఆదూడముండ మెడ గోకుతూ ఆడించే దెవరింక?

అసలు యింక ఆవు పాలెల్లా యిస్తుంది ఆ పాలు పిదికే వేళకు నేను దాని దగ్గర లేకపోతే?

దూరాన రాగిదైన రంగుతో పడమరదిశ పులుముకుపోయింది. పంటకారు ఆకు పచ్చదనం, సముద్రంలా అంతు లేకుండా పాకిపోయింది. కలకత్తాలోని ఫ్యాక్టరీ చిమ్నీపొగ ఎక్కడో సిరా మరకలాగ ఆకాశంమీద దూరాన పొడసూపుతోంది. ఈదృశ్యం మరికొన్ని బాధానిలీనభావాలను రేపింది.

ఉష ఎప్పుడూ కలకత్తా వెళ్లలేదు. ఆమె చిరత జీవితంలో చేసిన ప్రయాణాలన్నీ పొరుగునన్న పల్లెటూళ్ల పశువుల పాకలవరకే. యింకా మహాఅయితే దోనెమీద వరదకాలంలో కాస్తదూరాన్నున్న సంతలకూ, బజార్లకూ వెళ్లేది. కలకత్తా అంటే ఆమె వెర్రిఊహాపోహాలకోక మహాద్భుతాలన్నీ జరిగే ప్రస్థానపురమని అనుకుంటూంటుంది. అన్నింటిలోనూ అత్యద్భుతమైన్వ దేమంటే అది, ఆ"గారడీ గృహం"—మ్యూజియానికి ఆ పల్లెటూరి జనం అదీ పెట్టింది పేరు. కలకత్తా వెళ్తే ఆపల్లెటూర్నిప్రజకందరికీ అదొక పెద్ద తీర్థస్థలం. ఇంక దాన్నొకసారి చూసొచ్చి వారు చెప్పుకునేవి అవి వింతలే కావు. అవి విశేషాలే కావు. వాటికింక అంతూ పొంతూ వుండదు.

"అసలు ముందు తాతగారు నన్నక్కడికి తీసుకెళ్తారనుకునే దాన్ని. సరే ఆయన వెళ్లిపోయారు. తరువాత నాన్నగారు. బాగా డబ్బున్నప్పుడు ఆయన్ని తీసుకెళ్లమన్నాను. సరే యిప్పుడాయన పనంతా అయింది. నాపెళ్లితోటి ఆయన లోగసానులో పడ్డారు. బొత్తిగా డీలా అయిపోయినారు. పోనీ, మామయ్యఅంటే అతగాడు పట్నంలోకి ఎన్నాళ్లో అయింది పనిలోకివెళ్లి మళ్లీ రాలేదు.

సరే యిప్పుడింకేమీ లాభంలేదు. నన్నెవ్వరింక తీసుకెళ్తారు? అత్తారిల్లు ఎంతోదూరం. సరే! అక్కడ నాయందంత అపేక్షచూపి "గారడీ గృహాని"కి తీసుకెళ్లే వారెవరున్నారు నాకు? పాపిడిమీదికి కొంగుతీసుకొని మొహానికి ముసుగేసుకొని కిమ్మనకుండా యింట్లో కూర్చోవాలి. అంతే! పంజరంలో పిట్టలా వుండవలిసిందే. అదే రాశాడు నాకు. అంతే తప్పదు" ఆమె ముందుకు వంగి, యిత్తడిబిందె నీళ్లల్లో ముంచింది. నీటి బుడగలూ, చిరు కెరటాలూ నీళ్లల్లోని ఆమె నిర్మల మూర్తిని చెరిపేశాయి. బిందె బరువుగా ఆమె చిరతస్నిగ్ధహృదయం మల్లేనే పైకివచ్చింది.

"ఊహు! ఊహు! నే నెప్పటికీ చూడలేను ఆ"గారడీగృహం" నాకింకేమీ సరదాలుండవు. నాకుబాగా తెలుసును. యింక నాకేమీ వుండవు" ఇల్లా అనుకుంటూంటే ఆమె అంతటి అందమైన నేత్రాల్లోనూ గిర్రున నీళ్లు తిరిగాయి.

దొడ దొడ నీళ్లుకారాయి. పొంగిపోయి ఆబిందువులు బిందెమూతికి తగిలి చిటిలిపోయినాయి ఆమె దానివైపు వంగినప్పుడు—,

ఆసాయంకాలం ఉష యింటివారంతా రాత్రి భోజనాలదగ్గర ఆమె తెచ్చిన మంచినీరే పుచ్చుకున్నారు. కాని వారే మెరుగుదురు, ఆనీళ్లలో ఆమె కన్నీటిజాలులుకూడా జారి కలిసినాయని? ఆనీటికి ఆమెకన్నీటివల్ల ఒకమోస్తరు ఉప్పదనం వచ్చిందనీని?

అంతే. అంతా భోజనానికి కూర్చున్నారు. ఉష కూడ ఒకమూల కిమ్మనకుండా కూర్చున్నది మాయరేపు వస్తోందికదా!—అని.

శ్రీమతి అర్క్యుహార్ట్ (Mrs. Urquhart) వ్రాసిన ఇంగ్లీషు కథ కనువా!

# పద్యము - గద్యము

పూడిపెద్ది వేంకటరమణయ్య గారు

ఆంధ్రమున గల వెనుకటి రచనలలో మూడువంతుల మున్పాతిక అన్నియును పద్యపు టల్లికలలోనే యున్నవి. అందు కథాభాగములును వర్ణనాంశము లును గూడ పద్యరూపమునే దాల్చుచు వచ్చినవి. కొన్నిట వర్ణనాంశములు గద్యరూపమున నక్కడక్కడ కదముద్రొక్కినవి. పద్యమున తనువగు భాగముల గద్యము గద్యమున కనువగు భాగముల మాటల బెంచిన బూటకపుపద్దియములునుగూడ గలవు. ఇప్పుడు పద్దెమేది గద్యమేదియను సమయము వచ్చినది. పద్యనిర్వచనము కావలసియున్నది. కొలదికాలముక్రిందటివరకు ఛందోబద్ధమై రెండుగాని నాలుగాని, యెందుగగాని, చేసిన పాద రచనము పద్యముగా తలపోయబడినది. పద్యము వకు లయ ప్రాణమై గేయమువలె గానమున కనువయిన నిర్మాణముతో ప్రాసమైత్రి మున్నగు నారోహణావరోహణస్థానసూచనలతో లక్షణము లేర్పడినవి. ఇవి రానురాను భావసౌకుమార్యమునకు చోటిచ్చి తాము బంధవిముక్తి కొందుచున్నవి. భావమనునది హృదయవికారము. ఇది బాహ్యేంద్రియ సంచలన సంబంధమున నంతరంగమున గలుగు మార్పు. ఈ మార్పును సూచించు వాక్యోచ్చారణ ఛాపరచన. దాని నవస్థాభేదమున కనువయిన గళనినాదమున పాదివిపై కూచుట పద్యరచన. గానసంబంధము లేక వెలిబుచ్చు నూహల రచనము గద్యము. ఈసందర్భమున కవి హృదయము గూర్చి ఇంచుక చెప్పవలసి యున్నది.

కవి హృదయము మైనమువంటిది. అది రక్తనాళసంచలనమున కరగి యెప్పటికప్పుడు తన పరిసరపరిస్థితుల కనువగు పోతంబడి యేదోయాకృతి దాల్చి కవికిమాత్రము ప్రదర్శిత మగును. అలలిత రూపప్రదర్శనముననే గీతరచనమయినది. అగు ప్రగీతముతోడి వికారమే కవిహృదయము. అక్షరరూపమున, రాగరూపమున, శిల్పరూపమున కవిభావసూచకము లగు నిబాహ్యరచనములు తొల్లింటి కవిహృదభావరూపములు ప్రతిబింబములు గాని కవిహృదయములు గావు. ఈ ప్రతిబింబనిర్మాణము ముత్తెరగులయినది. గద్యవిధానము, పద్యవిధానము గేయవిధానము.

వీనివలన నెప్పటి కెవరికి తోచినట్లువారు వారి వారి యూహల సూచించుచునో చెప్పుచునో వచ్చిరి పద్యరచన గాన రూపమున లయతో వస్తువిలాసమునే చూపి శ్రోతలకు దగునట్లు వర్ణించును. గద్యరచన యట్లుగాక వస్తువును పేర్కొని తల్లక్షణముల సువ్యక్తముగ పూసగ్రుచ్చినట్లు చెప్పివేయును. ఈయీయవస్థల ననుసరించి పద్యగద్యరచన సాగవలెనని కొందరి యభిప్రాయము. ఇటీవలివారి యూహ యది కాదు. వాక్యములు పొడవయిన వయినను, పొట్టివైనను, పదములు సాధువులయి నను అసాధువులయినను, రచనము సరళమయినను కాకున్నను—అది ఛందోబద్ధమా లేక స్వేచ్ఛాప్రవాహమా యను వితర్కరహిత లేక భావగర్భితమయిన హృదయవికారప్రదర్శనము చేయుటయే పద్యరచన మనియు తక్కంగల నూటిగ చెప్పు శుష్కవాక్యములు, గ్రుప్పడులో నెట్లున్నను గద్యమే యనియు కొందరనుచున్నారు.

అట్లగుటవలన పద్యగద్యము గద్యపద్యము నని రెండువిధానము లేర్పడినవి. రచయిత తన వర్ణనాంశము నేవిధానమున వర్ణించినను సరే దానిని పద్యముగా గాని, గద్యముగా గాని శ్రోతలు, పాఠకులు నిర్ణయింపవలసినదే. అందులకే కావ్యము భావప్రధానమయినది. అనగా భావతత్త్వప్రధానమయినది. ఈ తత్త్వమునుబట్టి పద్యగద్యవిభేదమేర్పడుచున్నది.

వస్తు వొక్కటేయయినను బాహేంద్రియప్రవృత్తినిబట్టి తద్విషయికమయిన యాంతరంగికవికారము గలుగుచున్నది. ఈ వికారము మనస్సును

స్వాధీనముచేసికొనునా లేక మనస్సునకు స్వాధీనమా ? అది రచనలవలన గాక యనుభవమువలన తెలియునది. రచనమాత్రము మనస్సునకు స్వాధీనమయిన భావమునే చిత్రింపగలదు. అట్లగుటవలన మనస్సును స్వాధీనముచేసికొన్న భావము లంతరంగముతో గూడ నంతరింపవలసినదేనా ? ఈ యనుభవవైపరీత్యము నెట్లు వెలిబుచ్చుట? అట్టియవసలలో కవి హృదయతత్త్వము చూచాయగ సూచనగ తెలుపుపొలిమేరయయిన తెలుపురచనలు వలదా? కావలయును. వానినే యిప్పుడు భావకావ్యము లనుచున్నారు. ఈ రచన నెరుగవలెనన్న పాఠకుడు ఈతనేర్చికొనువానివలె నీ రచనాపాఠమున మున్ముందుగ మునిగిపోయి పిమ్మట కాలుసేతు లాడింపవలెను. వట్టిపెదవి కదలికవలన, అర్థగ్రహణమువలన పాఠకున కిందలి కవిహృదయము హృద్గోచరము కానేరదు. ఆతడిందీద నేర్చికొన్నచో నీ రచనాప్రవాహమును దాటి యేదోతీరమును చేరగలడు. అట్లయ్యెనేని ఆ భావకావ్యమున గల కవి వానికి దృగ్గోచరించును. ఇట్టి కావ్యపఠనము వలన పాఠకునకు హృదయవికాసమే గాక హృదయసౌమ్యతగూడ పొనుపడగలదు. ఇందొక్క విశేషాంశము గలదు. కవి కావలె నని భీష్మించికొని భావకవి కాజాలడు. ప్రకృతీంద్రియముల సంఘర్షణమున రేగు భావలేశము దీని కాధారము. ఇదిలేనిది భావకవిత్వము కాదు.

ఇదియటుండ మనసాధీనమయిన భావరచనమును కవిత్వమె. ఇందు పాఠకునికి మారుగ కవియే రెక్కలుగట్టికొని, తనవస్తువునకు తగినచోటునవాలి, కవి దృష్టితో దానిని పరిశీలించి, ప్రకృతిని సృష్టించికొని, ఇంద్రియముల నానాళముల రేపి, హృదయవికారము గల్పించికొని భావప్రసూనముల విరిసి పరిమళించుచున్నాడు. ఇట్టి సంపాదితావేశమును గూడ సహజావేశగ చేసికొని భావగీతరచనమునకు కొందరు గడంగుదురు. ఇది యతుకుడుపని వలెనే కానుపడియుండును.

## ఇక గద్యవిషయము

ఒకటో రెండో ఎన్నో కొన్ని మాటలకూర్పులో వస్తువును యథార్థముగ నిరూపించుట గద్యరచనము. ఈ యథార్థనిరూపణమున రచయిత ప్రసక్తి లేదు. ఇచట వస్తువే ముఖ్యమయినది. రచయిత తన పాండిత్యమును తెలిపుచ్చికొనుటకు, పదముల నేరికొని నియమముల నిలిపికొని తీగయల్లికపని నెంతేని యిందు చూపవచ్చును. దీనివలన నీతడు కవి కాజాలడు. రచయితమాత్ర మగును.

ఇట్లగుటవలన నేమయినది? పద్యగద్యవిభేదము భావప్రదర్శనవిధానమున నున్నదిగాని పదముల కూర్పులోగాని, బంధుకట్లలోగాని లేదు. తెగిన యసంపూర్ణవాక్యమే యొక్కప్పుడు పద్దమై పాఠకుని హృదయవీథిని దూసికొనిపోవును. దీర్ఘసమాసములతో తీర్చికట్టిన పలుకుల దండయొక్కప్పుడు హృదయాంచలముల నంటి వసివాడిపోవుచున్నది. దీనికి రచయిత పేరుపెట్ట పని లేదు. పాఠకుడే పద్యగద్యనిర్ణయము చేసికొనవలెను. ఈ నిర్ణయమును పాఠకసామర్థ్యమునుబట్టి తారతమ్యములం బడును.

కాబట్టి మనము పద్యగద్యవిభేదముల రచనను బట్టి నిర్ణయించుకొనవలసినదే గాని లేనిపోని వాదప్రతివాదములవలన ప్రయోజనము లేదు.

వెనుకటిది రచనాకాలము. ఇప్పటిది భావకాలము. భావము స్వేచ్ఛాప్రచారము గలదియగుట దానిరెక్కల బలమే యిప్పుడు మనము తెలిసికొని నిర్ణయింపవలసినది.

ఈ కాలమే మిక్కిలి మున్నితమయి కానవచ్చుచున్నది. ఇప్పటి రచనలీపరస్పరవిభేదమును పాటింపకపోవుటయే గోరుచున్నవి. కాలక్రమమున నింకేదయిన స్థిరమయిన రచనావిభేద మేర్పడిన నగుగాక. ఆంధ్రలోకముమాత్ర మీనవీనభావజీవనమున వన్నెయు వాసియు గాంచుగాకయని నాకోరిక.

# కన్నెగులాబీలు

మల్లాది రామకృష్ణశాస్త్రి గారు

కమ్ముకుని వికసించిన గులాబీపూలు, ఎవరన్నా కోసుకుంటారేమో నని, ఎత్తుగా ఉన్న గోడ మీదుగా కొమ్మ లెవరికీ అందవు. యౌవనపు ముమ్మరంతో చూసిన వారిని సొమ్మసిల్ల చేసే ఆకొమ్మ కూడా ఎంద రెన్ని విధముల ఉవ్విళ్లూరినా ఎవరికీ అందదు.

వెన్నెల రాత్రుల్లో చంద్రశాలాసవిధసీమను తరంగిత మయే గీతికారసవాహిని కోసం చాలా మంది కాచుకుని ఉంటారు. హాయిగా పాట విని ఆనవమోహిని పొరబాటున నైనా కనబడుతుందేమో నని ఎత్తిన తలలు వంచకుండా చూసి చూసి, భగ్నహృదయాలతో తిరిగి పోతూంటారు. కాని, ఆ అమ్మాయితో స్నేహం...దర్శనం...

... ... ... ...

సుందరం మద్రాసు ఎందుకు వచ్చాడో ఆతనికే తెలియదు. బయలుదేరినది అసలు ఎక్కడికో తెలియదు; కాని చల్లగాలికి బీచివద్దకు జేరుకున్న తరువాత నైనా, రేడియో ఆవలంబనాన బొంగురు గొంతుతో అరవపాట వినబడే దాకా తాను చివరకు అక్కడ తేలా ననే విమర్శనే లేదు. చిత్రశోభలు లేని సామాన్య సాంసారికజీవనం ఆతనికి నచ్చలేదు. కాంచనసమృద్ధి కలిగినా, కాంతాసమ్మితత్వము కలలో నైనా అనుభవించని యోగంచేత అర్థం చేసుకోలేని ఆవేదనతో సంతోషం తెప్పించుకోవా లని ..దాన్ని వెదుక్కుంటూ, దోవ తెలియకుండా తిరుగుతున్నాడు.

పట్నం కూడా పాతపడిపోయింది నాలుగు రోజుల్లోనే ఆతనికి. ఏమి తోచదు. కాలం గడపడానికి మార్గాలు కనిపించడం లేదు. స్నేహితుల మాట ఎత్తడంతోనే ఎక్కడ లేని విసుపూ వచ్చేది. ఏదైనా రచించడానికి ప్రయత్నం చేసినా...మరల చదువుకునే టప్పటికి రసవిహీనంగా, జీవకళ కొరవడినట్టుగా తోచి నిస్పృహతో వ్రాసిన వాటిని చించివేసేవాడు.

తోటివా రందరూ - ఎందుకు...ఎలా, సంతోషంగా ఉండగలరో ఆతనికి అర్థ మయేది కాదు. తనకు ఏమి కావలెనో, దేన్ని అన్వేషించుతున్నాడో, తెలియదు. ఎరు గున్నవాళ్లు ఈవిపరీతపు ఆవేదనను ప్రవర్తనను చూసి, కవికి అలవడే లక్షణాలలో అది ఒకటి అనుకుని, లక్ష్యపెట్టకుండా ఊరుకునేవారు.

క్రమంగా ఎవరి సాహచర్యాన్ని ఇచ్ఛగింపకుండా, ఒంటరిగా షికారు బయలుదేరడం మొదలుపెట్టాడు:—కాని ఏమీ లాభం కనిపించడం లేదు. పారసారథి దర్శనంకోసం శుక్రవారంనాడు తయారయే తమిళాంగనాపద్మవ్యూహాన్ని బలవంతాన భేదించుకుంటూ వెళ్లే అవసరాల్లో నైనా అల్లుకుపోయిన అంత అందమూ కూడా ఆతన్ని లాలసుని చేసేది కాదు. వాలు చూపులూ, చిరునగవులూ, లక్ష్యపెట్టడం అలవా టయింది కాదు.

... ... ... ...

మంచు తెరలు ఇంకా కమ్ముకుని ఉండటంచేత. ఎండ బాగా పురి విప్పలేదు.

సుందరం మైలాపూరులో ఆ—వీధినే నడిచి వెళుతున్నాడు. అక్కడికి...ఆమేడ ప్రాంతాలకి వచ్చేటప్పటికి కొంచెం నెమ్మదిగా అడుగు వేశాడు:—సమీపించి, ఆ చక్కదనాన్ని చూస్తూ సాఫుగా ఆగిపోయినాడు.

కనపడ్డవి హిమానీసంస్పర్శచేత రసార్ద్రిము లైన గులాబీపూలు.

అవి పలుకరించినట్లుగా అయింది ఆతనికి. ప్రహరీవద్దకు వెళ్లాడు. బరువుగా ఉండటంచేత కొమ్మలు అందుబాటులోనే ఉన్నవి. పూలని—చూసి—సంతోషిస్తూ నిలువబడినాడు.

పూల దొంతరల మీదుగా— మేడమీద ఆ అమ్మాయి...కనబడ్డది.

ఆదృష్టితోనే ఆ పిల్ల వంక చూసి, అక్కడ నిలువకుండా నడచిపోయినాడు

మరునాడు...ఆ వేళకే...అక్కడికి వచ్చి గులాబీల చిరునగవును గమనించాడు. ఊరుకోలేక, వాటిని కోమలంగా స్పృశించి పరవశుడైనాడు. ఆ అమ్మాయి అందుబాటుగానే కనబడింది కాని, ఏమీ చెప్పిన మాట వినలేదు ముందుకు సాగలేదు.

నవోదయముతో కోరికలు విజృంభించినవి. తనవి—తనకోసమే వికసించినవి తనకు కావాలి అనుకున్నాడు. పూసిన పూలన్నీ...మొగ్గలను మాత్రము కనికరించి విడిచాడు.

కనబడకుండానే ఆ అమ్మాయి తోటలోనుంచి తీయని గొంతుతో 'ఎవరు అలా కొమ్మలు లాగేది ?' అని కసరి అడిగింది.

అతడు ఆనవాలు పట్టి పులకితుడైనాడు. జవాబు ఏమీ చెప్పకముందే... ఏమి చెప్పాలో తెలియక ముందే... ఆ అమ్మాయి కనిపించింది. గ్రీన్ హౌస్ తిన్నె మీద నిలుచుని ఉన్నది. మొగం మాత్రము అగుపడుతూన్నది.

'ఎవరు...నీ...మీరు ?'
సుందరం కొంచెం తటపటాయించి,

'నే...ను' అన్నాడు :

ఆ అమ్మాయి చిరునగవుతో చూసి...చూస్తూ ఊరుకున్నది...

'పూలు...కోసుకోవచ్చునా ?' అని అతడు సిగ్గుపడుతూ ప్రశ్నించాడు.

నవ్వుతూ...అతని వంక చూస్తూనే

"మొగ్గలు...కూడా కావాలి సుంటే..." అని తనలో తాను నవ్వుకున్నది ఆమె.

సుందరం అమాయికంగా నవ్వుతూ గోడ మీదికి...ఎగువకు...చేజాపి

'ఇవి...మీరు...తీసుకోండి'— అని కోసిన పూలను అందీయబోయినాడు :

ఆమె వద్దని సైగతో బదులు చెప్పింది: చిన్నబోయి తరువాత కథ ఏలా నడపాలో తెలియక చూస్తూ నిలువబడిపోయినాడు. ఏమీ మాటాడలేదు ఆ అమ్మాయి. రోషంతో, అభిమానంతో వెనుదిరిగి నాలుగు అడుగులు వేసి...ఇక మనసు పట్టలేక మళ్లా అక్కడికే తిరిగి వచ్చాడు.

ఇంకా ఆలాగే నిలువబడి ఉన్నది. అతని రాక చూసి ఆహ్లాదసంభరితమైన అపాంగవీక్షణకటాక్షముతో దిగిపోయింది.

'వెన్నెల వస్తేనే కాని...జాజులు...వికసించవు...' అని ఆ అమ్మాయి పలుకులే విస్పష్టముగా వినపడ్డాయి :

... ... ...

ఆ రోజంతా ఏలా గడిచిపోయిందో సుందరానికే తెలియదు. చంద్రుడికన్న తాను ముందుగా బయలుదేరడానికి పంతము పట్టినట్లు సహన మనే మాటే లేక పోయింది. కాని, మామ రాకతో కాని మనసులోని కోరికలు తీర్చేందుకు మాకుమారుడు కూడా ఆయత్తుడు కాడు గాద్దూ ?

ఎవరినీ లక్ష్యం చేయనట్లు యకాయకిని రాచబాటను నిర్భయముగా తోటలో ప్రవేసించాడు సుందరం. ఎవరో కన్నెరగి రా నవసరము లేని వైఖరితో ఆమె సమీపించింది.

ఎవరు ముందు కౌగలించుకున్నారో, ఎంతసేపలా ఉండిపోయినారో...ఎవరికీ తెలియదు, కాని ఆ అనురాగానందసముద్రలో రేకలుగా విడిపోతూ, గులాబీ లన్నీ సన్నజాజుల సైదోడుగా అవాఙ్మధుర ధోరణిలో అబ్బ! అనినట్లయింది. విడని కౌగిలిని, విడువజాలని హృదయంతో, విడిపించుకుంటూ, ఆ అమ్మాయి కూడా 'అబ్బ' అన్నది. అంత చక్కగా అనగలిగిన పెదవులను అతడు సత్కరించాడు.

"నేను...నీతో...మాటాడను" అన్నది కొంచెం ఓసల్లి ఆ అమ్మాయి.

సుందరం మరీ దగ్గరగా కదలి 'పోనీలే...' అన్నాడు. చిన్నపిల్లల మారాం లాగా...'నా... పూలన్నీ...' అని ఆభంగిమం నిలుపలేక నవ్వేసింది.

'మరి...ఎందుకు మాటాడావు?' ఇద్దరూ ఒకరిని చూసి ఒకరు...ఒకమారే కలసి నవ్వుకున్నారు;

తమ చెలిమి నభిలషించలేదని కలువరిస్తూన్న జాజులతో తన నెచ్చెలి వేణిని అలంకరించాడు. ఎంతో వెదికి మారుమూలల ఆకుల మాటున అణిగి మణగి సిగ్గుపడుతూన్న ఒకటిరెండు అరవిచ్చిన గులాబీల జన్మ కూడా సార్థకం చేశాడు.

కాని ఆప్రణయసమ్మోహనంలో ఎంతకాలము అవి రేకలు విడకుండా నిలువగలవని చందమామ సర్వజ్ఞుడులాగా నవ్వుతూన్నాడు.

... ... ... ...

చెన్నెల పక్షపాతం వహించిన దోషాన సన్నగిల్లిపోయే రోజులు వచ్చినవి. మంచు చినుకులలో ముత్తెపు తళుకు మాసిపోయిన తరువాత విరికన్నెలకు కూడా తొలి ప్రాయము విరిసిపోయినది. గులాబీలకు మొదటి పరువము లేదు.

సుందరం రచనల్లో నవచైతన్యధుని పరవళ్లు తొక్కుతూన్నది. కావ్యాత్మ అతని ఆలోచనలన్నీ సొంతం చేసుకుని మనసు జోలికి మధి వేనిథి రానీయడం లేదు.

మరచిపో లేదు...లేదు; కాని మళ్లా, ఆ అమ్మాయికోసం కలువరించే అలసత్వం దరిజేరడం లేదు. ఆ సంతోష మంతా సంతోషముగానే ఆగిపోయింది...

ఆమె గీతికాలాపాల్లో మను మెలవని రసాంకురములు తలచూపుతున్నవి; కాని అతని చెలిమికి నిలుకడ తీసుకుని వచ్చే కదలికలు లేవు. తళుక్కుమని మెరసి నిలువకుండా మాయమయే చిన్నెలు లేవు. అందరికీ ఆప్యాయనంగా కనబడుతుంది; కాని ఆశ లూరించదు.

ఒకరి నొకరు విడువ మనుకుంటూనే విడజాలకుండానే—విడిపోయినారు.

... ... ... ...

గులాబీలు వృంతాల్ని వీడకుండానే వయస్సు కొనసాగించుకుని విడివిడిగా రేకలుగా రాలిపడుతూ జీవనసంధ్యను సమీచీనముగా చేసుకుంటున్న అనుభవజ్ఞుల్లో అప్పుడప్పుడూ తాత్కాలికవిభ్రమాన్ని ప్రవర్తిలజేస్తూంటాయి. అవి కూడా ఎప్పటి లాగనే అందవు. అందుకోనీయవు. అలా ఉండిపోవాలిసిందే.

# బిడ్డల శిక్షణ

ఓరుమళ్ల కామేశ్వరరావు గారు బి. ఏ; బి. ఇడి

బిడ్డల శిక్షణ, లేక బిడ్డల్ని పెంచే విధం అనే పుస్తకాన్ని గుడిపాటి వెంకటచలంగారు రాసేరు.

పిల్లల్ని పెంచే విధం మీద ఇంగ్లీషులో అనేక పుస్తకాలున్నాయి. కాని తెలుగుభాషలో వెంకటచలంగారు ఇది ప్రకటించే వరకూ పేర్కొనక్కర పుస్తక మేనా వున్నట్టు కనపడదు. ఇంగ్లీషులో అనేక విషయాలను గురించి అనేక పుస్తకాలున్నాయి. కాని వాటివల్ల మన కేమీ లాభం లేదు. రాజుగారి కోటలో ధనం వుందంటే యెంతలాభమో ఇంగ్లీషులో పుస్తకాలున్నాయన్నా మన

కంటే లాభం. మన దేశపు ప్రజలకు లాభదాయకంగా వుండా లంటే విజ్ఞాన మంతా దేశభాషలోనే వుండాలి.

వెంకటచలంగారు యెంతో శ్రమపడి అనేక ఇంగ్లీషు పుస్తకాలు పరిశీలించీ, తమ అనుభవాలను చేర్చి బిడ్డలను పెంచే విధానం గురించి తెలుగులో రాసేరు.

ఇతర నాగరిక దేశాలన్నీ—ముఖ్యంగా పాశ్చాత్య దేశాలు పెద్దవాళ్ల విషయంలో కంటే పిల్లల విషయంలో యెక్కువగా శ్రద్ధ తీసుకుంటున్నాయి. కారణ మేమి టంటే? ముందుముందు ప్రపంచం యింతకంటే సౌఖ్యవంతంగానూ, జ్ఞానవంతంగానూ వుండా లంటే ముందుముందు ప్రపంచజాతులుగా అయే టటువంటి పిల్లలిని గురించి యెక్కువ శ్రద్ధ తీసుకోవాలి. అందువల్లే పాశ్చాత్యదేశాలూ, ఒకటి రెండు ప్రాచ్యదేశాలూ పిల్లలిని గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నాయి. * మన దేశం సంగతో! వేరే చెప్ప నక్కర్లేదు. ఎదుగు కనపడక పోయినా తరుగు పూరాగా కనపడుతూంది. అనేకవిధాల అజ్ఞానం, అవిద్య నిండి వుండడంవల్ల దేశస్థితి అధోగతిగా వుంది. ఇప్పటి ప్రజలలో ధైర్యం, శౌర్యం గౌరవం, స్వాతంత్ర్యప్రియత్వం, త్యాగం మొదలైన గుణాలు బొత్తిగా తక్కువగా వుండడానికి కారణం చిన్ననాడు తలిదండ్రులు చేసిన చెడ్డ తరిఫీదే. ఈ జాతిలో ధైర్యం, శౌర్యం, గౌరవం, స్వాతంత్ర్య ప్రియత్వం, త్యాగం మొదలైన గుణాలు ముందుముందైనా పూర్తిగా కలగా లంటే యిప్పటి పిల్లలకు మనం పొందిన తరిఫీదు గాక మరొక మోస్తరు తరిఫీదు యియ్యాలి. ఈ జాతి యెప్పటికి యిదే మోస్తరుగా వుండకూడదు కదా? తక్కిన జాతులతో యిది కూడా సమానమైన స్థితినే పొందాలి కదా? అయితే ఈ కొత్త స్థితి రావా లంటే దేశప్రజలలోనే కొన్ని కొన్ని మార్పులు రావలసి వుంది. 'మాకు యింతకంటె మంచి స్థితి యైనా అక్కర్లేదు' 'ఇప్పటి స్థితి కన్నా మంచి స్థితి భూలోకంలోనే లేదు' అనే భావాలు మనసులలోంచి తొలగిపోవాలి. పూరాచారిత్వం, సంఘానికి భయపడడం మొదలైనవి నశించిపోవాలి. ఈ విషయాలను గురించి బిడ్డల శిక్షణలో పదేపదే చెప్పబడింది. ఈ మోస్తరుగా మనుష్యు లెప్పుడు పూర్తిగా మారుతా రంటే? సంఘంలో వుండే టటువంటి లోటుపాట్లు బాగా తెలిసినప్పుడే. బిడ్డలను పెంచే విధానం గురించి పుస్తకం చదవండి అంటే అనేకమందికి విచిత్రంగా కనపడుతుంది. మన పెద్దలు బిడ్డలు పెంచే విధానం గురించి యేయే పుస్తకాలు చదివేరు మనని పెంచడానికి? అని ఆశ్చర్యంగా అడుగుతారు. బిడ్డలను పెంచే విధానం గురించి మన పెద్దలు యేమీ పుస్తకాలు చదవకపోడం చేతే మన జాతి పైన చెప్పబడిన స్థితిలో వుంది. కనుక మన జాతి మంచి స్థితికి రావాలంటే మనం కొత్త పద్ధతులు నేర్చుకొని పిల్లలను పెంచాలి.

బిడ్డలను పెంచే విధానం గురించి ముఖ్యంగా స్త్రీలు యెక్కువగా నేర్చుకోవలసి వుంది. తల్లుల తరిఫీదు మీదే ముఖ్యంగా పిల్లల బాగోగులు ఆధారపడి వున్నాయి. కాని యిప్పటి స్త్రీజాతినిగురించి వేరే చెప్పక్కర్లేదు. అజ్ఞాననిధులుగా వున్నటువంటి యిప్పటి స్త్రీలు యెంతో విద్య, జ్ఞానం నేర్చుకుంటే కాని పిల్లలికి సరియైన శిక్షణ యియ్యలేరు. ఈ పుస్తకాన్ని స్త్రీలు విశేషశ్రద్ధతో చదివి లాభం పొందుతా రని తలుస్తున్నాను.

పిల్లలిని బాగుచెయ్యా లంటే ఆపని చిన్నప్పుడే జరగాలి. "మనుష్యస్వభావాన్ని అభివృద్ధి పరచేందుకు బాల్య మొక్కటే తగిన వయస్సు. అప్పుడు గనక బిడ్డను తగిన శిక్షణలో వుంచితే ఆ బిడ్డ పెద్దదైనప్పుడు, యిప్పుడు ప్రజలకి వుండే మూఢత్వమూ,

* 1938 డిసెంబరు 'భారతి'లోని నార్ల వెంకటేశ్వరరావుగారి 'నేటిరష్యా' అనే వ్యాసం చదివితే రష్యా విషయమై కొంత తెలుస్తుంది...వే. కా.

భయమూ, కలిగివుండక, ఉన్నతురాలవుతుంది. ఆనైసర్గిక స్వభావౌన్నత్యాన్ని బిడ్డలకు యివ్వగలిగితే, యింక చట్టాల వల్లా సంస్కారంవల్లా, బోధనవల్లా కలిగించడానికి ప్రయత్నించే మార్పులు యేశ్రమా లేకండానే ప్రజలలో తటస్థిస్తాయి.'' (పుట 4.) "బిడ్డను కవీశ్వరురాలూ, శూరురాలూ ఆరోగ్యవంతురాలూ, నీతివంతురాలూ, చేసే శక్తి పెద్దవారిలో కొంతవరకన్నా వుంది. ఆశక్తి వున్నా లేకపోయినా బిడ్డమాత్రం దుర్మార్గురాలూ, అవివేకీ నిష్ప్రయోజకురాలూ ఐతే ఆతప్పిదం చాలా వరకు తలిదండ్రులది.'' (పుట 46.)

ఈబిడ్డల శిక్షణ ముఖ్యంగా ఆరుప్రకరణాల కింద విభజించబడింది; తలిదండ్రులు, శరీరం శిక్ష, బిడ్డా—ప్రపంచమూ, ధర్మమూ—నీతీ, విద్య అనేవి. ఆయాప్రకరణాలకింద తెలియవలసిన సంగతులన్నీ చెప్పబడ్డాయి. తల్లిదండ్రులు యెందుచేత పిల్లల్ని గురించి యెక్కువ శ్రద్ధ తీసుగోవాలో, తల్లిదండ్రులు పరిశీలించవలసిన సంగతులేమిటో, తలిదండ్రులలో రావలసిన మార్పేమిటో మొదటి ప్రకరణంలో చెప్పబడింది. బిడ్డల శరీరం విషయమై తీసుకోవలసిన జాగ్రత్త అంటే బిడ్డలయొక్క భోజనం, నిద్ర బట్టలు, శుభ్రం, వ్యాయామం యేడుపు, అలవాట్లు మొదలైన వాటిని గురించి రెండో ప్రకరణంలో చెప్పబడింది. బిడ్డలకు చేసే అలవాట్లలోనే బిడ్డల క్షేమం విశేషంగా వుంది. అంచేత అలవాట్లను గురించి అనేక అంశాలు పుస్తకంలో చెప్పబడ్డాయి "మనుష్యజీవితం అలవాట్ల సమూహం'' (పుట 4?) "శ్రమపడి బిడ్డలకు మంచి గుణాలే అలవాటు చేసి, దుర్గుణాల్ని నివారించి, నేర్చుకునే దుర్గుణాల్ని పోగొట్టగల శక్తి తమలో వుందని పెద్దవారు నమ్మాలి. పుట్టేప్పుడే పూర్వజన్మకర్మ ప్రకారం యేవో గుణాలతో పుడతారు. వాటిని మార్చడం యీశ్వరుడి తరం కాదనే కర్మవేదాంతం వాదించినా, దాని ప్రకారం నడుచుకునే మూర్ఖుల్ని చూడబోము. అట్లానే నమ్మితే యీపుస్తకం చదవనూ అఖ్ఖర్లేదు బిడ్డల యెడల శ్రద్ధ తీసుకోనూ అక్కర్లేదు. బిడ్డల్ని బాగుచేస్తామనుకొని వారిని కొట్టేప్పుడూ తిట్టేప్పుడూ ఆవేదాంతాన్ని మర్చిపోతోనే వున్నారు. కర్మసిద్ధాంతంలోనైనా మనిషికి జరిగే కష్టసుఖాలు శాసింపబడతాయన్నారు గాని, అతని గుణాలు నిర్ణయింపబడతాయన లేదు. సుఖదుఃఖాలు పూర్వజన్మకర్మ ప్రకారం కలిగినా వాటిని అనుభవించే పద్ధతీ, వాటివల్ల పాఠాల్ని నేర్చుకుని బాగుపడడమూ, వాటివల్ల నాశనము కావడమూ, మనిషి గుణాల మీదా, స్వభావంమీదా ఆధారపడి వుంటుంది. అలవాట్ల ద్వారా ఆగుణాల్ని పెద్దవాళ్లు చాలావరకు బిడ్డలో యేర్పరచగలరు.'' (పుటలు 44, 45) "పెద్దవాళ్లు నేర్పినా నేర్పకపోయినా. పుట్టిన నిమిషాన్నించీ పిల్లకి అలవాట్లేర్పడుతూనే వుంటాయి. మంచి వాటిని ప్రవేశపెట్టకపోతే చెడ్డవి అలవాటవుతాయి.'' (పుట 48)

మూడవ ప్రకరణం శిక్ష. ఈప్రకరణం చాలా ముఖ్యమైనది. ఇప్పటి వరకూ దేశంలో యీప్రకరణంలో చెప్పబడ్డ సంగతులకి వ్యతిరేకంగా జరుగుతూంది. బిడ్డల శరీరమూ, మనస్సూ కూడా చెడిపోకుండా వుండాలంటే యీప్రకరణంలో చెప్పబడ్డ ప్రతి అక్షరం తలిదండ్రులు పాటించవలసిందే. ఇదివరకు తలిదండ్రులు కని విని యెరగని అనేక సంగతులు యీ ప్రకరణంలో చెప్పబడ్డాయి.

నాలుగవ ప్రకరణం 'బిడ్డా—ప్రపంచమూ' దీనిలో ఆటా—పనీ, తక్కిన పిల్లలు, పెద్దవాళ్లు, సేవా—ఆర్జనా మొదలైన వాటిని గురించి తెలుపబడింది. పెద్దవాళ్లు పిల్లలకు ముఖ్యంగా నేర్పవలసిన సంగతి, "కాని బిడ్డ తన నడవడిని లోకాభిప్రాయంమీద ఆధారపెట్టుకోకండా వుండడం నేర్పాలి. లోకాన్ని ప్రేమించాలి గాని, లోకం తప్పుమార్గంలో వుందని విశ్వసించినప్పుడు, నిర్లక్ష్యంగా, తిరగబడాలి. తన అంతరాత్మకి తోచినట్టు చేసితీరాలి. యెవరేమన్నా సరే, వొచ్చే

పుస్తకంలో కొన్ని యింగ్లీషు ముక్కలు అనవసరంగా ప్రయోగింపబడ్డాయి. వీటికి తెలుగు వుండనే వుంది. స్త్రీలు చదవవలసిన పుస్తకంలో అనవసరంగా యింగ్లీషు మాటలు ఉంచకూడదనుకుంటున్నాను. ఏదైనా యీ మాటలు అట్టే లేవు. 'ప్రిన్సిపిల్సు, టెంపర్‌మెంట్, ఎట్మాస్ఫియర్, ఇన్‌స్టింక్ట్సు, ప్రపోర్షనేట్, ఎన్కరేజ్, ఎప్రిసియేషన్''

ప్రకటనకర్తల అశ్రద్ధవల్ల ఈ పుస్తకంలో అచ్చుతప్పులు ఎక్కువగా ఉన్నాయి.

ఈ పుస్తకం స్త్రీపురుషులంతా చదివి తాము బాగుపడి, పిల్లలను బాగుచేసి, జాతిని బాగుపరచవలసివుంది. ఈ పుస్తకం ప్రతి ఆంధ్రవ్యక్తీ చదివి దేశాన్ని బాగుచేస్తారని నమ్ముతున్నాను. *

రావుసాహేబు, మహోపాధ్యాయ,

# గిడుగు వేంకట రామమూర్తిపంతులుగారికి

## విజయపట్ట ప్రదానం

బాగా జ్ఞాపకం వుంది.

కవిశేఖర (ఇప్పుడు) వడ్డాది సుబ్బారాయుడుగారు వొకప్పుడు కొన్ని పద్యాలు చదివారు. అది 1918 వ సంవత్సరం ఏప్రిలు నెల. రాజమహేంద్రవరంలో ఆంధ్రసాహిత్య పరిషద్వార్షిక సమావేశం జరిగింది. అప్పట్లో ఆంధ్రసాహిత్య పరిషత్తు ఆంధ్రభాషా వాఙ్మయాల వికాసం సాధించడానికి పుట్టిందనీ, సాధిస్తుందనీ, "పరికరాలన్నీ అమరేయి కనక అవు" నని అందరూ భావిస్తూ వుండేవారు. ఆసమావేశానికి అనేక పండితులూ, కవులూ, భాషాభిమానులూ, వాఙ్మయ ప్రియులూ దూరదేశాలనుంచి కూడా ఆశ్చర్యయనంగా వచ్చారు. గిడుగు రామమూర్తిపంతులుగారు కూడా తమ శిష్యబృందంతో వచ్చారు, కాని వారికి తమ వ్యావహారిక భాషావాదం వినిపించడానికి యెవరూ అవకాశం యివ్వలేరు. పైగా కొందరు పండితులు రామమూర్తిపంతులుగారూ, జయంతి రామయ్యపంతులుగారూ వాది ప్రతివాదులని యూహిస్తూ రామమూర్తిపంతులుగారు వోడిపోయారనీ, తిరస్కృతులైపోయారనీ—ఇంకా—ఇంకా—అన్నారు. అప్పుడు వసురాయడుగారు చదివిన పద్యాల్లో వొకదానిలో యిప్పుడవసరమైన భాగం యిది.

"గిడుగు రామమూర్తి నుడుగు నిల్వకపోయె
నోగి జయంతి రామయ్యోక్తి గెలిచె"

వసురాయడుగారి కప్పుడూ సభాసదుల భాషాజ్ఞానంమీదా, రసికతమీదా విశ్వాసం వుండదు. అంచేత వారు తమ పద్యాలు ఏసభలో చదివినా, విధిగా అర్థం కూడా చెబుతూ వుంటారు. అప్పుడు కూడా అలాగే సెలవిచ్చారు.

"కామ వుండేది గొడుగు. కామ లేనిది గిడుగు. గిడుగు గాలికి యెగిరిపోతుంది. రామమూర్తి పంతులుగారి వాదం గిడుగులాగ ఎగిరిపోయింది జయంతి అనగా జయశీలము. రామయ్యపంతులుగారి వాదం జయశీలం కనక అది గెలిచింది"

అప్పుడు ఆస్వారస్యం చాలా కరతాళాలు పొందింది.

ఇది యిరవై యేళ్ల నాటి మాట. హేళన చేస్తూ, పెదవులు విరుస్తూ లేవిడీలు కొడుతూ గ్రాంధిక

* ఈ గ్రంథం వెల 0-8-0. కావలసినవారు కళాభివర్ధని పరిషత్తు రాజమండ్రి అని వ్రాయవలెను.

(ఇప్పుడదే గ్రాంధికం కాదు.) వానులు బుజా లెగర త్రేసుకుంటూ వుండేవారు; కాని రెండు దశలు గడిచాయి. గిడుగే నిలిచింది లక్షణంగాను.

* * * *

1938 డో సంవత్సరం డిసెంబరు 27 డో తేదీ రాజమహేంద్రవర నగర చరిత్రలోనూ, ఆంధ్ర భాషా చరిత్రలోనూ, ఆంధ్రవాఙ్మయ చరిత్రలోనూ, ఆంధ్రదేశ చరిత్రలోనూ, ఆంధ్రజాతి చరిత్రలోనూ ధ్రువతారలాగ మిలమిల మెరుస్తూ వుంటుంది. ఆవేళ నవయుగ పురుషులైన శ్రీరామమూర్తిపంతులు గారికి ఆంధ్రదేశీయులు విజయపట్టం కట్టారు.

చిత్రాంగిమేడ ఆవరణ అంతా సభ్యులతో కిటకిటలాడిపోయింది. నవీన వాఙ్మయ నిర్మాతలైన కవికుమారులంతా సింగపుకొదమల్లాగ బారులు తీరి కూర్చున్నారు. చిలుకూరి వీరభద్రరావుగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు, నిడమర్తి సూర్యయ్యగారు మొదలైన వృద్ధులుకూడా చాలా మంది దయచేశారు. తమ పూర్వపు చమత్కారాన్ని దిద్దుకోడానికా అన్నట్టు వడ్డాది సుబ్బారాయడుగారు గూడా విజయంచేశారు. యువకులై వుండిన్నీ యింకా పూర్వాంధ్రాన్ని పట్టుకునే పాకులాడుతూ వున్న కవిరాజు వత్సవాయి నీలాద్రిరాజుగారున్నూ దయచేశారు. కొంతసేపటికి సర్. వెంకటరత్నం నాయడుగారు వచ్చారు.

జయంతి గంగన్నగారు సభకి ఆధిపత్యం వహించి కార్యక్రమం నడిపారు. కుమారులూ, మనమలూ పరివేష్టించియుండగా రావుసాహేబు, మహోపాధ్యాయ గిడుగు వేంకటరామమూర్తిపంతులుగారు ధర్మపత్నితో నిండుకొలువు తీర్చారు.

కళ్లున్నవారు ఆ సౌభాగ్యం, ఆ వైభవం, తేజస్వంతమైన ఆసన్నివేశం చూసి సంతోషించారు. హృదయం వున్నవారు ఆ అపరవాగనుశాసనుని మహాత్వం బోధపరుచుకొని పరవశులైనారు

అధ్యక్షులు రామమూర్తిపంతులుగారిని గురించి చాలాసంగతులు చెప్పి "వ్యావహారికభాషకు ప్రాముఖ్యం యివ్వాలని పంతులుగారు 1907 డో సంవత్సరంనుంచీ కృషిచేస్తున్నారు. వీరి కృషివల్లా, పట్టుదలవల్లా వ్యావహారిరభాషలోనే నేడు అనేక కవులు గ్రంథరచన చేస్తున్నారు. వీరికి కన్నడమూ, ఫ్రెంచీ, ఇంగ్లీషూ, అరవమూ, తెనుగూ, సంస్కృతమూ, లాటినూ—ఈ భాషల్లో అపారమైన పాండిత్యమున్నది. వీరు మాట్లాడుతూ వుంటే వొక్క పొల్లుమాట అయినా రాదు; వీరితో మాట్లాడడం విద్యాభ్యాసం చెయ్యడమే. వీరిని నడుస్తూవున్న—మాట్లాడుతూ వున్న విశ్వవిద్యాలయం అంటే అతిశయోక్తి యేమీ వుండదు. గంజాం జిల్లావాసులైన పంతులుగారికి ఆంధ్రవాఙ్మయానికి మూలపీఠమైన రాజమహేంద్రవరంలో యిలాంటి సన్మానం చెయ్యడం చాలా గొప్ప విషయం. పంతులుగారిని తెనుగులో ఫయిలాలాజికల్ గ్రామరు రాయవలసిందని మనం కోరవలసివుంది" అంటూ సభాప్రారంభం చేశారు. తరవాత ఆంధ్ర దేశేతిహాసపరిశోధక మండలివారూ, గౌతమీగ్రంథాలయంవారూ, రాయలసీమ కృష్ణదేవరాయలవిద్యాపరిషత్తువారూ, ఆంధ్రభారతీ తీర్థవారూ, కల్చరువుమెన్సు సొసైటీవారూ, కళాసమితివార్నూ, సాహితీసమితివారూ, సాహిత్యమండలివారూ, రామరాయచిత్రకళా సంఘంవారూ పంతులుగారికి సన్మానపత్రాలూ పూలదండలూ సమర్పించారు.

తరవాత కావ్యవ్యాకరణతీర్థులు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిలుగారు యిలా సెలవిస్తూ శ్రీ పంతులుగారికి వెండిపెట్టెలోవుంచి కమెమొరేషన్ వాల్యుములు సమర్పించి, దుశ్శాలువులు కప్పినారు కరతాళధ్వనులతో దిక్కులు పిక్కటిల్లినవి.

"ముక్కోటి ఏకాదశి మహాపుణ్యదినం. పవిత్రమైన వృద్ధగౌతమీతీరం. పండితులుగా, కవులుగా చిత్రకారులుగా, భాషాసేవకులుగా, సంఘసేవకులుగా ఎన్నోతరాలనుండీ నేటి దాకా ఎన్నెన్ని

మార్గో ఆ విశ్వమూర్తి అవతరించిన స్థలం. ఎనకటి జన్మాలల్లో చేసిన పుణ్యం కొద్దీ ఈజన్మలో ఇన్ని నాళ్లకు ఆంధ్రపండితుణ్ణి అనే పేరు పెట్టుకొన్నందుకు కలలో కూడా ఇట్టి భాగ్యం లభిస్తుందని అనుకోని నాకు శ్రీరామమూర్తిపంతులు గారికి కమెమొరేషన్ వాల్యూం సమర్పించే మహాభాగ్యం కలిగింది.”

“రాజకులైకభూషణుడు రాజనరేంద్రుడి కాలంలో గానీ, తెలుగువల్లభుండ, తెలుగొకండ అని చెప్పుకో గలిగిన రాయల కాలంలో గానీ ప్రభు పీఠాలు, పండితపూజలు మహావైభవంతో జరిపి వున్నా యనుకొన్నా జనసామాన్యానికి అందుబాటులో వుండేటట్టు విజ్ఞానాన్ని వ్యాపింపజేస్తానని కంకణం కట్టుకొని దాన్ని సార్థకం చెయ్యగలిగిన మహాసత్త్వుని ప్రజ్ఞానిధిని పండితుని కృతజ్ఞతతో సత్కరించేందుకై ముక్కోటి మతభేదాలుగల మనముక్కోటి ఆంధ్రులూ ఏకగ్రీవంగా సిద్ధపడడ మనేది నాడు వుందా అని ఆశంకిస్తున్నాను.”

“ఆంధ్రదేశంలో ప్రజ్ఞాప్రభావనిధు లగు పండితులకు గానీ, ప్రభువులకు గానీ నేటికీ కొరత లేదు; అనంతసత్వసంపన్ను లయిన అన్నలూ, తమ్ములూ అనేకు లున్నారు. వారు పూనుకొంటె ఇట్టి మహోత్సవాలు అనేకం నిర్వహిస్తారు నిస్సందేహంగా. అయినా అవి వారి ప్రజ్ఞావిభవాలను వెల్లడిస్తాయే కాని ఆంధ్రజనసామాన్యపు హృదయానందాన్ని, కృతజ్ఞతాపారమ్యాన్ని వెల్లడింపలేవేమో అని నా ఊహ.”

“రామమూర్తిపంతులుగారి అమూల్యమైన జీవితకాలంలో ఇది డెబ్బయి వకటో యేడు. అయినా సింహగర్జనంతో సారస్వతక్షేత్రానికి వురికే వారి మూర్తిని చూస్తే “వృద్ధా శ్శిష్యా గురుర్యువా” అనిపిస్తుంది. పంతులుగారు వ్యావహారికాంధ్రానికి యుగపురుషులు. అంటే వారి సృష్టి అనుకోరాదు. ఇది తెనుగుతల్లి అనాదైన లీలావిభవం. పంతులుగారున్నూ ఆతల్లియొక్క రూపాల్లో చేరినవారే, అయినా ఆయన ఆతల్లికి వక అర్చావిగ్రహం కల్గింపకలిగినారు. కాబట్టే ఆయన్ను యుగపురుషు డన్నాను.”

“వ్యావహారికాంధ్రం ఆయన చేతుల్లో వప్పగింపబడింది మొదలుకొని నేటిదాకా ఈరెండు పుష్కరాల్లోనూ దాన్ని రూపుమాపుటకై మనలో కొందరు చూపిన ప్రతిపక్షకికి ఏమీ లోపం లేదు. కావలసినంత. ప్రాతికూల్యప్రవాహం ఉరవడించే కొద్దీ అతిజాగ్రత్తతో నావ నడిపి ఒడ్డుకు చేర్చిన కర్ణధారుడు రామమూర్తిపంతులు కాబట్టే జనసామాన్యకోటిలోని మనం అందరం ఆయనకు కృతజ్ఞత వెల్లడించుకొనేందుకు ఈ ఉవుత్సవం ఏర్పాటు చేశారు. ఉద్యానప్రతిష్ఠ సప్తసంతానాల్లో వకటి. పంతులుగారి నిరంతరకృషివల్ల ఏర్పడ్డ వ్యావహారికాంధ్రోద్యానం శాశ్వతమైంది. కాపు పట్టింది. బీదా సాదా భేదం లేకుండా పండితుల దగ్గర్నుంచి పామరుల వరకూ ఆకర్షించి హాయినీ, స్థాయినీ, ఆనందాన్నీ యిస్తున్నది. అజరామరం అయింది కాబట్టే వారి యీ డెబ్బయ్యో జన్మదినోత్సవంలో వారి తోటలో పూచినట్టీ, పండినట్టీ పుష్పాలనూ, ఫలాలనూ వారికే యీ కమెమొరేషన్ వాల్యూములు రూపంగా కృతజ్ఞతతో సమర్పిస్తున్నాము. ఈకాన్కలో పంతులుగారి భాషావ్యవసాయాన్నీ పాండిత్యప్రకర్షనూ మెచ్చుకుంటూ స్వదేశస్థులూ విదేశస్థులూ అయిన విబుధులు వ్రాసిన ఆంగ్లాంధ్రవ్యాసావళి వకటి. రెండోది భాషాతత్వప్రదర్శనపూర్వకంగా ఆంధ్రభాషాపరిణామాన్ని నిరూపించే స్వకీయవ్యాసావళి. మూడోది వారి వాదాన్ని నిరూపించే శబ్దాలను నిర్దుష్టము లని ఋజువుపరిచే లక్షణగ్రంథం. పేరు బాలకవిశరణ్యం. నాలుగోది ఆంధ్రపండితభిషక్కుల భాషాభేషజం. అయిదోది ప్రాచీనకాలపు వచనరచన తెలిపే గద్యచింతామణి అనేది.

“ఆంధ్రాంగ్లవ్యాసావళిలో ముఖ్యాలు— స్టెన్ కోనోగారు వ్రాసిన ముండాభాషలు అనే వ్యాసం,

సీతాపతిపంతుల ఫరేన్ భాషను గురించిన వ్యాసం, ఎల్. వి. రామస్వామి అయ్యంగారి ద్రావిడిక్ గైడ్సు మున్నగునవి. ఇవి అచ్చం ఆంధ్రపండితులుగా వున్నవారికి ఎంతో విజ్ఞానాన్ని కలిగిస్తవి. డాక్టరు, నేలటూరి వేంకటరమణయ్యగారి చారిత్రిక వ్యాసం అమోఘపరిశోధన వెల్లడిస్తున్నది. పాశ్చాత్యపండితులు నేటి అభినవాంధ్రపండితుల పరిశ్రమనూ, ఉత్సాహమునూ ప్రశంసించిన వ్యాసాలున్నవి. ఆంధ్రవ్యాసాలలో పండితులూ పామరులూ కూడా గమనింపదగ్గవి అనేకం వున్నవి. అందులో శ్రీకోరాడ రామకృష్ణయ్యగారి "ఆంధ్ర భాషాపదములు—వాటి విష్పత్తిక్రమము" అనే వ్యాసమూ, డాక్టరు చిలుకూరి నారాయణరావు పంతులుగారి "వ్యాత్యాఛందస్సులు" అనే అమోఘమైన వ్యాసమూ, శ్రీ శివశంకరశాస్త్రి గారి "పదకర్తలు" అనే వ్యాసమూ, వేదుల సత్య నారాయణశాస్త్రిలుగారి హాస్యం వ్యాసమూ, "మాతృభాష—పరభాష" అనే వెంకటరత్నం గారి వ్యాసమూ వివిధవిషయపరిశోధనలను వెల్లడిస్తున్నవి. చింతా దీక్షితులుగారి 'లీలాసుందరి' అనే బాలానందం నిజంగా బాలానందమే. భమిడి పాటివారి "అన్నీ తగాదాలే" అనే వ్యాసం, తెలికిచర్ల కృష్ణమూర్తిగారి "అణువులు—వాటి పరిమాణము" అనే వ్యాసం, విస్సా అప్పారావు పంతులుగారి "చెవి చేయు పని" అనేదీ చాలా ఉత్తమవ్యాసాలు. రాళ్లభండివారూ, చిలుకూరి వారూ జాయింటుగా వ్రాసిన "తూర్పుగాంగ రాజులను గురించిన ఆరు క్రొత్త శాసనములు" అనేదీ, సోమశేఖరశర్మగారు వ్రాసిన "పొట్లచెరి మాతె సొదుశాసనవ్యాసం" అనేది అద్భుతములగు అనేక చారిత్రకాంశములనూ, తత్కర్తల విజ్ఞానమునూ చాటుతున్నవి. రెండోదీ, మూడోదీ, నాల్గోదీ శ్రీరామమూర్తిపంతులుగారి గ్రంథాలే."

"మొత్తం యీ అయిదు గ్రంథాలనూ ఆంధ్రదేశీయులందరికీ కలిసి అచ్చువేయించినారు. వాటిని ఈసభలో శ్రీరామమూర్తిపంతులుగారికి అర్పించే పనిని సభవారు నాకు ఏర్పరచినందున విశ్వేశ్వరునికి విశ్వగతమైన వస్తువులనే అర్పించిన రీతిగా సభవారి అనుమతితో వారు ప్రోది చేసిన వ్యావహారికాంధ్రం అనే ఉద్యానంలోని ఈదివ్యము లయిన గ్రంథరూపమైన పుష్పాలనూ, పండ్లనూ వారికే సమర్పిస్తున్నాను. శ్రీరామమూర్తి పంతులుగారు వీనిని స్వీకరించి ఆశీర్వదింతురుగాక."

తరవాత డాక్టరు చిలుకూరి నారాయణరావు పంతులుగారు తాము క్రొత్తగా రచియించి ఈసందర్భంలో ప్రకటించడానికే అచ్చువేయించిన అంబలిక—మొండిశిఖండి అను నాటకొన్ని పోక రంగం చదివి సభ్యులకు వినిపించి శ్రీరామమూర్తిపంతులుగారికి అంకితం చేశారు.

పిమ్మట రామమూర్తిపంతులుగారు వయస్సును బట్టి వృద్ధు లయినా సింగపుకొదమలాగ లేచి మేఘగంభీరగర్జనలతో యిలా సెలవిచ్చారు.

"ఏవిషయమైనా మంచిదో చెడ్డదో నిర్ణయించుకొనే భారము మనిషిమీద ఉంటుంది. ఒకరికి మంచిదని తోచింది వేరొకరికి మంచిది కాకపోవచ్చు. కాని మనస్సాక్షిగా తనకు మంచిదని తోచింది ఆచరించడము తన విధి. నేను నాకు మంచిదని తోచిన విషయమును గురించి పరిశ్రమచేసి అందలి సత్యము గ్రహించి వెల్లడిస్తాను. బాల్యము నుంచీ ఇట్టి నియమమునే నేను పెట్టుకున్నాను. ఆ నియమము ప్రకారమే నడుచు కొంటున్నాను. ఇక నావాదన సంగతి.

లోకమంతా వకటి. తక్కిన భాగాలతో సంబంధం లేనిదే అది ఉండదు. ఒక వేలు యింకో వేలుతో కూడితేనే గాని ఏ పని చెయ్యలేదు. విశ్వము అంగి. తక్కినవి అంగములు. శరీరము అంగి. అవయవములు అంగములు.

* * *

వివాహము ఒక institution దానిలో system

ఉంటుంది. దేవతార్చన కూడా అట్టిదే. వివాహములో మాటలూ దేవతార్చనలో మాటలూ వాటితో సంబంధం ఉన్న వారికి తెలుస్తవి.

యజ్ఞము కూడా ఒక (System.) కాని దాని నెవరూ చెయ్యడం లేదు. ఆమాటల కిప్పుడు అర్థము తెలియదు. యజ్ అనే ధాతువునుండి 500 మాటలు పుట్టినవి. ఇప్పుడు వాటి అర్థమేమి తెలుస్తుంది? సత్యనారాయణ వ్రతమునకు సంబంధించిన మాటలిప్పుడు తెలుస్తవి. system కీ తదంగముల కూపరస్పర సంబంధం ఉంటుంది.

భాష కూడా అట్టిదే. "భగవంతుడు మనుష్యునకు వాక్కు ప్రసాదించాడు" అని షెల్లీకవి అన్నాడు.

ఆరేండ్ల బాలుడికి అతని లోకజ్ఞానముతో సమానమైన భాష అతని కుంటుంది. అదే మాతృభాష; జీవద్భాష.

*   *   *

పూర్వము కాలమును తెలియ జేయడానికి గడియలు వాడుక చేసే వారు.

ఇప్పుడు గంటలు వాడుక చేస్తున్నారు. కాలము ఒక (System) దీనికీ అంగములకూ పరస్పర సంబంధం లేనిదే అర్థం కాదు.

నన్నయ్య ఈగోదావరిలోనే స్నానంచేసి సంధ్య వార్చేవాడు. నన్నయ "నేడు, ఎల్లి" అనే సందర్భములో మనము "ఈవాళ, రేపు" అంటున్నాము. నన్నయ కాలములో "రేపు" అనగా "మాపు" కాని దన్నమాట.

ఈ system లో వ్యత్యాసం కలిగింది.

నన్నయ్య కాలాన "సాని" అనగా "తల్లి" అని అర్థము. ఈకాలములో "తల్లి"ని "సాని" అనరు. ఇప్పుడు "సానెలు" ఏఅర్థములో వాడుతున్నామో అప్పుడు "లంజియలు" ఆ అర్థములో వాడేవారు.

నన్నయ కాలమునాటి ఉద్యోగాలు నేడు లేవు. నేడున్నవి అప్పుడు లేవు. ఇన్‌స్పెక్టరు, కలెక్టరు, ఓవర్సీయర్, హెడ్మాష్టర్ మొదలైన పదము ఈ కాలపువి. ఇప్పుడు అర్థమౌతవి. నన్నయ కాలపు నాటి పదములు ఇప్పుడర్థముకావు. ఎక్కువ శ్రమ చేస్తే కొన్ని అర్థమౌతవేమో.

*   *   *

భారతంలో శబ్దములన్ని దేశభాషతో సంబంధ కలవి గనక సార్థకములు.

*   *   *

డ్రాయింగు వేసినప్పుడు backgroun చెయ్యాలి. అది లేనిదే చిత్రాని కర్థం లేదు.

ఒక చిత్రములో గోపురము ఎత్తు తెలియజేయ వలసి వచ్చినప్పుడు ఒక చెట్టుతో సంబంధం ఏర్ప చాలి. ఒక బెలూన్ (balloon) ఎంత ఎత్తు వెళ్లిందో తెలపడానికి ఒకవిధమైన మేఘములతో సంబంధం ఏర్పాటు చేసి చిత్రించిన చిత్ర మొకటి ఒక ఫ్రెంచిపత్రికలో నేను చూచాను.

*   *   *

నన్నయ కాలమునాటి దేశభాషలో ఒక నూరో వంతైనా మిగల్లేదు. అంతా కొట్టుకుపోయింది. నన్నయకాలంలో అప్పటి వారి కర్థ మయ్యే పదాలు మన కిప్పుడు కావు. వేదకాలమునాటి పదముల కర్థముగాక వేదపండితులు వాటిని గురించి యద్వా యద్వా అంటూ ఉంటారు.

భారతభాషలో మాటలకు శబ్దరత్నాకరంలో అర్థము వ్రాయవలసి వచ్చినప్పుడు చింత్యము, అస్పష్టము ఇత్యాదిగా వ్రాసినాడు తద్గ్రంథకర్త.

నన్నయ కాలంలో ఏపదము ఎట్లా ఉండేదో తెలుసుకోవడం కష్టము.

నన్నయగారి తాటాకుల ప్రతి ఇప్పుడు దొరకదు. దానినుండి వ్రాసిన ప్రతులో ఆ ప్రతుల ప్రతులో మన కాలమున దొరుకుతవి. అవి ఎవరో లేఖకులు వ్రాసుకొన్నవి. వారు మాతృకనుండి సరిగా వ్రాశారా అంటే—అది దైవాయత్తం. "నడుచు, నడచు"—ఇం దేది సరియైన రూపమో నిర్ణయించడ

మెట్లా ? యతిస్థానంలో చూపగలిగితే తెలుస్తుంది. లేకుంటే తెలియదు.

"సాలయు, సాలము"—ఇం దేది సరియైనదో తెలుసుకోడానికి ప్రాసస్థానంలో చూడాలి. లేకుంటే తెలియదు. అది ద్వైవాయత్తం. శకటరేఫల విషయమూ అంతే.

నన్నయ కాలమునాటి భాష శిలాక్షరములలో నందంపూడి శాసనరూపమున ఉన్నది. దానిని బట్టి నాటిదేశభాషస్వరూపం కొంత తెలుస్తుంది. జయంతి రామయ్య పంతులుగారు దాని కర్థము చెప్పలేక పోయారు అనాటి భాషాస్వరూపం తెలియక పోవడంవల్ల. చరిత్ర తెలుసుకోవడంకోసమే భాష. నన్నయ కాలమునాటి భాష మళ్లీ ప్రయోగించ డానికి కాదు. నన్నయ భారతమును అచ్చువేసి నపుడు పరిష్కర్తలు రూపాలు మార్చారు. రెండు న్నర పర్వాలలో భాషా ఇదమిత్థము చెప్పడానికి వీలులేదు.

* * *

కవిత్వము ఒక కళ. కళకు దేశభాషలో ఉన్న అన్ని శబ్దాలూ అవసరము లేదు.

భాష వనసువంటిది. భాషలో ఎవరికి కావలసిన మాటలు వారు తీసుకొంటారు. నన్నయ కాలము నాటి దేశభాషంతా నన్నయ భారతములో ఉన్న దని చెప్పడానికి వీలులేదు. తెలుగుకు మారుగా సంస్కృతం వేసినచోట్ల తెలుగే వేస్తే నన్నయ భాష ఇంకా తెలిసిఉండేది. ఒకమాట. "అట్టిడు" అనే పదము ప్రథమావిభక్తి. దానికి ద్వితీయావి భక్తి ఏమిటి? నన్నయ వాడలేదు కాబట్టి మనకు తెలియదు. "కురియు"—దీనికి ప్రేరణార్థకము "కురిసిరి." నేడు "కురియించు" అనే పదమునకు మారుగా గ్రాంధికులు "కురిపించు" అని వ్రాస్తు న్నారు. ప్రాచీనభాష తెలియక వ్యావహారిక పద ములను వాడి దానిని గ్రాంధికమని లోకులను భ్రమింపజేస్తున్నారు. తిక్కనాదుల విషయములో కూడా ఇట్లే చూచుకోండి.

గ్రాంధికభాష అతుకులబొంత. స్పెన్సరు ఆ ఆంగ్లకవి ఫెయిరీక్వీన్ అనే కావ్యము యిట్టి భాషలో వ్రాస్తే పండితులు అది ఏభాషా కా దన్నారు. అట్లాగే గ్రాంధికభాష ఏభాషా కాదు ప్రాచీన భాషా కాదు, దేశభాషా కాదు. అందర కవుల భాషలా కలయిక. తెలుగులక్షణం పట్టి దెబ్బ లాట వ్యవహారం. సంస్కృతం ఇట్లా ఉండదు పతంజలి ఎంత చెప్పితే అంత.

* * *

గ్రాంధికభాషకు లక్షణం లేదు. "చేతురు కోతురు" ఇత్యాదులు చిన్నయ్యసూరి తప్పన్నాడు. గ్రాంధికు లంతా ఈ పదాలు వాడుతున్నారు. "ఉన్నాను" అనే మాట చిన్నయసూరి వప్పు కొన్నాడు. నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, జక్కన వరకూ ఎవరూ ఈ రూపము వాడనే లేదు. జయంతి రామయ్యగారు "ఉన్నాను ఉన్నారు" అనే ప్రయోగములు చేశారు. చిలకమర్తి లక్ష్మీనరసిం హంగారి గ్రంథాలలో ఈ ప్రయోగాలు కావలసి నన్ని ఉన్నవి. వ్యవహారభాషనే వ్రాసి ఉన్న ట్లయితే వారి రామచంద్రవిజయం ప్రమాణగ్రంథ మయ్యేది.

* * *

గురజాడ అప్పారావూ, పి. టి. శ్రీనివాస అయ్యంగారూ నేనూ ఈ వాదన లేవదీస్తే అప్పుడు మమ్మల్నందరూ దూషించేవారు.

The three tailors of the Tanning street అన్నారు మమ్మల్నప్పుడు.

* * *

వీరేశలింగంగారు బ్రతికున్నకాలంలో వారు నాతో భాషవిషయమై స్వేచ్ఛగా వాదించారు. నా వాదనలో సత్యం ఆయన అంగీకరించారు.

నన్నయ మొదలు వీరేశలింగంగారివరకూ భాష మారలేదని చిలకమర్తి లక్ష్మీనరసింహంగారన్నా రు. వీరు వ్రాసిన భాష నన్నయ భాష కావలసి వస్తే రెండువేల తప్పులు సవరించవలసి ఉంటుంది.

వడ్డాది సుబ్బారాయుడుగారు మహాజాగ్రత్తగా వ్రాసే కవి. వారు "అగుపడు" అనే పదం వాడారు. "అగుపడు" అనే పదము తప్పనిన్నీ, "అగ్గపడు" "అగపడు" అనే రూపములు సరియైనవనిన్నీ, "అగపడు" అనే పదమునకు అర్థము "స్వాధీనమగు," "చిక్కు" అనిన్నీ నేను వారికి చెప్పాను. వేదం వేంకటరాయశాస్త్రిగారు "జొపర్చు" "జొపించు" అనే వింత కృతక రూపాలు వాడారు. నేను చెప్పినమీదట వసురాయకవిగారు దిద్దుకొన్నారు. ఇందును గురించి వ్యాకరణములో సూత్రము లేదు కాబట్టి కవులు తమకు తోచిన రూపములు వాడారు. వావిలాల శివావధానులుగారు "అందరికి" అనే పదము మొదట వాడి తరవాత ఎవరో పండితులు తప్పన్నారు కాబోలు దానిని "అందరకు" అనే కృతక రూపముగా దిద్దారు.

గ్రాంథికభాష యిలా ఉన్నది.

అరవై సంవత్సరముల వయస్సు వచ్చినవారికి కూడా ఈభాష రాకుండా ఉంది. అకారమధ్యమో, ఇకారమధ్యమో, ఉకారమధ్యమో తెలియదు కొన్ని పదముల విషయమున ఈ పండితులకు. ఇం కెందుకు ఈ భాష!

గ్రాంథికభాషను పండితు లుంచుకోనిండి. మీరు దేశభాష వాడండి.

* * *

నా చిన్నతనంలో తీర్పులు తెలుగున వ్రాసేవారు. పండితుల అభిప్రాయాలు తీసుకొనేవారు. వాటికి ఫట్వాలు అని పేరు. ఈ ఫట్వాలూ తీర్పులూ వ్యావహారిక భాషలోనే ఉన్నవి. వచనగ్రంథములలో వ్యవహారభాషనే సంప్రదాయసిద్ధముగా వాడేవారని నా గద్యచింతామణి అనే గ్రంథములో అనేక గ్రంథములనుండి ఉదాహరణలతో నిర్ధారణ చేశాను.

నన్నయ తిక్కనలు తమ గ్రంథాలలో శుద్ధదేశభాషనే వాడారు.

నాకు ఎన్నో సన్మానపత్రాలు సమర్పించి నాకు లేని యోగ్యత మీరు ఆరోపించారు. నాకింత గౌరవ మిక్కడ జరుగుతుందని నేననుకోలేదు. మీకు నాయందు గల దయవల్ల నాయందు లేని గుణములు నాకు ఆరోపించారు.

* * *

ఈవాదము నాకు నచ్చింది. దేశభాషపై ఉన్న నిరోధం తొలగించడం మన కర్తవ్యము. స్వభాషలో మాట్లాడ్డానికి ధైర్యం లేకపోవడం ఏల? Gag చేశారు కాబట్టి. ఈ నిరోధం తొలగిస్తే స్వేచ్ఛ కలుగుతుంది. గవర్నమెంటుకంటె ఎక్కువగా పండితులు Liberty of speech (వాక్స్వతంత్ర్యము) తీసివేశారు. మనకు వాక్స్వతంత్ర్యము లేదు. గ్రామ్యత్వం తొలగించమంటున్నాను నేను. పండితులూ కవులూ శిష్టులూ వాడేభాష తప్పనడం అవివేకం. ఎలమంచిలి సభలో మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిగారు శిష్టవ్యవహారమందున్న భాష గ్రామ్య మనరాదని తీర్మానించారు. అపభ్రంశ మన్నే మాటఉన్నది. గ్రామ్యం అనే మాట లేనేలేదు. గ్రామ్య మన్నది పారిభాషిక పదము. వ్యుత్పత్తి నిరూపిస్తుందిగాని ప్రయోగము తప్పని సూచించదు. దేశభాష అపరిమిత ప్రయోజనముకలది. వ్యవహారములో లేని భాషలు పరిమిత ప్రయోజనము కలవి. పాణిని, పతంజలి కాత్యాయని వ్యవహారభ్రష్ట పదములు వాడరాదని అనుశాసించారు.

గురజాడ అప్పారావూ నేనూ బాల్యము నుండే విద్యాభ్యాసము చేశాము. చిన్నతనంలో మేమంతా కలిసి నలనాటకం ఆడాము. అప్పారావు కన్యాశుల్కం వ్రాయడాని కిదో కారణం

ఇంగ్లీషు ప్రైమరీ పరీక్ష ప్యాసయి మన దేశము ఏ పోలీసు సూపరెంటు ఉద్యోగము చెయ్యడానికో ఇంగ్లీషు వాడు వస్తాడు. అతడు మాట్లాడే ఇంగ్లీషు చక్కని ఇంగ్లీషు అంటారు. యమ్మే ప్యాసుచేసిన విద్యాధికుడు మాట్లాడే తెలుగు తెలుగు కాదు

టారు మన పండితులు. పండితులు వ్యవహార భాషలోనే బోధిస్తారు. మేము వ్రాస్తే తప్పంటారు. సత్యం తెలిసేవరకూ తిడతారు.

ఈ ఊళ్లో వెనక సభ చేసినప్పుడు నామాట ఎవరూ వినలేదు. అప్పుడు కొవ్వూరిలో సభజరిగింది. ఆసభలో పోలవరం జమీందారుగారూ, దివాకర్ల తిరుపతిశాస్త్రిగారూ నావాద మంగీకరించారు. వీరేశలింగంగారూ నావాద మంగీకరించారు.

ఇరవై సంవత్సరాలకు క్రితము వ్యవహారభాష బోధించవచ్చునని తీర్మానిస్తే పనికిరాదని 20,000 మంది వ్రాళ్లతో రెండువందల టిల్లి గ్రాములతో గవర్నమెంటు వారికి మహజరు పంపించినారు. అప్పటికది ఆగిపోయింది.

ఇప్పుడు ఏమి చేయవలెనో మీకు తెలుసును. రెండుకోట్లమంది సొమ్ము దేశ భాష. హక్కు కాపాడగలవారు మీరు.

శివశంకర శాస్త్రిగారు నాచెయ్యిచూచి ఇంకా పదకొండు సంవత్సరాలు బ్రతికి ఉంటావని సాముద్రికం చెప్పినారు. నేను జీవించి ఉంటే నేను పూనుకొన్న నిఘంటు కార్యము పూర్తిచేస్తాను. శబ్దరత్నాకరములో 2000 తప్పులున్నవి. నేనన్న మాటే కాదిది. మానవిల్లి రామకృష్ణకవిగారూ సూర్యరాయ నిఘంటుకారులూ కూడా ఈమాటే అన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అనేక వందల మాటలు శబ్దరత్నాకరములోకి ఎక్కలేదని చెప్పినారు.

వ్యాకరణమూ నిఘంటువూ—ఇవి record వంటివి. ఇవి ప్రమాణము కావు. శిష్టవ్యవహారమే ప్రమాణము.

వైయాకరణులూ, నైఘంటికులూ శిష్టపదములు వేసుకోకుంటే వారిదే తప్పు.

వాక్కు ఆత్మను ప్రకాశింపచేసేది. లోకానికి సూర్యునివల్ల ప్రకాశము కలుగుతోంది. సూర్యుడు లేనప్పుడు చంద్రుని ప్రకాశ ముంటుంది. చంద్రుడు లేనప్పుడు నక్షత్రములు ప్రకాశిస్తవి. నక్షత్రములూ లేనప్పుడు, అగ్ని. అగ్ని లేనప్పుడు వాక్కు.

ఆత్మను ప్రకాశింపచేస్తుంది వాక్కు.

"శబ్దబ్రహ్మాత్మనే శివాయ నమః"

పంతులుగారు ఉపన్యాసం చేసినంతసేపూ స్త్రీపురుషు లందరూ—సభ అంతా నిస్తరంగసముద్రంలాగ గాంభీర్యం వహించింది.

మనవాళ్లు పదిమంది యెక్కడ కూడినా గుసగుసల్లో పడిపోతా రని వొక నింద వుంది; కాని నేను దాని కంగీకరించను. సభ్యుల ప్రవర్తన ఉపన్యాసకుని వాఙ్మాధుర్యాన్నిబట్టీ, ఉపన్యాసవిషయాన్ని పట్టీ మారుతూ వుంటుంది. రామమూర్తి పంతులుగారి వంటి వక్తలు మనలో అరుదుగా వున్నారు. వారెక్కడ యెప్పుడు ఉపన్యాసం చేసినా సభ్యులు గాంభీర్యముద్రనే వహిస్తారు. ఆనాటి సభలో కుమారకవిసింహులుకూడా చాలా మంది వుండడంచేత సభ అంతా గాంభీర్యాన్నే గాక ఔదార్యాన్ని కూడా ప్రకటించింది.

గోదావరితల్లి యిదంతా చూసింది. ఇదంతా వింది. ఆదికవీ, ఆదివాగనుశాసనుడూ అయిన నన్నయ్య భట్టారకుని లీలావిలాసా లన్నీ చూసి ఉప్పొంగిన మహానుభావురా లామె. ఆదిపురుషుని, పరమ పవిత్రమైనిక జీవితాన్ని మన కిప్పటికీ అస్పష్ట కలకల నినాదంతో వినిపిస్తూ వున్న వాత్సల్యవతి ఆమె. రాజరాజనరేంద్రుని నిండుకొలువై కవితా వినోదాలతో ఘూర్ణిల్లిపోయిన రాజమహేంద్రవరంలో యిప్పటికీ, ఎప్పటికీ కూడా కవితావిలాసాలూ, వాఙ్మయప్రీతీ ప్రోదిచేసే అమృతపయస్విని ఆమె. ఆమె రామమూర్తిపంతులుగారి మహత్తు గ్రహించింది. వారు నన్నయభట్టారకుని పదవిలో నిలిచివుండడం గుర్తించింది. సమగ్రమైన ఆంధ్రజాతి ఈ ఆధునిక వాగనుశాసనుడికి పాదపూజ చేస్తూ మళ్లీ తన భవిష్యదున్నతికి పునాది వేసుకుంటూ వుండడం గ్రహించింది. ఆమెకి పులకలు పేటెత్తాయి. హృదయం ఉప్పొంగిపోయింది. ఆనందమూ పారవశ్యమూ తలమునకలైపోయాయి.

నామాటమీద మీకు నమ్మకం లేకపోతే ఆమె జీవనంలో కొత్తపొంగూ, ఆమె నడకలో కొత్త భంగిమా, ఆమె కలకలనవ్వులో కొత్త మాధుర్యమూ కలిగాయో లేదో వెళ్లిచూడండి.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

# వేదికలు — పత్రికలు

## "మనకిప్పు డెలాంటి నాటకాలు కావాలి?"

డిశంబరు చివరివారంలో మద్రాసులో జరిగిన మూడో ఆంధ్రనాటకకళాపరిషత్సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ. టి. రాఘవాచారిగారు ఈ విషయం యిలా సెల విచ్చారు.

"...ఇపుడు నాటకరంగములందు పాడబడుచున్న సంగీతము శిరోవేదనమును కలిగించుటకు మాత్రమే ఉపయోగించుచున్నది. నాటకములలో సంగీత ముండగూడ దని నేను చెప్పుట లేదు. సంగీతముతో గూడిన నాటకములను మనము ప్రదర్శించి అందువలన ప్రేక్షకుల కానందము కలిగింపగలుగుదుము. కావున నిపుడు రంగస్థలములలో మనము వినుచున్న సంగీతము నాటకముల కెంత మాత్రమును పనికిరాదు. ఇపుడు ప్రేక్షకులు గూడ పూర్తిగా సంగీతవ్యామోహమునకు దాసు లగుటచే మన నాటకములు పాటకచేరీలుగను, హరికథా కాలక్షేపములుగను మారిపోయినవి. ప్రదర్శింపబడవలసిన నాటకముల సంగతిని ప్రేక్షకులు పూర్తిగా మరిచిపోయి, నటులు రంగస్థలమున కూర్చుండి తాము కోరిన పాటల నన్నిటిని పాడవలె నని నిర్బంధించునట్టి దుస్థితి గూడ నిపుడు తటస్థించినది. ఇంతకంటె అవమానకర మగు విషయము మరేదియు నుండదు. ఆంధ్రనాటకరంగ మింతటి నీచస్థితికి రాగల దని నేనెన్నడును తలచియుండలేదు. ఆంధ్రనాటకములు అధమాధమము లగు యక్షగానముల స్థితికి వచ్చినవి. దీనికి గల కారణమందరికిని దెలిసినదే. ఇదివర కీపరిషత్తువారు రెండు వార్షికసభలను జరిపిరి. ఇది మూడవది. ఆంధ్రనాటకరంగమునకు సంప్రాప్తమైన ఈదుస్థితిని తొలగించుటకు మీ రేమి చేసితి రని విజ్ఞానధను లగు మిమ్ములను నే నడుగుచున్నాను. ఇందులకు మీరే బాధ్యులు. విద్యాధికులారా! యువజనులారా! విద్యార్థులారా! ఆంధ్రుల ఉదార మగు నాట్యకళను హత మొనరించుచున్న యీ క్రూర పిశాచమును మారణహోమము గావించుట యను ఘనతమ మగు కార్యభారమును మీరు వహింపవలెను. ముందుగా ప్రాతనాటకములను మూలబెట్టి సరియైన పద్ధతిని క్రొత్తనాటకములను వ్రాయించవలెను. యువకులలో గ్రంథకర్తలును కవులును నడుములు కట్టి మన కళాప్రకాశమును మందీకృత మొనరించుచున్న మూఢవిశ్వాసములను సంప్రదాయములను తుడిచివేయవలెను. విశ్వామిత్రుడు నూతనసృష్టి చేయగలుగుటకు సహాయభూతమైన నిర్భయత్వ మను రసాయనమును తనివిదీర మీరాస్వాదింపవలెను. తనతో పాటు శునకమును గూడ సురపురికి గొంపోవలె నని దేవేంద్రుని నిర్బంధించిన యుధిష్ఠిరునకు గలిగిన జీవకారుణ్యమును మీ రలవరుచుకొనవలెను. ఇట్టి జీవకారుణ్యమే ఆధునికులలో తుకారాము తన చెంతనున్న ఒక్క రొట్టెముక్కను హరించిన కుక్కకు ఘృతమును గూడ ఒసంగునట్లు చేసినది. నూరుమంది భార్యలుండినను బాలిక నూటయొకటవ భార్యను పెండ్లియాడ గోరునట్టి పురుషాధములను దమ నాటకములలో నాయకులనుగా జేయునట్టి కవులును గ్రంథకర్తలును నాకు కావలెను. కణ్వాశ్రమమున నమ్మించి పెండ్లియాడి మరచిపోయిన దుష్యంతుని వంటి భర్తలను పాదప్రహారములచే బహిష్కరించు శకుంతలలను, వితంతుశరణాలయములను సమర్థించునట్టి సావిత్రులను నాయికలనుగా నొనరించు కవులు నాకు కావలెను. ప్రాచీనకాలమునందువలె మరల నాటకరంగమును విద్యాలయముగా చేయగలిగిన కవులు కావలెను. మానవునకును మానవునకును, మానవునకును సృష్టికర్తకును గల సంబంధమును బాగుగా బోధింపగల

విద్యాలయముగా రంగస్థలమును మార్చునట్టి కవులు కావలెను. జీవిత మెటు లున్నదియును, ఎటుల నుండవలసినదియును రంగస్థలమునందు స్పష్టపరుపబడవలెను. పౌరాణికనాటకములను ప్రదర్శింపదగిన కాలము గడచినది. సుబ్రహ్మణ్యునకు పెండ్లి యైన నేమి కాకున్న నేమి? సత్యభామకు రుక్మిణిపై సవతిమాత్సర్య ముండిన నేమి లేకున్న నేమి? ప్రజల నిత్యజీవితమునకు సంబంధించిన విషయములను ప్రదర్శించు టవసరమును ప్రయోజనకరము నగును; గాని పురాణగాథలను ప్రదర్శించుట నిరుపయోగము. మన నిత్యజీవితమునకు సంబంధించిన సమస్యలు వేలకొలదిగా నున్నవి. మనము కని విని యెరుంగని విషయములను ప్రదర్శించుట మాని మన మనుదినమును కనుచు వినుచుండు విషయములనే ప్రదర్శించుచుండవలెను. మన ప్రాచీనజ్ఞానమును, జాతీయధీశక్తిని, విశ్వమానవజీవితమునకు సంబంధించిన సమస్యలను గ్రహించి పరిష్కరింపబూనిన కార్యనిరతిని నాటకములు వెల్లడింపగలిగి యుండవలెను. వ్యక్తిజీవనమునందు గల ప్రబలశక్తులను గూడ వెల్లడించుచుండవలెను. శ్రీరామచంద్రుడు తన భార్యను హరించిన రాక్షసుని హతమొనరించె నని మనము భావించుటకంటె అతడు తన దేశమునందలి ప్రజల మేలుగోరి పరిపాలనకు సంబంధించిన సమస్యలను పరిష్కరించిన రీతిని గూర్చి మనము భావించుటవలననే అధిక మగు ప్రయోజనము కలుగగలదు. మానవోత్తముల జీవితమే సామాన్యప్రజలకు మత మగుచున్న దని తెలుపబడెను. మనుజుడు కార్యసిద్ధిని, విజయమును, సమగ్రతను బడయుటకు చేయునట్టి ప్రయత్నములలో మొదట కలుగునట్టి సంఘర్షణములు పరాజయములు మున్నగువాటి నెదుర్కొనుట కతడు చూపిన పట్టుదలను పరికించుటయే మిక్కిలి ఆకర్షకముగా నుండగల దని నేను తలచుచున్నాను. మనుష్యునియందు గల దైవత్వమును ప్రకటించుటయే విద్యయొక్క ముఖ్యప్రయోజనము. కళల వలనను, ముఖ్యముగా నాటకప్రదర్శనముల వలనను అప్రయోజనము సిద్ధింపగలదు"

## విశ్వరూప సందర్శనము

రావుసాహేబు, మహోపాధ్యాయ, శ్రీ గిడుగు వేంకటరామమూర్తి పంతులు గారికి డబ్బయ్యో పుట్టిన రోజు మహోత్సవంలో వారి మిత్రులూ, అభిమానులూ, శిష్యులూ సమర్పించిన వివిధవిషయిక వ్యాససంగ్రహంలో "శ్రీరామమూర్తికి తోడి జోహారు" అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రకటిస్తూ శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు అందులో శ్రీ పంతులుగారి నిలా వర్ణించారు.

"పూలచెండు పడ్డునది శ్రీరామమూర్తి భాషాసేవ మీదనా, శ్రీరామమూర్తిమీదనా?" అని కాదా తొలి ప్రశ్న? ఒక విధమైన భాషాసేవయందే యీతడు ఒంటరియై యున్నట్లే తక్కిన గుణములందు గూడ నీత డించుమించుగ నొంటరియై యున్నాడు. సాహసము, ఇచ్ఛాశక్తి, దృఢనిశ్చయము, స్వాతంత్ర్యేచ్ఛ, నిరంతర పరిశ్రమ మున్నగు మహాపురుష లక్షణములు కలిసి శ్రీరామమూర్తి అయినవి. ఈత డేగురువు నొద్దను విద్య నభ్యసించలేదు. తనంత తాను చదివి తుదికొమ్మ నెక్కెను. తన భాషాసంస్కరణోద్యమము పెంపొందుటకై నిస్సహాయుడై ఆంధ్రమందును, ఆంగ్లమందును ఈతడు కొంతకాలము పత్రికలు నడిపెను. తొలుత నీతడు సింహనాద మొనరించినపుడు ఆంధ్ర పండితులు గదలు చేబూనిరి. మత సంస్కరణమునకు కందుకూరి పంతులు తొడరినపుడు తోచిన కన్నెఱ్ఱలును వెక్కిరింతలును మాతి విఱుపులును, చేతిదూపులును ఈతనిని గూడ మార్కొనినవి. మార్కొనినపుడు పర్లాకిమిడి రాముడు భార్గవరాము డాయెను. "హతోస్మి" యనుట గాని నీరు నమలుట గాని యీతని ప్రకృతికి విరుద్ధము. ఈమహారథుని మ్రోల పలువుర పండితప్రకాండులు జయద్రథు లైరి. రాము బాణము మ్రోల ఖరదూష

ణులు నిలువజాలరైరి. పిడివాదము లీతని వాద మునకు మార్కొని తుత్తునియలై నేల రాలినవి. శ్రీరామమూర్తి అయుక్షము విజ్ఞానము. ఈవిజ్ఞాన మున తళ్కొత్తునవి నిరపాయమైన వజ్రపు మెఱ పులు కావు; ప్రతికక్షిని పీడని వెసూవియస్ జ్వాలలు. సభాంగణమున నీతని యెదుటనిలిచిన పండి తుడు ఆంధ్రమండలమున లేడు. ఎదుటివా, డెంత దుండగీడయినను ఒక మాటలో చెంపపెట్టు పెట్టి నట్లును, వేరొకమారు ముక్కునకు సూటిగా గ్రుద్ది నట్లును, ఇంకొకతూరి చింతబరికె చేబూని మీది కురికినట్లును, మరొక్కప్పుడు కుత్తుక పట్టి చిత్తు చేసినట్లును ఈతడు వాదించును. ఈతని పండ్ల పట పటయందు వాడియైన తర్క మున్నది. ఈతని తీక్ష్ణదృక్కులందు మిరుమిట్లు గొలుపు సారస్వత మున్నది. ఈతని బల్లెంపుటుత్తులయందు కోసైన మీమాంస యున్నది. ఈతని పిడికిలియందు బల మైన ఆత్మవిశ్వాస మున్నది. సభాంగణములందీతని యంతరంగమండలి శక్తి ఈతని నీరెండ చేసివైచును. ఈతని బ్రహ్మచెముడు ఎదుటివాని చాలు. చెళ్ళపిళ్ళకవి నిశితవ్యంగ్య మీడాలు నంటి నిరపాయ ముగ నెన్నిమాఱులో సభలయందు నిలువగలిగినది. ఈతని చూచి అడలనివారు చెవియొద్ద నీతని "డ్రమ్" చూచి తోక ముడుచుకొని పరారి యగు దురు. సహవాసఫలమున నీతని చెవియంత్రము కూడ చేతనశక్తి నందెను "నిది తప్పు" అని కొమ్ములు తిరిగిన విద్వాంసులను నిలువంబెట్టి గూబకు బెత్తెడు చూచిన ట్లీతడు పలుమారులు వాకొనెను. "నీదే తప్పు" అని మగల తేరలో గాచు ఎదుట పలికి ఈతని ముందీవలలో నెవ్వ రును నిలువలేదు. ఈతని వాదనయొక్క పోటును, వాక్కుయొక్క ధాటీయును ఎన్నో శాల్యలను చింపి మూటగట్టి మూల నుంచెను. ఎన్నియో మండలములను అట్టిటు లాడించినవి. గంటలకొలది చదువుట యెట్లీతని కలవాటో గంటల కొలది ఉప న్యసించుట ఈతని కట్లే అభ్యాసము. ఈతని చదు వుల గదిలో ప్రవేశించి చూడుడు. ప్రపంచము యొక్క ఇన్‌సైక్లోపీడియాలు — ఎక్స్‌సైక్లోపీడి యాను మించిన ఎన్‌సైక్లోపీడియాలు అందుండును. ఈతడు ఉత్తరములను కూడ కంఠస్థ మొనరించును. కామా, ఫుల్‌స్టాపుల నైన ఈతడు వదల్పక ఉండడు. తాను వ్రాయు ముఖ్యలేఖలకు నకలు ఫైలు నుంచుకొనును. రాయసంవారి కీతడు ఒక ప్పుడు వ్రాసిన ఉత్తరముయొక్క కాపీ నేడును ఈతని ఫైల్సులో నున్నది. ఈతని యుత్తరపుటు త్తరలకు కూడ నూది మొన లుండును. ఈతని చదువు ఈతని యింటి కాసములను పెండెములను పట్టి యున్నది. ఈతని దొడ్డిలోని ఆవుకూడ ఫైలాలజీ సూత్రములతో అంబా అనును. శ్రీరామమూర్తి వంటి భీషుకర్ములు ఆంధ్రులందు మిక్కిలి తక్కు వగా నున్నారు."

## గురజాడ వాల్మీకి

రాజమంద్రీలో జరిగిన ఆధునికాంధ్ర కవి పండిత సభలో (౨౯-౧౨-33) గురజాడ అప్పారావు గారి కవిత్వాన్ని గురించి మాట్లాడుతూ ఉభయ భాషా ప్రవీణ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు ఇలా చెప్పారు.

తమస ఒడ్డున తాతపాదుని జేవురించిన ముఖం నుండి నిజమైన కవిత్వం ఉట్టిపడ్డది. Electric shock వంటి అనుభవాఘట్టనం ఏసహృదయుణ్ణి కొట్టి వివశుణ్ణి చేస్తుందో అతని హృదయాన్ని చీల్చుకొని కవిత్వం ఎగసిపడుతుంది. దానికి తగిన భాషా సహకారం దొరికితే అదే స్వాదయోగ్య మయిన కావ్యం అవుతుంది. ఆ కావ్యంలోని ప్రతీ మాటా పఠితను పట్టుకుని అంతరింద్రియాలలో మారుమ్రోగుతుంది.

కామమోహిత మయిన క్రౌంచద్వంద్వంలో కలిగిన విషమపరిణామం పాపం ఆతపస్విలో అపుడే లేని దురంత వేదనను రేపింది. ఆ ఆవేశంలో వివశుడై నిషాదుణ్ణి చావ మని శపించాడు. ఆ ఆవే

కమే సంస్కృత వాఙ్మయమునకు మేలుబంతి, మొదటి కాణాచి, మహాకావ్యబీజం అయింది.

ముక్కుపచ్చలారని బాలికల దుస్థితినీ, విరుచుకొని పడ్డ జీవనభారంతో పుడమి కంటా అంటుకొనిపోయిన అవాధలనూ చూచి వలవల వాపోయి మొరకు మానవుల మీద గుడ్లెఱ్ఱజేసినాడు అప్పారావు. ఆ ఎరుపు మంటలో నుంచే కన్యాశుల్కం ధామ్మని పేలింది. ఆధ్వనితో ఆంధ్రదేశం దద్దరిల్లింది. ఈ దెబ్బ దేశానికే కాకుండా ఇనపగొలుసులతో కట్టిన తెలుగు సారస్వతంమీద కూడా పడి లింకులను వదులు చేసింది. ఒక్కసారి అందరూ ఆదిక్కుకే చూశారు. అప్పారాయ కవీంద్రుని చేతులలో ముత్యాల సరాలు తళతళ మెరసినవి. ఇవే నవ్యాంధ్ర వాఙ్మయమునకు తలకట్టులు, మేలు బంతులు, విజ్ఞాన కోశములు.

ఈయనతో నవ్యసారస్వతయుగం ప్రారంభమయినది. భిన్నభిన్న ప్రవృత్తులతో పెరిగిపోయిన ప్రబంధవాఙ్మయమునకు నూతనాదర్శములతో తల ఎత్తిన ఆధునిక కావ్యములకు ఈయన కవిత్వము సీమాచిహ్నము. ఈయన కావ్య వ్యవసాయము చాల క్రొత్త. పెట్టినది కొంచెమయినా తెనుగు పొలాల బంగారపు పంట పండుచున్నది. ఈయన పోకడ చాలా స్వతంత్రమయినది. మొగమాటం లేకుండా అనవలసిన మాట ఘాటుగా అనేస్తాడు. ఈయన హృదయావర్తంలో "లోక మందలి మంచి చెడ్డలు లోకు లెరుగుదురా" అనే ప్రశ్న గిర్రున తిరిగి తిరిగి ఆవిష్టుణ్ణి చేసింది. ఈ Inspiration తోటే కావ్యమంతా ఉట్టిపడింది.

కావ్యమును సున్నితముగా ఎత్తుకొని అక్కడక్కడ అమృతం చిలికిస్తూ నడిపించడంలో అప్పారాయకవి అద్వితీయుడు. పద్యాల్లో చిన్నకథలను తీర్చి చిత్రించడానికి ఈయనే ప్రారంభమంగళదినం తెనుగు సారస్వతానికి. ఆతీర్పులో కావ్యానికి ఉండవలసిన జీవకళలు, మెరుగులు, పువ్వులకు మల్లె విరిసికొంటాయి.

ఇంద్ర ధనస్సువలె ఈమహాకవి సూక్తులు రకరకముల మెరుపులతో మనోజ్ఞముగా ఉంటవి, చూడండి!

"వ్రేలు మబ్బుల అంచు లంటను రగిలె రత్నరుచుల్" అనే మాటలోని వర్ణనానైపుణ్యమూ,

"తాటి వనమున అగి చంద్రుడు తాను చెవి రియొగ్గెన్" అను దానిలోని నూతనోక్తి చాతుర్యమూ,

"మంచి చెడ్డలు మనుజులందున ఎంచి చూడగ రెండె కులములు" అనే మాటలోని మహౌదార్యమూ,

"కత్తి చంపును, మాట వాతలు మాన వేనాడున్" అను దానిలోని తత్వానుభవ కథనమూ ఏ సామాన్యకవికి సాధ్య మవుతుంది?

రాజా రామమోహన రాయలు, వీరేశలింగ విజ్ఞుడు దిక్కులు పిక్కటిల్లే టట్లు కేకపెట్టి చెప్పిన మహాసందేశం గడుసు అప్పారాయకవి ఘాటుగా త్రిసూత్రిలో ముద్రించినాడు— "మనిషి చేసిన రాయి రప్పకి మహిమ కల దని సాగి మొక్కుతు మనుషు లుంటే రాయి రప్పల కన్న కనిష్టం"

అప్పారాయ కవీంద్రుడు రససిద్ధుడు. ఏపాత్రను సృష్టించినా అమరుణ్ణి చేసి వదులుతాడు. ఈయన కలము ఇంద్రజాలపింఛిక. కథను చూపుతుంది కాని చెప్పదు. ఈయన Patent హాస్యం ఎవ్వరికీ సాధ్య మయినది కాదు. ఈయనలో ఇంకో విశేషం. హాస్యం కోసమని ఎట్టి కృత్రిమ మయిన వ్రాతా వ్రాయడు. ఒక రచన ముఖ్యముగా సాగుతూ ఉంటే పక్కనుంచి హాస్యం పరిమళిస్తుంది. వేయేల? అసాధారణుడు, నవీనాంధ్ర సారస్వతమునకు శ్రీరాములు చుట్టిన ఆదికవి, అభినవయువకులకు స్వాతంత్ర్యపు టూర్పు పోసిన పరమేష్ఠి"

## మంత్రోపదేశము

రాజమహేంద్రవరంలో డిసెంబరు 28 తేదీని కూడిన రెండో అభినవాంధ్రకవి పండితసమ్మేళనానికి అధ్య

క్షత వహించిన ఆచార్య, రాయప్రోలు సుబ్బారావుకవిగారు నవకవులకు ఇలా ఉపదేశించారు.

'అభినవవాఙ్మయమునందు అపభ్రంశము నే యన్వేషించు పండితులను విడువుఁడు. మార్పున కులికిపడు మహనీయుల నుపేక్షింపుఁడు. మార్పు జగల్లక్షణముగానే తోఁచుచున్నది. గృహనిర్మాణము మాఱినది. వేషములు మాఱినవి. పాకములు, రుచులు మాఱినవి. బుద్ధులు మాఱినవి. శరీరపోషణ విధానములు మాఱినవి. జీవితాశయములు మాఱినవి. ఇఁక సాహిత్యము మాఱకుఁడునా? మాఱకుండఁ గలదా?

వాఙ్మయమునందుఁ దారతమ్యచర్చ తేలని ప్రశ్న. కాళిదాసమహాకవి వాఙ్మయము సర్వాంగ సుందరముగ నున్నది. దాని నతిక్రమించిన రచన యింతవఱకును రాలేదు. కాని మిగిలిన కవులు మానివేసిరా? అస్తమించిన సూర్యచంద్రులు తిరిగి ఉదయించుచునే యున్నారు. విడిచిన రాసులలోనికి నక్షత్రములు తిరిగి వచ్చుచునే యున్నవి. ఏఱేటి కాఱేడు తొలకరించుచునే యున్నది. ఎండిన తటాకములు మరల నిండుచునే యున్నవి. ఏళ్లలోని ప్రాతనీరు వెళ్లగా క్రొత్తనీరు తటాయించుచున్నది. క్రొత్తబియ్యములో తీపి యెక్కువ. జొన్నపాలలో జిడ్డు లెస్స. క్రొత్తావకాయలో రుచికాంతులు ప్రాతదానిలో లేవు. కావున క్రొత్తయే లేదనుట ఉత్తవితండవాదము.

తెనుఁగుతోటలో నిపు డొక క్రొత్తపూత పూచుచున్నది. దాని కింత యలజడి యేల? సజీవ వనస్పతులు ఋతువు రాగానే పల్లవింపక మానవు. అట్లే సజీవసాహిత్యములును.

ఇది యొక ప్రబలమైన ప్రఘూర్ణసమయము. దేశకాలపాత్ర పరిజ్ఞానము అపారముగా విస్తరించినది. అన్యదేశ జనసంపర్క మధికమైనది. భిన్న భాషా నాగరకములకు సంగమస్థానములు పెక్కులైనవి. అనేక విజ్ఞానవికాసములకు అన్యోన్యసాహచర్యము కుదిరినది. దేశాంతరవస్తుదర్శనమువకు వాణిజ్యము రహదారులు వేసినది. ఈ సంఘర్షణమందు పాదులు కదులును; రంగులు వన్నెమారును. ఈమార్పే భావకవనమందలి స్వరభేదమునకుఁ గారణము; రూపకల్పనకు లక్ష్యము; రచనకు రీతి.

అపురైన కవిసోదరుల కొక విజ్ఞప్తి. జీవితము క్లిష్టసమస్యలలో నుక్కిరి బిక్కిరి యగుచున్నది. శాస్త్రవిజ్ఞానము మానవసుఖలాలస కెంత యుపకరించెనో దుఃఖబీభత్సమునకును అంతకంటె నధికముగా సహకరించినది. జాతులు అర్ధదూషితములైనవి. ఆత్మవిలాసము పరత్రాసమునకు తావిచ్చినది. మతములు మాత్సర్యమునకు మార్గములు తీసినవి. ధర్మసూత్రములు ధనసంచయ రభసమునందు తెగిపోయినవి. బుద్ధికౌశల్యములను యంత్రము లాపోశనము పట్టినవి. ఈ మహాకల్లోలమందు, ఈ విభ్రాంతిలో చైతన్యదీప మాఱిపోకుండ నిలుపవలెను; కర్మయోగము కూలిపోకుండ కాపాడవలెను; విజ్ఞానవీణాతంత్రులు తెగనీయక రక్షింపవలెను. ప్రాణులను పాంచాలికలగా మాఱనీకుఁడు. ఈ మహోద్ధరణము ఆనందోపాసన వలననే సాధ్యము. మీరు ఆనందవక్తలు. సౌందర్యమన్నను, రసమన్నను, ఆనంద మన్నను మనకు ఏకావరణ జన్యములే. మీరు ఆనందగీతమునే పాడుఁడు. ఆనందసూత్రములనే అల్లుఁడు. ఆనందమూర్తినే చిత్రింపుఁడు. స్వచ్ఛందముగా పాడుఁడు. సుఖముగా నల్లుఁడు. సర్వతోముఖముగా చిత్రింపుఁడు"

## ఇప్పటికీ అనాఘ్రాతమే

పాటిబండ మాధవశర్మగారు ఈనెల భారతిలో "ప్రబంధయుగము" అనే శీర్షికతో ఒకవ్యాసం ప్రకటిస్తూ నవకవులకు ఉపాదేయమైన వస్తువు నిలా నిరూపిస్తున్నారు.

"శ్రీకృష్ణదేవరాయలు దేశదేశములను జయించినాఁడు. ఆంధ్రదేశమును సుభిక్షము గావించినాఁడు. రాజకీయముగను, సాంఘికముగను దేశమునం దట్టి

కల్లోలములు లేవు. ఓడిపోయిన రాజుల కూఁతుండ్రకు జయలక్ష్మివేషము వైచి క్రీడించిన రాయలు రసిక ప్రభువు. 'యథా రాజా తథా ప్రజా' అని రాజుతో పాటు సామంతులు, మంత్రులు, ప్రజలు అందఱును కేవలము విలాసప్రియులై యుండిరి. ఆనాటి విజయనగరములోని వారవనితా జనమే దీనికి ప్రబలసాక్ష్యము. ఇట్టి తరుణమున నుద్భవించిన రచనావిశేషము ప్రబంధము. పురాణ కవిత్వపు నీతులతో విసివిన ప్రజలు కవితాపద్ధతిలో మార్పునకై తహతహపడిరి. ఈతృష్ణకు ఫలితముగా పెద్దన్నగారి మనుచరిత్ర పుట్టినది.

ఇట్లు విలాసార్థము పుట్టిన రచనావిశేష మగుటయు, రాజులు, కవులు, ప్రజలు భోగపరాయణు లగుటయుఁ గారణములుగా ప్రబంధము శృంగార రసప్రధాన మైనది. పెద్దన్న ప్రబంధమునందు శృంగారము అంగి యగుటకు కేవలము కాలమహత్త్వమే కారణ మైనను రానురా నది యొక మూఢాచారమై ప్రబంధము లన్నియు శృంగారరస ప్రధానములే యగుట తటస్థించినది. ఈశృంగారము గూడ రానురాను సభ్యతను విడిచి మోటుదేరినది.

వేదర్షులు యోగసమాధిలో ఆనంద స్వరూపమగు బ్రహ్మమును దర్శించి కవిత్వము చెప్పిరి. అట్టి ఋషుల వాక్యములు ప్రేరేచి పురాణకవులు కవిత్వము చెప్పిరి; కాని ప్రబంధకవికి పద్యము రావలయు నన్నచో "నిరుప హతిస్థలంబు, రమణీ ప్రియదూతిక తెచ్చి యిచ్చు కప్పురవిడెము, ఆత్మ కింపయిన భోజనము, ఉయ్యాల మంచము" నుండ వలయును. ఇంత వ్యయమున కోర్చి రాయలవంటి రసిక ప్రభువు పోషించుటచేతనే పెద్దన్నవంటి కవి మనుచరిత్ర వంటి గ్రంథమును వ్రాసినాఁడు. రాయలు రసతృష్ణతో కవులను పోషించినాఁడు. కనుకనే నాఁటి కావ్యములును రసమహితములు గనే యున్నవి. తరువాత ఆస్థానములకు వారకాంతలు, కొజ్జాలు అలంకారము లైనట్లే కవులును అలంకారము లైనారు. వారి గ్రంథములును అట్టివయైనవి.

నేఁటి కవికి తన స్థితియే కావ్యరచనకు ప్రేరక మగుచున్నది. అనగా నీతని యభిరుచి, ఆవేశము ఆత్మాశ్రయములే; కాని పరప్రేరితములు కావు.

ప్రబంధములు కేవలము బుద్ధిప్రేరితములు— అనఁగా మెదడునుండి పుట్టినవి. మానవహృదయముతో వాని కంతగా సంబంధము లేదు. ఇవి పఠితకు బుద్ధిగ్రాహ్యములే. హృదయమును తాకు శక్తి ప్రబంధములకు లేదు. అనగాఁ ప్రబంధములోని పాత్రములతో పఠితకు సహానుభూతి కలుగుట లేదు. మఱియు నలంకారములలోఁ జాల భాగము ఊహాప్రేరితములు. అట్టి యలంకార ప్రధానము లగు ప్రబంధములు పఠితకు ఊహాగ్రాహ్యములే యగుచున్నవి. ఉత్ప్రేక్షాద్యలంకారములు, శ్లేషాదిపద బంధ చాతుర్యములు, యమకాది శబ్దాలంకారములు ప్రబంధమునకు ముఖ్యలక్షణములు. ఇవన్నియు కవిత్వమునకు బాహ్యరూపమే; కాని రానురాను ఇవి తప్ప కవిత్వమే లేదను స్థితి వచ్చినది.

పురాణములలోని వస్తుప్రధానత్వమును వదలించుకొనుటలో ప్రబంధములు కొంత యభివృద్ధి గాంచినట్లే తోఁచినను ప్రకృతిని వ్యాఖ్యానము చేయుటలోఁ గొంత కొఱవడిన పనియే చెప్పవలయును.

వేదములు భగవంతునకు మానవునకుఁ గల సంబంధమును నిర్ణయించినవి. పురాణములు మానవునకు మానవునకుఁ గల సంబంధమును బోధించినవి. ప్రబంధములు ప్రకృతిని వర్ణించినవి; గాని ప్రకృతికిని మానవునకును గల సంబంధమును నిర్ణయింపఁజాలక పోయినవి. ఈ యుత్కృష్ట విషయము అధునాతన కవిత్వమున కింకను మిగిలియే యున్నది"

# వ్యాఖ్యానములు

## అభినవాంధ్రకవిపండితసమ్మేళనం

"నేటి కుమారకవిసింహుల కర్తవ్యం యేమిటి ?"

ఇది వొక విలక్షణమైన ప్రశ్న. లోకసామాన్యం కాదు. ఇతర్లకి దీనితో పని లేదు. ఇతర్లకిది తోచనే తోచదు. సృష్టిస్థితి సంహారాలకి అధికారులైన కవులకే యిది అన్వయిస్తుంది. ఇది కవులకే తోస్తుంది. విశ్వమోహనగానం ఆలాపించే కవిచక్రవర్తుల హృదయవిపంచీలోల తంత్రుల్లోనే యీ మంజులనాదం ఉత్పత్తిల్లుతుంది. ఏమంటే ? కవే విశ్వానికి ఉపదేష్ట. మార్గదర్శి. మేలుకొలుపులు పాడే వంది. నవశక్తి సంఘటించే అమృతహస్తుడు.

కవికి ప్రబోధం చెయ్యతగ్గ ప్రాణి ప్రపంచంలో యింతవరకూ పుట్టలేదు.

అయితే: చాలా కాలం కిందటే తెనుగుకవి తన కర్తవ్యాన్ని మరిచిపోయాడు. తన తాహతు విస్మరించాడు. తన పదవి కోలుపోయాడు. తన శక్తిని, తన సత్తాని దుర్వినియోగపరుచుకున్నాడు. తన ప్రాప్యంనుంచి విచ్యుతుడైపోయాడు పర్వత శిఖరంమీదనుంచి అమాంతంగా లోయలో కూలిపోయాడు.

కారణం ? ప్రధానమైనది దేశీయుల దౌర్భాగ్యం. దేశీయుల అభిరుచులు అసభ్యమార్గాలు పట్టాయి. హైందవప్రభువులు కవిత్వాన్ని తమ తుచ్ఛసుఖాభిలాషకి ఉద్రేకం పుట్టించే మత్తుపదార్థంగా వుపయోగించుకున్నారు. కవి సువర్ణముగ్ధుడై తన శీలాన్ని అమ్ముకుని లోకాన్ని శాసించే తన ప్రభుశక్తిని బురదలో పూరతొక్కుకున్నాడు.

జాతి మరింత అడుగున పడిపోయింది. ఇంతే కాదు. ఈ స్థితి మనకి చిరకాలం అనుభూతమయిపోయింది.

ఈస్థితిలో మనకి ఆంగ్లసంపర్కం కలిగింది మంత్రించినట్టు జాతి కళ్లు తెరిచింది. సర్వతోముఖమైన ఆంగ్లసంపర్కంవల్ల కొన్ని కష్టాలూ, కొన్ని నష్టాలూ కలిగినా దేశానికి అపారమైన ప్రబోధం కలిగింది. మన స్థితీ, మన గతీ, మన మతీ బో పడ్డాయి.

కవికి కశాఘాతం తగిలింది.

"నాబతుకు ఇంతేనా ?" అని జాతికి ఆవేదన కలిగింది.

తన యింట్లో కూచుని ఆంగ్లవాఙ్మయం చదువుకునే ఆంధ్రుడు మారాడు. ఇది యిలా వుండగా ఆంగ్లేయపత్రికలు వచ్చి ప్రపంచాన్నంతా చక్కగా విప్పి చెప్పాయి. సినిమాలు వచ్చి పాశ్చాత్యుల ప్రవృత్తీ, పదవీ, స్థితీ, ఉత్సాహమూ, శౌర్యమూ ధైర్యమూ, సాహసమూ, ఆశలూ, అభిరుచులూ అనుభవాలూ, ఆంధ్రుడికి తన యింటోనే చూపించాయి. ఆపైని ఆంధ్రుడు ఖండాంతరయాత్ర చేసి ప్రపంచంయొక్క వర్తమానపరిస్థితులు అవగాహనం చేసుకున్నాడు.

దీనితో ఆ ఆవేదన మరింత పెరిగిపోయింది.

ఈ ఆవేదన తెనుగుకవికి ఉద్రేకం కలిగించింది.

అతను సంఘమూ, దేశమూ తన అమృతవాక్కు కోసం యెదురుచూస్తూ వుండడం గ్రహించాడు. రుద్ధమైపోయి వున్న అతని కంఠం ముక్తమయింది.

ఇంకేమీ ?

శ్రుతి కలిసింది. స్థాయి కుదిరింది. అయితే యేమిటి గానం చెయ్యడం ? జనసామాన్యం యొక్క భాషలో యిదే "నేటి కుమారకవిసింహుల కర్తవ్యం యేమిటి ?"

ఈ ఆశంకతోటే అభినవాంధ్రకవిపండితులు మొన్నటి డిసెంబరు 28వ తేదీని రాజమహేంద్ర

వరంలో రెండో సారి సమావేశం అయినారు. ఆచార్య, రాయప్రోలు సుబ్బారావుకవి కులపతియై అపూర్వఫణితిలో మంత్రోపదేశం చేశాడు.

ఏకఫలాపేక్షతో, ఏకదీక్షతో, ఏకవేదికమీద ఆసీనులై వున్న కవికుమారుల ముఖ బింబాలనుంచి వెల్లివిరిసిన దివ్యతేజస్సువల్ల ఆకాశమూ దిక్కులూ ధగధగితాలైపోయినాయి.

కాని—

కాని—

వచ్చిన పని—కూడిన కారణం— తేల్చుకోవలసిన ప్రశ్న అందరూ మరిచేపోయారు.

## అశ్రుబిందువులు

ఈనెల 16వ తేదీ రాత్రి చల్లా శేషగిరిరావుగారు పరమపదించారు. ఆంధ్రపత్రిక కిది వొక పెద్దదెబ్బ. ఆంధ్రసంపాదకలోకానికి తీరని లోటు. శేషగిరి రావుగారి కుటుంబానికి కడుపుకోత. మిత్రవర్గానికి పిడుగుపాటు.

ఆంధ్రపాఠకుల్లో శేషగిరిరావుగారి అకాలమృతికి వగవనివారు లేరు.

ఆంధ్రపత్రిక జాతి కంతకీ ఏకైకదినపత్రిక. అధిపతి నాగేశ్వరరావుగారు చేతి కెముక లేని త్యాగి. సంపాదకులు శేషగిరిరావుగారు పట్టుభద్రులు. కొన్నాళ్లు న్యాయవాది. ఉత్తమశ్రేణికి చెందిన దేశభక్తులు. దేశంయొక్క అవసరాలు కూడా అనంతాలు. సన్నివేశాలన్నీ చక్కగా కుదిరాయి. కాని అకాలమృత్యువు శేషగిరిరావుగారిని కబళించివేసింది.

పదహారు సంవత్సరాలు వొకరి చేతికింద ఏక టాకీని పనిచెయ్యడం అంటే మాటలు కాదు. అందులోనూ వందలమీద వున్న అనుచరులతోటీ, సహచరులతోటీ కలిసిమెలిసి, పొరపొచ్చాలు లేకుండా వుండడం నిజంగా అసాధ్యమైన విషయం. కాని శేషగిరిరావుగారు ఏ విషయంలోనూ వేలు పెట్టి చూపించుకోలేదు.

శేషగిరిరావుగారు ఆంధ్రపత్రికను నమ్మారు. ఆంధ్రపత్రికను పూజించారు. ఆంధ్రపత్రికలో లీనమైపోయారు. తద్వారా వారు పరమేశ్వరునిలో మిళితం అయిపోయారు.

అయినా కళ్లల్లోనుంచి అశ్రుబిందువులు రాలుతున్నాయి. మానవహృదయం మోక్షాన్ని చూసి తృప్తిపడలేదు. ఇలాంటి అఘాతాలు తగిలినప్పుడు అది కరగకుండా, ద్రవించకుండా వుండలేదు.

ఈ దుఃఖసమయంలో మేము శేషగిరిరావుగారి కుటుంబానికి మా సానుభూతిని విన్నవించుకొంటున్నాము.

## ఆంధ్రగ్రంథాలయ మహాసభ

పదహారో ఆంధ్రగ్రంథాలయసభ కాకినాడలో వేమవరపు రామదాసుపంతులుగారి యాజమాన్యంకింద జరిగింది. ఈ మాటు కార్యక్రమంలో కొంత మార్పు కనపడింది. పెద్దపెద్ద సంఘాలేర్పడ్డాయి. పని యెలా జరుగుతుంతో చూడవలసి వుంది.

యువకులు మళ్ళీ గ్రంథాలయోద్యమంలో ప్రవేశించడం సంతోషింపతగ్గ విషయం. ఈ అసహాయస్థితిలో మనం సంఘపరంగా చెయ్యవలసిన పని అపారంగా వుంది. జనసామాన్యంలో విద్యా, విజ్ఞానమూ వ్యాపించకుండా యెన్ని రెలాంటి అభూతకల్పనలు చేసినా ప్రయోజనం వుండదు. అమాయకులైన ఆంధ్రులు ఉద్రేకం కలిగిస్తే అగ్గిలో దేశా వురుకుతారు; కాని ఆ సాహసానికీ, ధైర్యానికీ పునాదిగా సదసద్విచారశక్తి వుంటే గాని త్యాగం అంతా బూడిదలో పోసిన పన్నీరయిపోతుంది.

పల్లెటూళ్ళలో నవీనవిజ్ఞానం వ్యాపింపచెయ్యాలంటే గ్రంథాలయాలకు గల అవకాశాలు మరే సంస్థలకూ లేవు. గ్రంథాలయనిర్వాహకులీ విషయం గమనించి, తమ ధర్మాలనుగూడా గుర్తించి మసులుకోవలసి వుంది.

కాని రామదాసుపంతులుగారి వుపన్యాసం కాసన సభలో వున్న గ్రంథాలయాలబిల్లు విమర్శించడం

తోనే సరిపోయింది. సమర్థులైన పంతులుగారు ఈ యొక్క విషయానికే యింత ప్రాముఖ్యం యివ్వడంలో ఔచిత్యం లేదు. ప్రజలు చూపవలసిన పురుషకారం అపరిమితంగా వుంది. గ్రంథాలయ నిర్వాహకులు నెరవేర్పవలసిన కార్యక్రమంకూడా సముద్రం అంత వుంది. ప్రభుత్వపక్షంగా గ్రంథాలయాలకు కలిగే పుష్టి చాలా తక్కువ. గ్రంథాలయనిర్వాహకులకు అలసత పోయి ఏకాగ్రతా, ఏకదీక్షా కలిగేటట్టు వారు ప్రోత్సాహపరుస్తా రని నిరీక్షించినవారికి ఆశాభంగ మైనది.

అయ్యంకి వేంకటరమణయ్యగారికి మా ప్రశంసలు విన్నవిస్తున్నాము. గ్రంథాలయోద్యమంలోనే వారికి జీవితసాఫల్యం వుంది. మధ్యమధ్య పక్కలకి తప్పుకున్నారా ?—ఎందుకూ పదేపదే చెప్పడం?

## కొత్త అధ్యాయం

రెండో వాగనుశాసను లైన రావుసాహేబు గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారికి సమగ్ర మైన ఆంధ్రజాతి తనతాహతుకు చాలని దైనా సన్మానం చెయ్యడంతో ఆంధ్రవాఙ్మయచరిత్రలో వొక కొత్త అధ్యాయం ప్రారంభ మయింది. తెనుగుభాషవిషయంలో తమ రక్తం అంతా ధారపోసిన ఆధునికాంధ్రులు కైలాసవాసి కందుకూరి వీరేశలింగం పంతులుగారూ, బ్రహ్మశ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారూ—ఈ ఇద్దరే కనపడుతున్నారు. అయితే వీరేశలింగంపంతులుగారిని మనం సత్కరించలేకపోయాం. ఇప్పుడు రామమూర్తిపంతులుగారి నైనా సత్కరించడం మనం మన విధులను గుర్తించుకుంటున్నా మనడానికి గొప్ప చిహ్నంగా వుంది.

రామమూర్తిపంతులుగారి పదవి యిప్పట్లో యెవరూ సాధించుకోలేనిది. భాషయొక్క పుట్టుపూర్వోత్తరా లన్నీ అంత క్షుణ్ణంగా తెలిసినవా రెవరూ లేరు; కాని వారు వృద్ధు లైనారు. మొన్ననే డబ్భయి వొకటో సంవత్సరం ఆరంభ మయింది. వారి వయస్సులో కూడా షష్టిగడియలూ భాషాసేవ చేస్తూ వుండడం నిజంగా మనం గర్వించ తగ్గవిషయం. మంచివయస్సులో వుండికూడా మనం వారు చూపుతూవున్న శ్రద్ధాసక్తుల్లో లక్షాంశ మైనా చూపలేకుండా వుండడం మనం సిగ్గుపడవలసిన విషయం కూడానూ.

ఏతావతా: రామమూర్తిపంతులుగారే చెయ్యవలసిన పనులు రెండు మూడు ఉన్నాయి. వారిచేత అవి చేయించుకోలేకపోయామా, తరవాత మనం దిక్కులు చూడవలసిందే. సమగ్ర మైన నిఘంటువూ, ఇప్పటిమట్టుకు సమగ్ర మైన వ్యాకరణమూ— ఈ రెండుపనులూ చెయ్యడానికి వారికి తప్ప మరెవ్వరికీ అర్హత లేదు.

నిజానికి మనం బీదవాళ్లమే; కాని మన డబ్బు ఖండాంతరాలతో బాటు ఇతరప్రాంతాలకు కూడా చాలా వెళ్లిపోతోంది. మన డబ్బు మన ప్రత్యేకోన్నతిసాధనాల కేమీ వినియోగపడడం లేదు. ఈ విషయంలో మనలాగ యితర్లెవరూ మన కేసి చూడరు. కనక వెంటనే శ్రద్ధపట్టి తగినంత ధనం కూడబెట్టి రామమూర్తిపంతులుగారి విజ్ఞానానికి మనం గ్రంథరూపం కలిగించుకోవడం చాలా అవసరం.

రామమూర్తి పంతులుగారికి మావినయవిధేయతలను విన్నవించు కొంటున్నాము. మాలేఖినికి స్వాతంత్ర్యమూ, నిరాఘాట ప్రచారమూ కలిగించి మహానుభావులు వారు. మరిన్నీ కృతకభాషలో పడి కూరుకుపోవలసిన మెరికెల్లాంటి ఆనేకాంధ్రయువకులకు ఆధునికాంధ్ర వాఙ్మయక్షేత్రంలో అనన్యసామాన్యా లైన పదవులను కలిగించినవారు వారు. వాస్తవంగా వారి ప్రతిభ వాఙ్మయనిర్మాతలను తయారు చెయ్యడంలోనే వినియోగపడింది.

రామమూర్తి పంతులుగారు నన్నయ్య తిక్కన సోమయాజులు గార్లతో సమాన మైన పండితులు. భాషకి అంత సేవా చేశారు. తమ జీవితాన్ని అంతగానూ సార్థకపరుచుకున్నారు. భాషని శాసించే యోగ్యత అప్పుడు ఆ ఆదికవుల కిద్దరికే వుంది.

ఇప్పుడు ఈ రామమూర్తి పంతులుగారి కొరకే వుంది.

శివశంకర శాస్త్రిగారు, రామమూర్తి పంతులు గారు యింకా పదకొండు సంవత్సరాలు నిరాఘాటంగా భాషాపరిపాలనం చేస్తారని చెప్పారు. మన ఆలసత యెదట పదకొండేళ్లు పదకొండు మాసాలను పోలవు. అయినా మాకు చాలా ధైర్యం కలగుతోంది. రామమూర్తి పంతులుగారి చల్లని చూపు ఇంకా చాలా రోజులు యువకవులకు నవశక్తి సంఘటిస్తూ వుంటుంది.

## భోగమా? ఇప్పుడా?

"కవిత్వం వల్ల కలిగే ప్రయోజనం యేమిటి?"

దీనికి జవాబు దేశమూ, జాతీ, భాషా వీటి స్థితిని పట్టి వుంటుంది. రసగంగాధరమో, సాహిత్య దర్పణమో, ప్రతాపరుద్రీయమో విప్పి "యిదిగో మన పెద్ద లిలా చెప్పా" రంటే ప్రయోజనం లేదు. ఆమహాగ్రంథాలు పుట్టినప్పు డున్న దేశస్థితి వేరు. ఇప్పటి స్థితి వేరు.

స్త్రీ సుకుమారు రాలే. సుఖమూ, ఆనందమూ కావాలంటే పురుషుడికి స్త్రీ సహకారం కావలసిందే? కాని ఆమె యెప్పుడూ ప్రియురాలై అంతఃపురంలోనే వుండిపోడానికి వీలు లేదు. ఆమె తల్లి అయి బిడ్డల జీవితాలు సంస్కరించాలి. క్షమావతి అయి గృహకృత్యాలు నిర్వహించాలి. తంత్రజ్ఞురా లయి సంసారంలో వచ్చిన వడిదుడుకులు దిద్దాలి. శక్తిస్వరూపిణియై భగ్నాశుడైన పురుషుడికి నవశక్తి కలిగించి మళ్లీ కార్యరంగంలోకి వురికించాలి. కాళికామూర్తి అయి ఖడ్గం చేతపట్టి యుద్ధరంగంలోకి దూకాలి. ఇంకా యిలాంటి మహాకార్యా లెన్నో నిర్వహించాలి.

ఇలాంటి విధులతో పాటు ఆమె విలాసవతిగా వుండవలసిన ఘట్టాలు కూడా చాలానే వున్నాయి.

కవిత్వం కూడా స్త్రీ వంటిదే.

ఆంధ్రకవిత్వచరిత్రలో కూడా ఇలాంటి భిన్న సన్నివేశా లున్నాయి. కడుపులో చల్ల కదలని స్థితిలో నన్నయ్య ధర్మనిర్వచనానికి పూనుకున్నాడు. అంతఃకలహాలు ప్రారంభ మైన స్థితిలో తిక్కన్న రాజ్యతంత్రాన్ని నిర్వహించాడు. మన శౌర్యం శాత్రవదావాగ్నిని చల్లార్చి విజయపరంపరలను చేకూర్చినప్పుడు శ్రీనాథుడు, పెద్దన్న, తిమ్మన్న, సూరన్న మొద లైనవారు లీలావిలాసాలు ప్రదర్శించారు.

అంతే.

మన కవిత్వం సద్వినియోగం అయిం దంత వరకే.

తరవాత మనవాళ్లు పతితు లైపోయారు. కవిత్వాన్ని దుర్వినియోగం చేసి జీవచ్ఛవాలు అయిపోయారు. రానురాను కవిత్వంయొక్క శక్తినీ, ప్రయోజనాన్నీ కూడా మరిచిపోయి తిట్లలోకి దింపేశారు.

మనం యిప్పుడు తెరపిమరపుల మధ్య వున్నాము. కళ్లు విప్పాము; కాని మైకం యింకా వదలలేదు.

కవిత్వం యీ మైకాన్ని వదలగొట్టగలదు. మళ్లీ మన రక్తాన్ని వుడుకెత్తించగలదు. మనకి మళ్లీ ప్రశంసింప తగ్గ సభ్యత చేకూర్చగలదు. ఆంధ్రుడంటే భారతదేశంలో—పూర్వ పశ్చిమగోళాల్లో ఉన్నతాసనాన్ని సిద్ధంచేసి వుంచగలదు.

అంటే?

భారం అంతా యిప్పుడు ఆంధ్రకవిది. ఆంధ్రకవికి ఇనప్పెట్టెలు తెరుచుకుని చూచోవలసిన కాలం కా దిది. చందనచర్చకోసం ఎదురొమ్ము విరుచుకోవలసిన రోజులు కావివి. పుష్పహారాల కోసం మెడ వంచవలసిన దినాలు కావివి. శాలువుల కోసం బుజాలు ఎగరవెయ్యవలసిన సమయం కా దిది విలాసినీ విభ్రమాలు తలుచుకుని కులుకుతూ చూచోవలసిన సందర్భం కా దిది. ఇసకతిప్పలమీద కూచుని కోకిలగానాలు వినిపించవలసిన వేళ కా దిది.

ఆంధ్రకవి యిప్పుడు తన రక్తమాంసాలు వోడ్చి ఘంటాపథాన్ని నిర్మించాలి.

స్వస్వరూపజ్ఞానం కలిగించి. గమ్యస్థానం నిర్దేశించి, ప్రాప్యాన్ని బోధించి జాతి సంతతిని ఆఘంటాపథం మీద నడిపించాలి.

ఏం చేస్తే, ఎలా చేస్తే, ఎంత చేస్తే ఈ ఉత్కృష్ట ఫలం లభిస్తుందో అది, అలాగ, అంతవరకూ చెయ్యాలి.

ఈజ్ఞానం కలగనంతసేపూ—ఈ పని చెయ్యనంత వరకూ ఆంధ్రకవికి ప్రశంస దాకా యెందుకూ? గతి కూడా లేదు.

## ఆంధ్రుని స్వదేశీ

స్వదేశీ అంటే ఆంధ్రుడు ఎగిరి గంతు వేస్తాడు. పాటలు పాడతాడు. ఉపన్యాసాలు చేస్తాడు. పత్రికలు ప్రకటిస్తాడు. ప్రదర్శనాలు ఏర్పాటు చేస్తాడు. కొంటాడు. వాడు కుంటాడు.

అంతే.

అంతటితో ఆంధ్రుడు తనకి తానే ధన్యవాదాలు చెప్పుకుంటాడు. మురిసిపోతాడు.

కాని దేశీయపరిశ్రమలు వొక్క ఆంధ్రదేశంలోనే అడుగంటిపో లేదు. విదేశాలనుంచి వచ్చే దిగుమతులవల్ల వొక్క ఆంధ్రదేశం మట్టుకే నష్టపడడం లేదు. ఈ విషయంలో హిందూదేశం అంతా వొక్క విధంగానే అటమటించిపోతోంది. అన్ని ప్రాంతాలవారూ వొక్క మోస్తరుగానే యిబ్బంది పడుతున్నారు.

అయితే యితర ప్రాంతాలవారు పరిశ్రమలు సొంతంగా సాగించుకొంటున్నారు. వాట్లని ప్రోత్సహించుకొంటున్నారు. ఆంధ్రుడలా కాదు. తాను పరిశ్రమలు సాగించడం లేదు. కాని ఇతర ప్రాంతాలవారి వస్తువులతో తన యిల్లూ వాకిలీ నింపేసుకుంటున్నాడు.

ఇప్పటిదాకా ఆంధ్రుడి ప్రవృత్తి యిలాగే వుండిపోయింది.

కాని యిప్పుడిప్పుడు ఆంధ్రుడు కళ్లు తెరుస్తున్నాడు. చిన్న చిన్న పరిశ్రమలు ప్రారంభించాడు. తప్ప టడుగులు వేస్తున్నాడు.

ఈచిన్న పరిశ్రమల్లో రాజమహేంద్రవరంలోని అజంతాకంపెనీవారు ప్రారంభించిన కొమ్ము దువ్వెనల పరిశ్రమ ఆశాజనకంగా వుంది.

అజంతా కంపెనీవారు తయారు చేయిస్తూవున్న దువ్వెనలకు వాడే కొమ్ము ఆంధ్రదేశంలో దొరికిందే. పనివాళ్లు ఆంధ్రులే. పెట్టుబడి ఆంధ్రులదే. లాభం అంటూ వస్తే అది కూడా ఆంధ్రులే అనుభవిస్తారు.

ఈవిధంగా అజంతాకంపెనీవారి కొమ్ము దువ్వెనలు సర్వవిధాలా అచ్చతెనుగువి. ఆంధ్రులకు ఇంతకంటే నికరమైన తెనుగు సరుకు ప్రస్తుతం మరి వొకటి లేదు.

తల దువ్వుకొనే దువ్వెనలు ఖండాంతరాలనుంచే కాదు, ఇతర ప్రాంతాలనుంచి తెప్పించుకోడం కూడా మనకి సిగ్గుచేటు. ఇలాంటి చిన్న విషయాలు కూడా మనం మరిచిపోతే వాస్తవంగా మనకంటే ఆత్మగౌరవహీనులు మరివొక రుండరు.

అజంతాకంపెనీవారి కొమ్ముదువ్వెనలు తెనుగు సరుకు కావడంచేత మాత్రమే మేము ప్రశంసించడం లేదు. మన్నిక, చౌక, పనితనము, చక్కదనము అపైని తెనుగు తనము, ఇన్ని కలిసిన వస్తువులవి. వాస్తవంగా ఆంధ్రుడి పనివానితనానికి అవి బలమైన సాక్ష్యం చెబుతున్నాయి.

మా తెనుగుసోదరులు, మనవారు ఇంకా ఇలాంటివి చిన్నవీ పెద్దవీ కూడా పరిశ్రమలు వెంటనే ప్రారంభించేటట్టు ప్రోత్సాహం చూపకోరుతున్నాము.

౨౦

“వెనుక నాలు గేడుల పాటు (నాలుగు సంపుటములు) ప్రకటితమయి ౧౯౨౯వ సంవత్సరమున ఆగిపోయిన ‘ప్రబుద్ధాంధ్ర’ (అయిదవ సంపుటము తొలి సంచిక) కడచిన జనవరి నెలలో మరల వెలువడినది. ఈపత్రిక కప్పుడును ఇప్పుడును సంపాదకులు శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు జగ మెరిగిన బ్రాహ్మణులు; ‘సాతంత్ర్యాన్ని అమ్ముకొనని’, ‘అంతరాత్మను చంపుకొనని’, ‘స్వధర్మాన్ని విడిచిపెట్టని’, ‘సాధనమునుండి విముక్తుడు కాని’, ‘ప్రాప్యమునుండి తప్పిపోవని’ సంపాదకుడు కాదగిన లక్షణములు కలవారు. వివేకము, ప్రతిభ, ధైర్యము వీరి కుగ్గుపెట్టినవి. పలుకుబడి బాగును, కూరుపు నేరుపును, కల అందమును, అర్ధము సామర్థ్యమును చవిగొనినది వీరి లేఖిని. ఇట్టి సంపాదకుని సంపాదకత్వమున “ఆంధ్రవికాసమే ప్రాప్యం”గా గల ప్రబుద్ధాంధ్ర తన “కార్యక్షేత్ర” మగు “నాంధ్రదేశమున” కెంత యైన మేలు నొనరింపవచ్చు నని తలచుట పొరపాటు కాదు”

“ఈసారి యీపత్రికలో” వీరు “పద్యాలు ప్రకటించ తలుచుకోలేదు” “ఇపుడు” “జనసామాన్యంలో” “విద్య” “విజ్ఞానం” “వ్యాపించు”టకు “చాలా అవసరం”గా ఉన్న “వచన వాఙ్మయం” ప్రకటింపబూనినారు. ఇది చాల మంచి పని”

“అక్షరాస్య మగు నభివాంధ్రలోకమున ననేకులు పద్యముల నల్లుచున్నారు. వానిలో భావములు, పోకడలు సంస్కృతము, ఇంగ్లీషు, బెంగాలీ, హిందీ వాఙ్మయములను తిరిప మెత్తి దొంగిలి తెచ్చుకొనినవి. పదములు సంస్కృతసముద్రపు టంచుల నేరికొనిన గుల్లలు. (ఈ విషయమున యిప్పటివారిలో పెక్కురకంటె వెనుకటివారే మే లనిపించుచున్నారు) వానిలో తెనుగుదనము సున్న. కొన్నిటికి రూపములు మొదలు కొన లేరుపడని మొండెములు. అందు కవిత్వము కానరాదు; ‘కల’ కల్ల, నేడు పుట్టకొక్కుల వలె పుట్టుచున్న పద్యములలో నూట తొంబది తొమ్మిదిటి గతి యిట్టు లున్నది. ఆంధ్రకవితాలత కవి వేరు పురుగులు. వానిని ప్రకటింపకుండుటయే వాఙ్మయమునకు మహోపకారము”

“గణయతిప్రాసముల దగులబడిన చెత్తపదముల ప్రోవులే ‘కల’ యనియు, వానిని ప్రకటింపక పోవుటచే నది రూపుమాసి పోవు ననియు దురపిల్లువారు కలయొక్క స్వరూపమునే యెరుగనివారు. మానవుని సుఖమయజీవితమున కుపయోగించు విజ్ఞాన మంతయు కలామయమే. సంస్కారానుగుణముగ దాని స్వరూపమును తత్వమును ధీమంతులు తెలియగలుగుదురు”

“ఈ సంచికకు వ్యాసములు వ్రాసిన వారిలో అనేకులు తెనుగు సారస్వత ప్రపంచమున పేరు మోసిన పెద్దలు. వ్యాసములలో ‘శ్రీరంగరాజు చరిత్ర’ అనునది వీరేశలింగముపంతులుగారి గుట్టును బయటపెట్టునది. శకపురుషుడుగ నారాధింపబడుచున్న పంతులుగారే గ్రంథాపహారదోషమునకు పాలయిరి! ఆంధ్రజాతిని వెన్నంటిన గుణ మది!!! మొట్టమొదటి నవల వీరేశలింగముగారిదే యని నమ్మియున్న యాంధ్రలోకమునకు తత్పూర్వమే ముద్రిత మయిన ‘శ్రీరంగరాజు చరిత’ మను నీనవల చరిత్ర మొక నూతన విషయము. ‘ఉత్తరరామ చరితము’ పెక్కిరింపు విమర్శనము. దీని విషయము మూలానువాదముల తారతమ్యము కాదు; అనువాద గ్రంథము భాష. అనువాదకులు గ్రాంథికాంధ్రమునకు పట్టుగంబము; విమర్శకులు గొడ్డలిపెట్టు. ఇద్దరు పెద్దరికము పేరిమికి మరియు వారే. ఇక విమర్శ సొగసు ఊహాతీతము కాదు. అనువాదకుల గ్రాంథికాంధ్రము సౌస్థవము జారిన దని పెక్కిరించిన విమర్శకుల వ్యవహారాంధ్రము సయితము ఒక తీరు, ఒక తెన్ను లేక తన సౌష్ఠవమును జార్చుకొన్నది. ఇది ‘సశేషము’ వ్యాసము. ఇంత చిన్న

పత్రికలో ఇట్టి వ్యాసములను, ఆపయి 'సశేషము' లను ప్రకటించుట ఉచితము కాదు. 'ఈ మాట నిజం' అను వ్యాసము భావగర్భముగా నున్నది. ఇది బుద్ధికి పనిని గల్పించును. ఇందు నేటి పద్యముల ననేక సహస్రముల కలికమున కయిన దొరకని 'కల' ఎక్కువ కలను, తెలిసికోగలవా రుండినచో. "జాగ్రత్తపడవలసిన ఘట్టాలు" 'ఇవి మూడు' ఇట్టి 'ఘట్టాలు' ఆంధ్రుల నిత్యజీవితమున ననేకములు. ఎన్ని సంచికల కయిన తిండి పెట్టగలవి. ఇదియు కలకు నెలవు. మరియు నీ పత్రికకు తక్కిన విషయముల గూడ మంచి పత్రిక కుండవలసిన లక్షణము లమరియున్నవి. సంపాదకుల వ్యాఖ్యానములు సూటిగ, సమదృష్టితో నడిచినవి. పత్రికా 'ప్రకటనోద్దేశాలు' సంపాదకులు చక్కగా వివరించినారు. ఈయెత్తుననే క్రమముగ సాగుచు నీ "ప్రబుద్ధాంధ్ర" నిక్కముగ ప్రబుద్ధాంధ్ర కావలెను"

"ఈకరవుకాలమున పత్రికను ప్రారంభించుట ఎంతవారి కయినను సాహసకార్యము. సాలు చందా ఒక రూపాయియే యగుటను జనసామాన్యమునకు దీని యందుబాటు సుకరము. కావున ఎల్లరును దీనిని పోషించుచు లాభమును పొందదగుదురు"

భారతి (ఫిబ్రవరి ౧౯౩౪)

౨౧

"ప్రబుద్ధాంధ్ర ఆంధ్రమాసపత్రికలలో మంచి పేరుగల పత్రికయై యుండెను; కాని సంపాదకుల అనారోగ్యమువల్ల గత ఎనిమిదేండ్లనుండి ఆగిపోయి యుండెను. ఇప్పుడు తిరిగి ప్రారంభ మైన దని, తెలిసికొనుటకు మిగుల సంతోషించుచున్నాము. ఇప్పుడు ఐదవసంపుటము యొక్క మొదటి సంచిక (1934 జనవరి) మా కార్యాయము నలంకరించినది. ప్రబుద్ధాంధ్ర నిరంతరాయగాము కొనసాగుగాక. ఈ పత్రికయందు భాషాచారిత్రిక విషయములు, అధునిక సాంప్రదాయముల ననుసరించి వ్రాయబడు చిన్ని కథలు, వివిధవిషయములగూర్చిన వ్యాఖ్యాన సంపుటి పొంద లగునవి కూర్పబడినవి. పత్రికయందలి రచనలు చిత్తాకర్షణముగా నున్నవనుటకు సందేహము లేదు. ఆంధ్రోద్యమమును గూర్చియు, ఆంధ్రగ్రంథాలయోద్యమమును గూర్చియు సంపాదకుల రచనలు ఉత్సాహజనకములుగా నున్నవి. ఈపత్రికయందు పద్యముల ప్రకటనమును, వివాదాస్పదము లగు రాజకీయ సమస్యలను నిషేధించుట యెంతయు సమంజసముగా నున్నది. సమస్తాంధ్రుల యభివృద్ధిని గోరు ప్రబుద్ధాంధ్ర ఈ నిజాము రాజ్యములోని 70 లక్షల ఆంధ్రుల యభివృద్ధిని గూడ గమనించుగాక యని కోరుచున్నాము"

గోల్కొండ పత్రిక (29–1–1934)

౨౨

"ఎనిమిది యేండ్ల యెడాటమునకు పిదప ప్రబుద్ధాంధ్రపత్రిక యీ నాటి కైనను మరల వెలుగు పొంగము చూడగలిగినందులకు మిక్కిలి సంతసించుచున్నాము. జగ మెరిగిన బ్రాహ్మణు లగు శాస్త్రిగారి సంపాదకీయగరిమ నిచట పేర్కొన నవసరముండదు. ఈనూతనప్రారంభమునందు సంపాదకులు పద్యవాఙ్మయమును శాశ్వతముగా త్రోసిరాజు జేసి గద్యవాఙ్మయమునకే ప్రాధాన్య మొసగ ప్రతినపట్టిరి. అపరిపుష్ట మగు ఆవాఙ్మయభాగమును సర్వాంగసుందరము గావింప బూనుకొనుట యుక్తముగానే యున్నది కాని వీరు రాజకీయములు గద్యరూపమున గూడ ప్రకటింప నొల్ల మని స్పష్టపరిచిరి. భారతదేశము, తద్భాగ మగు నాంధ్రదేశమును నేడు రాజకీయాగ్నిపరీక్షలో మిడుకుచుండ వాని సంబంధము ఎంత వల దన్నను సమకాలికభావనలలో, వాఙ్మయములో నుండక తప్పదు. ప్రాచీనవాఙ్మయము నం దన్ని దేశములలోను నిట్టి సంఘటనము కలిగియే తీరినది. వ్యాఖ్యానములలో బ్రకటనోద్దేశము, ఆంధ్రోద్యమము అను వానిలో గల కొన్ని ప్రక్కదెబ్బలు రాజకీయవాసనల గుమాయించుచునే యున్నవి. నేటి క్లిష్టపరిస్థితులలో నివి రాజకీయములు, నివి రాజకీయేతరము లని నిర్ణయింపదగి

లేవు. సంపాదకులు తలచినట్లు ఆంధ్రుడు సర్వథా ఆంధ్రుడు కావలయు నన్న నాతడు రాజకీయముల గూడ నారితేరవలయును. అవి ప్రత్యక్షరాజకీయములతో నీపత్రిక నొక వార్తాపత్రిక జేయుట మా మతమును కాదు. ఆంధ్రజాతిని సర్వతోముఖ మైన నూతనచైతన్యముతో నుజ్వలితము చేయదలచినచో ప్రాచీనుల రక్తతేజస్సులతో నాంధ్రుడు పూరించి భరతవర్షమునకు ప్రవర్తకుడు కావలసియున్నచో నేటి వాఙ్మయమ్మున ఛాయారూపమున నైన రాజకీయములు వాసించి తీరు ననియే మా యూహ. శాస్త్రిగా రెంతవరకీ పరీక్షకు—"

"మా కారోగ్యాలయము నలంకరించిన అయిదవ సంపుటము తొలి సంచిక చాల మనోహరముగ నున్నది. ప్రాతజనాభా లెఖ్ఖలు, పద్యవాఙ్మయనిషేధము లను వ్యాసములు ప్రోత్సాహకరములుగా నున్నవి. సంపాదకుల జాగ్రత్తపడవలసిన ఘట్టాలు ముద్దు లొలుకుచున్నవి. చిలుకూరివారి ఉత్తరరామచరిత్ర విమర్శనము వాఙ్మయజిజ్ఞాసువులకు మిక్కిలి యుపకారి. చింతా దీక్షితులు, కొడవటిగంటి కుటుంబరావుగార్లు మొద లగు కథకుల వ్యాసములు ప్రబుద్ధాంధ్రకు పెట్టని నగలు. చిరకాలమునకు నేడు ముద్దు నడలతో నరుదెంచిన చిరంజీవి ప్రబుద్ధాంధ్రకు నీ నూతనరూపమున నఖండవిజయము గల్గుగాత మని ఆచార్య సర్. రాధాకృష్ణుని యమోఘ వాక్యములతోనే యాశీర్వదించుచున్నాము"

ప్రజామిత్ర (౧౪—౨—౧౯౩౪)

౨౩

"ఆంధ్రులకు పరిచితమై కొంత కాలము క్రిందట నిలిచిపోయిన యీ "ప్రబుద్ధాంధ్ర" పునఃప్రచార మారంభింపగలిగినందుకు సంతసించుచున్నాము. సంతతభాషాసేవారతు డగు సంపాదకుని పట్టుదలయే ఇప్పటి కాల పరిస్థితులలో సయితము దీనిని ఆంధ్రమహాజనసమర్పణమునకు తయారు చేసినది. అయినను ఈ సారి కూడ ప్రబుద్ధాంధ్ర దేశమున పరిపూర్ణాదరణమును బడయగల దనుటకు ఈ "ప్రథమసంచిక" లోని పునఃపూజ" యందు తెలుపబడిన సహాయ వాగ్దానములే సూచన అగుచున్నవి. ఇక ముందు పద్యవాఙ్మయము ప్రకటింపబడ దను నియమ మొకటి పత్రికయొక్క క్రొత్తవిశేషము. అందలి వ్యాసరాజములలో సంపాదకుని "జాగ్రత్తపడవలసిన ఘట్టాలు" శ్రీ చింతా దీక్షితులుగారి "ఈమాట నిజం" ప్రత్యేకప్రశంసకు పాత్రములు. కొడవటి గంటి కుటుంబరావుగారి "సుస్వాగతం" చక్కని చిన్నకథ. ఇవి గాక "శ్రీ రంగరాజాచరిత్ర" "ఉత్తరరామచరితము" లను సారస్వతవిమర్శనాదికము లగు రచనలు గలవు. సంపాదకవ్యాఖ్యానముల యొక్క ఖండితోద్బోధనములకు ప్రబుద్ధాంధ్ర ప్రథమమునుండియు పేరందియే యున్నది. ఆంధ్రమహాజను లెల్లరు ప్రబుద్ధాంధ్ర నాదరింతు రని విశ్వసించుచున్నాము.

సమదర్శిని (౭ ఫిబ్రవరి ౧౯౩౪)

౨౪

"తమరు దయతోఁ బంపిన ప్రబుద్ధాంధ్ర పత్రికలు చదివితిని. తమరు పూర్వము ప్రబుద్ధాంధ్ర ప్రకటించినపుడు సంస్కృతమునను, ఆంధ్రమునను గూడ రచించిన వ్యాసరాజముల భాషాశైలియు, రచనా చమత్కృతియు బండితులకు మనోహరములయి యాంధ్రలోకమునకుఁ గొంత ప్రయోజనము కలిగించిన వని యొప్పుకొనక తప్పదు. ప్రకృతము తమరు ప్రకటించు పత్రిక పండితపామరసామాన్యముగా ప్రబోధము కలిగించు సార్వజనోపయోగకరము గాఁగలదు"

"పత్రికలలోని వ్యాసములు భావప్రధానములు, రసప్రధానములును గావలయును. అందలి భాష సుబోధ మైనపుడే యందలి భావము హృదయమునకు దట్టును; గాని దురవగాహము, కృత్రిమము నైన యపుడు మనమున భావ మంటదు. రసానుభవమున కవకాశమే గలుగదు"

"తమ రా తత్త్వము గ్రహించి యాంధ్రజనమున అక్షరజ్ఞానము కలవారి కెల్ల సుబోధ మగునట్లు

వాడుకభాషలో వ్యాసములు రచించి ప్రకటించుట ఆంధ్రజనసామాన్యమునకు ప్రబోధము గలిగించి మహోపకారము చేయుట. అది యెంతయు ప్రశంసనీయము. వాడుకభాషలో వ్యాసములు రచించుట అందఱు ననుకొనుచున్నంత సులభము గాదు. ప్రత్యయములు మాత్రము వాడుకలో నున్న రీతిని జేర్చి గ్రాంధికభాషను మించునట్లు కొందరు వ్యాసములు రచించుట గలదు. అట్లు గాక వాడుకలో నున్న రీతిని గ్రహించి పదౌచిత్యము, భావౌచిత్యము పాటించి రచించిన మీ వ్యాసములు భాషకు సరి యగు నలంకారములు అని చెప్పుటకు సందేహ మేమియు లేదు.”

“ఆర్థికవిషయమున నిబ్బంది గల యీ కాలమున ధనవంతుల సహాయము లేకున్నను లోకారాధనమే ప్రధానలక్ష్యముగా జేసికొని పత్రికను నడుపబూనిన తమకుఁ దగిన తోడ్పాటు చూపవలయు నని ప్రబుద్ధాంధ్రయే ప్రబోధింపగలదు. ప్రజలకుఁ బ్రబోధము గలిగిన సాధ్యము గాని దేమి యుండును?”

“ప్రబోధప్రధాను లగు తమకు భగవంతుడు సర్వవిధములను కార్యసిద్ధిని గావించు గాక”

“మీ పత్రికలో పద్యములు ప్రకటింపకుండుట యొక విశేషము. రసవంత మగు వాక్యమే కావ్యము గాని యితరము గాదు. అది పద్య మైన నేమి గద్య మైన నేమి? సార్వజనీనోపయోగము లక్ష్యముగా గైకొనిన పత్రికకు సర్వజనసుబోధక మగు వచన మందే లక్ష్య ముండుట కార్యసాధకునకు లక్షణము”

“ప్రకృతకాలమున యుపయుక్తముగ సాంఘిక విషయములు ప్రధానముగా జేర్చుట యెంతయో యుపయోగకరము”

“వాడుకభాషయందే గాక గ్రాంథికభాషయందు రచించిన వ్యాసములు గూడ ప్రకటించుట తమ సర్వసమదృష్టిని ప్రకటించుటయే గాక ఆంధ్రలోకమునకుఁ బ్రబోధము గలిగించుటయే ప్రధానలక్ష్యమని చాటుచున్నది”

శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి

౨౫

“ప్రబుద్ధాంధ్ర—రాజమహేంద్రవరము కలాభివర్ధనిపరిషత్తువారిచే ప్రకటింపబడు చక్కని తెలుగు మాసపత్రిక. మనోహరాంధ్రసాంఘికకథారచనానిపుణుడును, మధురశయ్యావిలాసియు నగు శ్రీయుత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు దీని సంపాదకులు. వీరు కాని, వీరి పత్రిక కాని ఆంధ్రులకు నూతనపరిచితములు కావు. కొన్ని సంవత్సరముల క్రిందట నాలుగు సంపుటములను ప్రకటించి ఆంధ్రులకు క్రొత్తక్రొత్త సాహిత్యపాకములను చవి జూపించినారు శ్రీ శాస్త్రిగారు. బహుజనసమ్మత మైన “నిరుష్ట” వ్యావహారిక శైలికి శ్రీ శాస్త్రిగారి రచనలు వరవడు లని చెప్పగోరుచున్నాము. నేడు పునఃప్రారంభ మగుచున్న వీరి యత్నమున కికమీద నెట్టి యంతరాయమును కలుగకుండవలె నని మాగృహలక్ష్మి యాశీర్వదించుచున్నది. మా కార్యాలయమునకు వచ్చిన జనవరి ఫిబ్రవరి మాసపత్రికలోని కథలును, వ్యాసములును ఒకటి కొకటి యీడుతీయకున్నవి. సంపాదకీయములు ఆంధ్రులకు ప్రబోధదాయకంబులై పత్రిక నన్వర్థనామధేయగా నొనర్చుచున్నవి. కాంగ్రెస్సుపైని కాని అఖిలభారత జాతీయతపైని కాని, హిందీపైని కాని కారము నూరకుండనే యాంధ్ర ప్రబోధమును సాగించుటకు కూడ మిగుల వీలు గలదు. ఇట్టి ప్రశస్తపత్రికకు సంవత్సరమున కొక్క రూపాయి కారుచౌక యగు చందా. ఆంధ్రులు వేనవేలుగా చందాదారులుగా చేరి దీనిని నిలువబెట్టుదు రని నమ్ముచున్నాము”

గృహలక్ష్మి (మార్చి ౧౯౩౪)

౨౬

“ఇది మాసపత్రిక. రాజమండ్రీనుండి వెలువడుచున్నది. బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

గారు సంపాదకులు. నూతన విషయములు జనసామాన్యమునకు తెలియు లాగున వ్యవహారిక భాషలో పేరుపొందిన పెక్కుపండితులు ఈ పత్రికలో వ్రాయుచున్నారు. ఇది ఆంధ్రజాతీయ పునరుజ్జీవనమునకు తప్పక తోడ్పడగల దని మేము దృఢముగ నమ్ముచున్నారము. ఆంధ్రవికాసము ముఖ్యాదర్శముగ నిడుకొని ఆంధ్రుని ఆదర్శపురుషునిగ జేయ సమకట్టుకొనిన ఈ పత్రిక కడుంగడు శ్లాఘనీయము. సంపాదకు లగు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిలుగారిని ఎరుగని వారు మన ఆంధ్రదేశములో లేరు. ఇదివరకే ప్రబుద్ధాంధ్ర మన దేశములో విశేషసేవ చేసియున్నది. శ్రీ శాస్త్రిగారు అనారోగ్యస్థితిలో నుండిన కారణముచేత కొంతకాలము ప్రబుద్ధాంధ్ర ప్రకటింపబడలేదు. భగవంతుని దయచేత ప్రబుద్ధాంధ్రయొక్క దర్శనభాగ్యము తిరిగి మనకు గలిగినది. వీరి పునఃపూజ ఆచిరకాలములో ఫలించుగాక." తెలుగు ప్రేమ ప్రచారక్ (ఫిబ్రవరి 1934)

౨౬

"ఆర్యా? తమ పత్రికయొక్క జనవరి సంచికను చదివితిని. అందువలన నాకు విశేషానందము కలిగినది. అందలి కథలును, విమర్శనములును, వ్యాసములును—నవి యివి యన నేల? తుదకు నితరపత్రికలనుండి యుద్ఘాటించిన వ్యాసఖండములును కూడ నత్యంతము హృదయంగమములుగ నున్నవి. విషయబాహుళ్యమున మాత్రమే కాక రచనానైపుణ్యమున గూడ నింత ప్రశంసనీయమై యున్న తమ పత్రికకు చందా రూపాయి మాత్రమే యగుట చూడ నిది యచిరకాలములోనే యాంధ్రపత్రికారాజావళిలో నద్వితీయాదరణమును పొందగలదా యను నాశ నాకు గలిగినది. తాము కోరినట్లు నేని పత్రికకు వ్యాసములు వ్రాయుచుండవలె ననియే సంకల్పించితిని. అవకాశము గైకొని ప్రథమవ్యాసము పంపెదను. నా యభినందనములు గ్రహింపుడు"

జటావల్లభుల పురుషోత్తమ్
ప్రిన్సిపల్, సంస్కృత కాలేజీ కొవ్వూరు.

౨౭

"ఇది మాసపత్రిక:—ఐదవ సంపుటమునందలి మొదటి సంచిక (౧౯౩౪ వ సంవత్సరము జనవరి పత్రిక)ను కృతజ్ఞతాపూర్వక వందనములతో అందుకొంటిమి. దీని సంపాదకులు శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. శ్రీ శాస్త్రిగారి రచనలను ఆంధ్రులీవరలో చవిచూచియే ఉన్నారు—భాషాసేవయందు వీరు కావించు పరిశ్రమ ప్రశంసనీయమైనది. తమ పత్రికను నేడు పునరుద్ధరించి దేశసేవకు వీరు నడుము గట్టిరి. "ప్రబుద్ధాంధ్ర" యందు వీరు వాడుకమాటలనే ఉపయోగించుచున్నారు. చిరకాలము ఆంధ్రదేశములో నిలిచియున్న శైలి సాంప్రదాయమును శ్రీ శాస్త్రిగారు మెడపట్టి నులిమివైచిరి. తాము ముందంజ వేసి తోడి ఆంధ్రులను ముందుల కురుకు డని హెచ్చరించుచున్నారు. ఆంధ్రసారస్వతమునుండి వెలి యైన వాడుకమాటలను ఉద్ధరించుటకై బద్ధకంకణు లైన వీరికి మా ధన్యవాదములు. ప్రజాసేవయే పరమావధిగా నెంచిన వీరు వాడుకమాటలనే అవలంబించుట సంతోషకరము. వ్రాయను, చదువను నేర్చినవారు మన సీమలో మిగుల తక్కువగా నున్నారు. కొంత డొక్కశుద్ధి గలవారు నిత్యము తాము వాడుచున్న మాటలనే బోధపరుచుకొనగలరు. వీరిని ఉద్ధరించవలె నన్న వీరికి తెలియని భాషను వీరి మ్రోల యేకరువు పెట్టిన యెడల ఏమో వెఱ్ఱిమొఱ్ఱి వాగు డని యెంచి నిలిచిన బురదలోనే నిలిచియుండ నూహింతురు; గాని సమున్నత జ్ఞానశిఖరమును చేరవలె నని వీరు ఉద్దేశింపరు. పామరుల తోడిదే నేటి లోక మని గుర్తించిన విజ్ఞానులలో నొక్కరైన శ్రీశాస్త్రిగారు పద్యములను త్రోసిరా జని వాడుకమాటలకు గురుపీఠ మిచ్చిరి. భాషకు స్వాతంత్ర్యము అవసరము, కాని స్వేచ్ఛ యను పేరున విచ్చలవిడి యైన గంతులాట కొంత నేడు తెలుగుసీమయందు పొడగట్టుచున్నది. సారస్వతహృదయము గంభీరమైనది. సారస్వతవదనము సౌందర్యోపేత మైనది.

సహజమైన మాటలను విఱిచి ముక్కలు చేయుచు అవి వాడుకమాట అని చెప్పు మహాశయులు తెలుగుసీమయందు పెక్కండ్రు ఉన్నారు. కూడని ఊహాలను క్రింద గూల్చి ప్రజాసేవ చేయుతఱి భాషయందలి కళాకౌశల్యమును తేటపరుచుట తమ కర్తవ్యమని కళాభివర్ధనీ పరిషత్తువారు గుర్తించినట్లు చక్కని జాతీయములతో నిండిన శ్రీ శాస్త్రిగారి శైలి ధ్రువపఱచుచున్నది. ఈ పత్రిక దినదినాభివృద్ధి గాంచుగాక యని ఆశపడుచుంటిమి. పత్రిక యెల్లరకును అందుబాటై ఉండుటకై సంపాదకులు ఒక్క రూపాయ మాత్రమే చందాగా నేర్పరిచిరి"

ఆంధ్రసహకార పత్రిక (జనవరి ౧౯౩౪)

—౨—

"రాజమహేంద్రపురకళాభివర్ధనీ పరిషత్తువారిచే ప్రకటిత మగు మాసపత్రిక. ఏతత్పత్రికాసంపాదకులు సుప్రసిద్ధ ఆంధ్రవ్యాసరచయిత లగు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. సంపాదకులు ప్రత్యేకముగ గద్యవ్యాసములనే ప్రచురింపసమకట్టుటలో కొంత న్యాయమును ధర్మమును గూడ నున్నట్లు గోచరించుచున్నది."

"ఏవాఙ్మయమునందైనను ప్రప్రథమమున గేయములును, తరువాత మానవుని హృదయకమలము వికసింపదొడంగిన కొలదిని పద్యములును, క్రమముగా విజ్ఞానసముపార్జనము సేయ, బుద్ధివికాసము గలిగినపుడు గద్యవాఙ్మయమును వృద్ధిపొందును. ఏదేశమునందైనను ఇదియే క్రమపరిణామము; కాని మన ఆంధ్రభాషలో నొక్క విశేషము మాత్రము గలదు. పద్యవాఙ్మయముతో బాటు గద్యవాఙ్మయముగూడ కొంచెముగానైనను ప్రథమము నుండియుం గలదు. పద్యమునకు గల ప్రాధాన్యము గద్యకు లేకున్నను వాఙ్మయమున తొలినుండియు దీనికి స్థానము మాత్రము లేకపోలేదు"

"కాని వాఙ్మయములో క్రమముగా రాదగిన మార్పే ఈ శతాబ్దిని చూపట్టినది. పద్యములపై నెక్కువ మక్కువ గలవారు గూడ గద్యరచనల నాదరింపదొడంగిరి. ఇట్టి భేదము క్రమముగా ప్రాచీనులలో గూడ గలదనుట కొక నిదర్శనము—ఒక తత్త్వమును ప్రబోధింపవలయు నన్న, మనసునకు హత్తునట్లుగా చెప్పుట కుపయోగకరము లగు సాధనములలో నాటకమున కగ్రస్థానము గలదు. ఇట్టి నాటకరచనలో మేటి యగు Shakespheare రచించిన ౩౯ నాటకములలో ప్రథమమున రచించిన ౧౧ నాటకములును పద్యమయములే. నాటకమంతయు పద్యపాదములతోడనే నడచును. (Blank Verse); కాని రానురాను గద్య, పద్యస్థానము నాక్రమించుటచే అంత మందలి ౧౮ నాటకములును గద్యప్రాధాన్యములుగనే వ్రాయఁబడెను"

"ఈపరిణామము ఎప్పటికైనను తప్పదు. సర్వజనసమాదరణీయ మగునది గద్యయే యని యెఱింగి కావలయు శ్రీ వీరేశలింగం పంతులుగారు ఎక్కువగా గద్యనే వ్రాసిరి"

"ఇందే మాత్రము న్యాయము లేదనియు, 'అనవద్య మగు గద్యవాఙ్మయము'న, 'పద్యములు' గూడ నున్న హృద్యముగా నుండుననియు కొందరు తలంపవచ్చును; కాని యిది యొక మతము. ఏ యొక్కటియు సర్వజన సమ్మతము కాజాలదు కదా! అట్లే యైనచో ఇన్ని దేవుళ్లేల—ఇన్ని మతము లేల—ఇన్ని గీత లేల—ఇన్ని వ్యాఖ్య లేల? ఇంతకును 'మహాఋషీణాం మతయశ్చ భిన్నాః'"

"శ్రీ సుబ్బరామయ్యగారు వ్రాసినట్లు—"మానవుని నిత్యజీవితమున కావశ్యకము లగు విషయముల దెలుపునట్టి గ్రంథములు వెలువడవలయును. అవి సరళము లగు గద్యరచనమున నుండవలయును" ఇట్టి రచనలను ప్రోత్సహింప సమకట్టిన శ్రీ శాస్త్రిగారు మాననీయులు"

ఆంధ్రవిశ్వ కళాపరిషత్ కళాశాల
తెనుఁగు సంఘ పత్రిక.
(సంక్రాంతి సంచిక జనవరి ౧౯౩౪)

౩౦

"తమరు పంపిన ప్రబుద్ధాంధ్ర ఫిబ్రవరి సంచిక చేరినది. నవీనాశయములతో పునర్జన్మించిన 'ప్రబుద్ధాంధ్ర' జగత్ప్రవృత్తిని గురించినట్లు స్పష్టమగుచున్నది. కథారచనలో అందెవేసిన చేయి, మీ సంపాదకత్వమున 'ప్రబుద్ధాంధ్ర' ఆంధ్రులకు అత్యంతము సేవ చేయగలదని నమ్ముచున్నాను. ప్రబుద్ధాంధ్ర చిరకాలము వర్ధిల్లు నని యాశించుచున్నాను"

పాటిబండ మాధవశర్మ

౩౧

"రాజమహేంద్రవరంనుండి కళాభివర్ధని పరిషత్పక్షమున గద్యరూపంతో వెలువడుతూన్న మాసపత్రిక. సంపాదకులు ఆంధ్రలోకానికి చిరపరిచితులైన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. విజ్ఞానవికాసాన్ని పెంపొందించే వచనవాఙ్మయాన్ని మాత్రమే సత్కరించడానికి నడుము కట్టుకొన్న యీ క్రొత్తపత్రిక అచిరకాలంలోనే ఆంధ్రభాషకు నూత్నతేజస్సూ, చైతన్యవికాసమూ కలిగిస్తా దని మా విశ్వాసము. ఉద్రేకములైన ఉన్నతరచనలతో విరాజిల్లుతూన్న యీ తొలి సంచికకు మా స్వాగతం చెబుతూ శ్రీశాస్త్రిగారి యుద్యమానికి విజయము నాకాంక్షిస్తున్నాం"

శశి (ఫిబ్రవరి ౧౯౩౪)

౩౨

"ప్రబుద్ధాంధ్ర:—మాసపత్రిక. సంపాదకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. ఆంధ్రదేశమున వీరిని తెలియనివా రుండరు. విషయము లన్నియు వచనముననే వ్రాయబడియున్నవి. భావప్రకటనమునకు వచనము తోడ్పడునట్లు పద్యము తోడ్పడదు. అందున వాడుకభాష—వచమునకే ప్రాధాన్య మీయబడినది. కావున ఆంధ్రవచనశైలి కూడా అరితేరుతుంది. "ఆంధ్రులు—ఆంధ్రము" అను వ్యాసము ఆంధ్రవాఙ్మయచరిత్రకును, ఆంధ్రోద్యమమునకు సాయపడుచున్నది. "ఆంధ్రుడు ఇకనైనా తన ప్రమత్తతను విడనాడుకోవలయును. అవివేకముగా ప్రవర్తించినందులకు పశ్చాత్తప్తుడు కావలెను" పత్రిక దినదినాభివృద్ధిని గాంచునని కోరుదుము"

సరస్వతి.

౩౩

"ప్రబుద్ధాంధ్ర శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంపాదకత్వము క్రింద రాజమహేంద్రవరమునుండి వెలువడుతున్న మాసపత్రిక సం॥ చందా ఒక రూపాయి 48 పేజీలతో వెలువడుతున్న ఈపత్రికలో మల్లంపల్లివారు, భావరాజువారు మల్లాదివారు, వేటూరివారు, జనమంచివారు, చింతావారు మున్నగు పత్రికాలోకమునకు పరిచితులైన వారంతా రసవంతమైన వ్యాసాలు కథలు వ్రాస్తున్నారు. "వేదికలు—పత్రికలు" "వ్యాఖ్యానములు" అనే శీర్షికల క్రింద ప్రకటింపబడిన విషయములు ఆకర్షవంతగా వున్నయి. శాస్త్రిగారి ప్రయత్నానికి ఆంధ్రులు చేయూత నియ్యాలి.

చిత్రగుప్త (1 వ మార్చి, 1934)

౩౪

"ఉభయభాషావిజ్ఞానము గల శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ప్రబుద్ధాంధ్రపత్రికను బునరుద్ధరించుటలో నాశ్చర్యమేమియు లేదు. వారు సమర్థులు. పత్రికను జక్కగా నడిపింపగలరు. శిష్టసమ్మతమగు శైలినే యవలంబించి యాంధ్రుల నాకర్షింపగల రని నా నమ్మకము. పద్యములకుం దావీయలే దని నేను విచారింపను. వర్తమానమున రసవంతమగు వచనమునకై యనేకు లుత్సాహపడుచుండుటను వారు గ్రహించి రనుకొనెదను. కవులును ధనవంతులును వారికి సాహాయ్య మొనరింపవలసియున్నది. భగవంతుడు వారి యుద్యమము నాశీర్వదించును గాక"

క్రొవ్విడి శేషవేంకటకాశీపతి

౩౫

"ప్రబుద్ధాంధ్ర:—రాజమండ్రి కళాభివర్ధనిపరి

షత్తు పత్రమున, సుప్రసిద్ధవచనరచయిత లగు పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంపాదకత్వమున మునుపటివలెనే ఒక రూపాయి చందాతో ఆంధ్రు లకు చిరపరిచిత మైన యీమాసపత్రిక పునరుద్ధ రింపబడినది. ఇప్పుడు మనకు చాల అవసరముగా నున్న వచనవాఙ్మయము నభివృద్ధిపరుచు నుద్దేశ ముతో సంపాదకులు ఈసారి ఈపత్రికల్లో పద్య ములను ప్రకటింపక, చక్కని సులభ శైలిలో గద్య వ్యాసములను తేట తెనుగుపదము లతో వినోద మైన, నీతిదాయక మైన కథలను, చక్కని విమర్శనలను ప్రకటించుచున్నారు''

లోకలుబోర్డు (ఫిబ్రవరి ౧౯౩౮)

౩౬

"చక్కని సాహిత్యముతో నిండి యున్నది. ఇంత స్వల్పమూల్యమున నిట్టి సర్వాంగసుందర పత్రిక లభించుట వరప్రసాద మనదగియున్నది''

రెడ్డి. (౩–౨–౧౯౩౮)

౩౭

"ప్రబుద్ధాంధ్ర రెండవ సంచిక చాలా ముచ్చ టగా వుంది. ఆంధ్రసోదరసోదరీమణు లంతా ఈపత్రికను ప్రోత్సహిస్తా రని నానమ్మకం''

నరహరిశెట్టి శేషగిరిరావు

# స్వీకారము

పత్రికలు

సమదర్శిని
ప్రజామిత్ర
గోల్కొండపత్రిక
చిత్రగుప్త
వినోదిని
సరస్వతి
శశి
త్రిలింగ
రెడ్డి
హిందూసుందరి
ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక
Vizagpatam Medical College Magazine
భారతీపత్రిక
కృష్ణాపత్రిక
సుబోధిని
కల్యాణి

గ్రంథములు

జాతకనారాయణీయము
రామప్రియ
ప్రేమతత్త్వము
ఆంధ్రభాషానుశాసనము
భాగవతావతరణము
చంద్రహారము
భూగృహము
పల్లెటూరిపదుచులు

వీటిని ముందుసంచికలో విమర్శింతుము